


www.prajapaksham.in

# ప్రజాపక్షం

ప్రతి అక్షరం ప్రజల కోసం




సంపుటి 08, సంచిక: 13 | సోమవారం | 09-12-2024 | మహబూబ్‌నగర్ Published from: **Mahabubnagar, Hyderabad, Khammam, Karimnagar** పేజీలు: 12 | వెల రూ. 5.00



జయ జయహే తెలంగాణ.. జననీ జయకేతనం...



## తెలంగాణ తల్లి

ప్రారంభకులు :
గౌరవ ముఖ్యమంత్రివర్యులు
శ్రీ. ఎ. రేవంత్ రెడ్డి గారు

తేదీ : 09 డిసెంబర్, 2024
సమయం : సాయంత్రం 6 : 05 గం.లకు,
స్థలం : డా. బి.ఆర్. అంబేద్కర్ తెలంగాణ సచివాలయం

జారీ చేసిన వారు: స్పెషల్ కమిషనర్, సమాచార పౌర సంబంధాల శాఖ, తెలంగాణ ప్రభుత్వం




# తెలుగులో కమ్యూనిస్టు ఉద్యమగీతాలు

**ఎస్వీ సత్యనారాయణ**

'పదండిరా పదండిరా పదండి కాలకంఠులై
పదండి రక్త కేతనాన్ని పూని వీరయోధులై
ప్రజోద్యమాలదీ యుగం శ్రమైక మూల మీ జగం
సమైక్య శక్తి చూపితే సమాజమెల్ల మారురా!'
(కె.రాజేశ్వరరావు)

'ఎర్రబాటరా ఇదే ఎర్ర బాటరా
శ్రమజీవుల రక్తంతో ఎరుపెక్కిన బాటరా
వీరులకే సాధ్యమైన విప్లవాల బాటరా
పోరాటాలుద్యమాల మైలురాళ్ళ నాటరా!'
(ఏటుకూరి ప్రసాద్)

'కూలినాలి జనుల కూటమిగ నిలబెట్టి
జాలి బతుకుల్లోన జ్వాలలను రగిలించి
కదిలి నడిపే పార్టీరా మన పార్టీ కమ్యూనిస్టు పార్టీరా'
(చైతన్య ప్రసాద్)

'అగ్ని గుండంలోన పడి నడచి వచ్చింది
దీర్ఘకాలిక చరితరా! మన పార్టీ
అమరవీరుల సాక్షిరా!
దోపిడీ సంకెళ్ళ ఛేదింపు
లక్ష్యమై శ్రమజీవులందరిని రమ్మందిరా
మన పార్టీ శ్రమశక్తి నడ్డేది లేదందిరా!'
(ఆవంత్స సోమసుందర్)

వందలాదిగా తెలుగు కవులు తమ గీతాల్లో కమ్యూనిస్టు చైతన్యాన్ని ప్రదర్శించారు. ఆకలికి, అణచివేతకు, దోపిడీకీ, దౌర్జన్యాలకూ తావులేని సమ సమాజ నిర్మాణాన్ని ఆకాంక్షించారు. 1925 డిసెంబర్26–28 తేదీల్లో కాన్పూర్‌లో 'ప్రారంభ మహాసభ' ను జరుపుకుని ఆవిర్భవించిన భారత కమ్యూనిస్టు పార్టీ (సిపిఐ) గత వంద సంవత్సరాలుగా పీడితప్రజల ప్రయోజనాలను పరిరక్షించడం కోసం నిర్విరామ కృషిని కొనసాగిస్తున్నది. వివిధ ప్రజా సంఘాలను నిర్మించడంద్వారా ఆయా ప్రజా శ్రేణులను సమీకరించి, చైతన్యపరిచి, సమరశీల పోరాటాలను కొనసాగిస్తున్నది. 1934 నాటికి 'కమ్యూనిస్టు ఉద్యమం' ఆంధ్ర ప్రాంతానికి విస్తరించింది. ఆంధ్ర ప్రాంత కమ్యూనిస్టు పార్టీ ప్రథమమహాసభ కాకినాడలోని అన్నదాన సమాజ సత్రంలో 1936 జనవరి 29వ తేదీన జరిగింది.ఈ సమావేశానికి కేంద్రపార్టీ పక్షాన కామ్రేడ్ ఎస్‌వి ఘాటే హాజరయ్యారు. ఆంధ్రరాష్ట్ర కమ్యూనిస్టు పార్టీ 3వరాష్ట్ర మహాసభ 1943జులై 3న విజయవాడలోని దుర్గా అగ్రహారంలో జరిగింది. అప్పటికీ పార్టీసభ్యుల సంఖ్య 3,250. వివిధ జిల్లాల నుండి 200మంది ప్రతినిధులు హాజరయిన ఈ మహాసభ చంద్రరాజేశ్వరరావు గారిని రాష్ట్రసమితి కార్యదర్శిగా ఎన్నుకున్నది. 1943–47మధ్యకాలంలో ఆంధ్రప్రాంతంలోని అనేక ప్రాంతాలకు కమ్యూనిస్టు పార్టీ విస్తరించింది. భారత స్వాతంత్ర్య సంగ్రామంలో, చారిత్రాత్మక తెలంగాణా సాయుధ రైతాంగ పోరాటంలో, విశాలాంధ్రలో ప్రజారాజ్యం నినాదంతో సాగిన సమైక్యాంధ్ర నిర్మాణోద్యమంలో విశిష్టమైన పాత్రను నిర్వహించింది. తెలుగునేలపై తలెత్తిన ప్రజోద్యమాలన్నింటిలోనూ భారత కమ్యూనిస్టు పార్టీ అగ్రగామి పాత్రను నిర్వహిస్తూ, జనజీవన సమరాలకు సారథ్యం వహిస్తున్నది. సహజంగానే తెలుగు కవులు కమ్యూనిస్టు ఉద్యమ చైతన్యంతో గత వంద సంవత్సరాలుగా విభిన్న సాహిత్య ప్రక్రియలనూ, కళారూపాలనూ సృష్టిస్తున్నారు. ప్రజలను చైతన్యపరుస్తున్నారు. ప్రజాపోరాటాల నుండి తాము ప్రేరణ పొందుతున్నారు.

## తెలుగులో తొలి ఎర్రజెండా గీతం

శ్రమజీవుల పోరాటాలకు ప్రతీక అరుణ పతాక. శ్రామిక వర్గం త్యాగాలకు నిలువెత్తు రూపం ఎర్రజెండా. తెలుగులో తొలి ఎర్రజెండా గీతాన్ని ఆంధ్రా కమ్యూనిస్టు ఉద్యమ నిర్మాతల్లో ఒకరైన కామ్రేడ్ తుమ్మల వెంకటరామయ్య రచించారు. 1935 జూన్ 20న తుమ్మల రాసిన తొలి ఎర్రజెండా గీతం 'ప్రభ' అన్న పత్రికలో అచ్చయ్యింది.

'ఎగరాలి ఎగరాలి మన ఎర్రజెండా
అదురు బెదురూ లేక అడ్డేదియును లేక ॥ఎగరాలి॥
సామ్రాజ్యవాదంబు సమసిపోవంగా
ధనికవాదంబింక దగ్ధమైపోగా
కార్మికుల్ కర్షకుల్ కరము కరమూ గల్పి
జై మనకు జైయంచు జేజేలు కొట్టంగ ॥ఎగరాలి॥'

అంటూ సామ్రాజ్యవాదం సమసిపోవాలనీ, ధనికవాదం దగ్ధమైపోవాలనీ ఆకాంక్షించిన ప్రజాకవి తుమ్మల వెంకటరామయ్య

## అంతర్జాతీయ గీతం

1871 నాటి పారిస్ కమ్యూన్ పతనానంతరం పారిస్ విప్లవయోధుడు, కవి యూజీనీ పాటియర్ లండన్‌లో ప్రవాస జీవితం గడపడానికి వెళ్ళే ముందు ఫ్రెంచి భాషలో ఒక అంతర్జాతీయ గీతం 'ఇంటర్నేషనల్' రాశారు. అన్నిదేశాల కమ్యూనిస్టు పార్టీలకూ, కార్మికోద్యమాలకూ అది ప్రార్థనా గీతమయ్యింది. దీని ఆంగ్లానువాదాన్ని ప్రేరణగా తీసుకుని బాలాంత్రపు రజనీకాంతరావు తెలుగులోకి (1936 నాటికే) అనువదించారు.

'ఆకలి మంటల మలమల మాడే
అనాధులందరు లేవండోయ్
హింసారతిని సహించగలేకా
ఈసడించినది ధర్మంబెల్ల
మంచి'దినాలూ రానున్నాయీ
మనకందరకును లేవండోయ్'

అంటూ ప్రారంభమయ్యే గీతంలో తరతరాల దాస్యాన్ని అంతం చేయడానికి దాసులందరూ కదలాలనీ, ప్రపంచ ప్రజానీకమంతా ఒకే కులమై, మానవ కులమై అంతిమ పోరాటానికి నడుం బిగించాలనీ కవి నిర్దేశించారు. 1970 దశకంలో పాటియర్ అంతర్జాతీయ గీతం బాణిని అనుసరించి, భావానువాదం చేసిన ప్రతిభావంతుడు రాంభట్ల కృష్ణమూర్తి. 'లేవండి వంచితులార! పురిటాకలి వరకమునించి ఘోషించె మోచనలావ! గగనాలన్ ముంచెత్తించి ఇంటర్... నేషనేల్ ... నరజాతి సమైక్యవరం' అనే పల్లవితో సాగిన రాంభట్ల అనువాదం, దాదాపు ప్రపంచ భాషలన్నింటిలో గానం చేయబడుతున్న బాణిలో సాగడం విశేషం.

## తొలి కార్మిక గీతం

1936–37 మధ్యకాలంలో గుంటూరులోని కూలివాడల్లో, మిల్లుల్లో, బజార్లలో తిరిగి కార్మికులకు వారి కష్టసుఖాలను వివరిస్తూ, కార్మిక సంఘాల నిర్మాణావశ్యకతను తెలుపుతున్న నేపథ్యంలో పెండ్యాల లోకనాథం తొలినాటి కార్మికగీతాలు రచించారు.

'కూలీలందరు ఏకమైతే కూటికి తరుగేమిరా
కూలివాండ్లలోనె బలిమీ కాలమందున నుండెరా
కూలివాండ్లమైన మనకు కులములెందుకు
తెలుపరా
కూలివాండ్లమైన మనము
కలిసి ఉందము సోదరా
అన్నా! కూలీలేకము కావలెరా!'
అంటూ ఎనిమిది చరణాల 'కూలిపాట'ను
రచించి, శ్రామిక వాడల్లో పాడుతూ,
శ్రమజీవులను సంఘటిత పరిచారు.
'కష్టపడి ఈ మేడలన్నీ కట్టినది మనమే కదా
కష్టపడి ఈ ఫ్యాక్టరీలు కట్టివారల కిస్తిమీ
కష్టజీవులమైన మనకు గుడిసెలే గతియాయెరా
కష్టపడి పని చేయుచున్నను
కడుపు నిండుట లేదురా
అన్నా! కూలీలేకము కావలెరా!'

అని ఆనాడు లోకనాథం చేసిన చైతన్యయుత ప్రబోధం ఈనాటికీ కార్మికగీతాలు రాస్తున్న కవులకు ఒరవడిగా ఉన్నది. 1937–38లో చీరాలలో పొగాకు కార్మికులు సమ్మె చేసినప్పుడు, ప్రభుత్వం కాల్పులు జరిపింది. అప్పుడు మద్రాస్ అసెంబ్లీ గద్దెపై కాంగ్రెస్ మంత్రివర్గం ఉంది. కాల్పుల్లో కొందరు కార్మికులు మరణించారు. కోపోద్రిక్తుడైన పెండ్యాల లోకనాథం.

'విప్లవము రావాలి విప్లవము రావాలి
విప్లవ జ్వాలలతో విశ్వమే నిండాలి'
అని ఎలుగెత్తి చాటారు.
కార్మిక భజనావళి
'వద్దురా! మనకొద్దురా!!
యిక భాగ్యవంతుల పెత్తనంబు... వద్దురా'

అనే విప్లవాత్మక సందేశాన్ని శ్రామిక ప్రజానీకానికి అందించిన 'కార్మిక భజనావళి' 1937 మే మాసంలో వెలువడింది. 'సామ్యవాదము పైపైకి ఎక్కివచ్చుచున్న యీ కాలంలో పూర్వపు సాంఘిక జీవనము, ఆర్థికజీవనము, కట్టుబాట్లు శిథిలములు కాకతప్పవు. ఇప్పుడు ప్రతి జీవియు స్వేచ్ఛా వాతావరణమున విచ్చలవిడి విహరింప దలచుకొని యుండుట ఒక భాగ్యవిశేషము. ఒకడు సుఖజీవి. ఇంకొకడు కష్టజీవి. ఇటువంటి భేదములు గల దేశము ప్రత్యక్ష నరకమునకు పట్టుగొమ్మ' అంటూ సంకలన కర్తలు, తమ ముందుమాటలో ప్రకటించారు.

## క్రాంతిగీతాలు

తెలుగులో ఇప్పటికి లభ్యమవుతున్న వాటిలో 'కార్మిక భజనావళి' (1937) తర్వాత, శ్రామిక గీతాల సమగ్ర సంకలనంగా పేర్కొనదగినది 'క్రాంతిగీతాలు'. 1938 అక్టోబర్‌లో గద్దె లింగయ్య సంపాదకత్వంలో ఆదర్శ గ్రంథ మండలి ప్రచురణగా ఈ సంకలనం వెలువడింది. శ్రమజీవుల జీవితచిత్రణంతో పాటు, శ్రామిక వర్గ పోరాటాల ప్రబోధం ఈ గీతాల తాత్వికత. నేడు విశేషప్రచారాన్ని పొందిన, పొందుతున్న అనేక శ్రామిక గీతాలకు మాతృకల వంటి అంశాలు ఈ సంకలనంలో ఉన్నాయి.

## క్రాంతి గీతాలపై నిషేధం

శ్రామికవర్గ సాహిత్యం ప్రారంభమైనప్పటి నుండీ, నేటివరకూ ప్రభుత్వ నిర్బంధాలనూ, ఆటుపోట్లను ఎదుర్కొంటూనే ఉంది. 1935 జులైలోనే క్రొవ్విడి లింగరాజు అనువదించిన గోర్కీ నవల 'అమ్మ'ను బ్రిటీష్ ప్రభుత్వం నిషేధించింది. సుంకర సత్యనారాయణ రచించిన 'అల్లూరి సీతారామరాజు' బుర్రకథక్కూడా నిషేధం తప్పలేదు. అదే వరసలో తెలంగాణా సాయుధ పోరాటకాలంలో నిజాం ప్రభుత్వం క్రాంతి గీతాలను నిషేధించింది. (ఫైల్ నంబర్ 54/పి.యు.ఎస్/ 5ఎఫ్)లో తుమ్మల 'ఎర్రజెండా గీతం', మద్దూరి అన్నపూర్ణయ్యగారి 'కూలీల రాజ్యం', కవి పేరు లేకుండా ప్రచురించిన 'విప్లవగీతం' మొదలైనవి నిషేధానికి కారణాలుగా ప్రభుత్వం చూపింది.

## మహాప్రస్థానం గీతాలు

మాటల్లో మంటల్నీ, పాటల్లో ఈటెల్నీ , అభివ్యక్తిలో సలసల కాగే చమురునే కాదు ఉష్ణరక్త కాసారాన్నీ ప్రసరింపజేసిన మహాకవి శ్రీశ్రీ, శ్రమైక జీవన సౌందర్యానికి సమానమైనది లేనే లేదని ఘంటాపథంగా ప్రకటించిన శ్రీశ్రీ

తన కవిత్వాన్ని...
'కార్మికలోకపు కళ్యాణానికి
శ్రామికలోకపు సౌభాగ్యానికి
సమర్పణంగా.. సమర్చనంగా'

రచిస్తున్నాననీ, సహస్రవృత్తుల సమస్త చిహ్నాలూ తన కవిత్వానికి భావంగా, భాగ్యంగా, ప్రాణంగా, ప్రణవంగా స్వీకరించాడు. మరో ప్రపంచ నిర్మాణం తన కవిత్వ ఆశయంగా ప్రదర్శించాడు. ఆధునిక కవిత్వాన్ని శ్రామిక జన కవిత్వంగా మలిచిన ప్రతిభావంతుడైన ప్రజాకవి శ్రీశ్రీ.

## మేడే గీతాలు

ప్రపంచవ్యాప్తంగా కార్మికుల పండుగదినం 'మేడే'. అనేకానేక భాషల్లో వెలువడినట్లే తెలుగులోనూ 'మేడే' గురించి వందలాది గీతాలు వెలువడినాయి.

'పీడితులారా! తాడితులారా!
ప్రపంచ కార్మిక కర్షకులారా!
ఏకం కండోయ్! ఏకం కండోయ్
మేదినోత్సవం మేలుకొల్పున
మానవశక్తులు మహాగ్ని శిఖలై
దాస్యం దోపిడి దుఃఖపూరితము
యుద్ధ పూరితము యూరప్ నలమిన
కాళరాత్రిని కబళించినవీ'

అంటున్న పులుపుల వెంకట శివయ్య మేదినోత్సవం అరుణచ్ఛాయలో విజృంభించిన విప్లవశక్తుల్నీ, ప్రజారాజ్యస్థాపన కోసం ఎగురుతున్న ఎర్ర పతాకాన్నీ వర్ణించారు.

'పీడిత లోకం తాడిత లోకం
నూతన మానవ భూతల స్వర్గం
నెలకొల్పుటకై నిజ రక్తంలో
స్నానం చేసినదీనాడే శంకుస్థాపన ఈనాడే'

అంటూ 'మేడే' గీతంలో కార్మిక, కర్షక సింహాలు కత్తిని దూసిన, సుత్తెను జూపిన మేడేను జ్ఞప్తికి తెచ్చుకొమ్మంటున్నారు ప్రజాకవి సుంకర సత్యనారాయణ. అలాగే ప్రజల్లో బాగా ప్రచారం పొందిన మేడే గీతాలను రెంటాల గోపాలకృష్ణ, తుమ్మల, గజ్జెల మల్లారెడ్డి, గద్దర్, ఏటుకూరి ప్రసాద్, ఎస్వీ, రాంభట్ల, అదృష్టదీపక్ తదితరకవులు రచించారు.




## శ్రామిక గీతాలు

చేతన సాహితి వారి 'కల్పన' (1953), విశాలాంధ్ర ప్రచురణాలయం వారి 'స్వేచ్ఛా పథం' (1961), ప్రజా నాట్య మండలి వారి 'ప్రతిధ్వని' (1981), జనసాహితి వారి 'జనం పాటలు' (1981), అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య వారి 'అరుణకిరణాలు' మొదలైన సంకలనాల్లోనూ; అభ్యుదయ, విప్లవకవుల గీతికా సంపుటుల్లోనూ వందలాది కార్మిక గీతాలు ప్రచురితమయ్యాయి.

'ఓ రోరి కార్మికన్నా! ఓరయ్యో కార్మికన్నా!
ఎన్నాళ్లు కష్టపడ్డా అన్నామె కరువురన్నా!
ఓరోరి కార్మికన్నా!'

అనే పల్లవితో సాగే ఏటుకూరి ప్రసాద్ గీతం కార్మికవాడల్లో ప్రతిధ్వనిస్తూ ఉంటుంది. అలాగే గద్దర్ రాసిన 'గ్యాంగోల్లపాట', 'సిరిమల్లె సెట్టుకింద లచ్చుమమ్మ', 'నా కూలినాలన్నలు', 'వొడ్డెరోల్లపాట', 'ఏం బతుకులు మన యిరో', 'రిక్షా దొక్కే రహీమన్నా', 'కంపెనీ కూలోడ' మొదలైన గీతాలు కార్మిక గీతాల్లో శక్తివంతమైనవి. చెరబండరాజు రాసిన 'కొండలు పగలేసినం', 'పేదవాళ్ళు', 'అన్నలార!', 'హమాలన్నా కూలన్నా' మొదలైన వాటిలో ప్రతి గీతం ఒక నెత్తుటి దీపం. వంగపండు ప్రసాదరావు విశాఖపట్టణం (శ్రామిక పట్టణం) శ్రామికుల భాషను సొంతం చేసుకుని, ప్రఖ్యాత బాణీల్లో వినికిడి మాత్రంగా గుర్తుండిపోయే పాటలు అల్లారు.

'రండిరో... లెండిరో.. కూలన్నా!
సంఘం బెడదామూ... సంగతేందో సూద్దామూ
రండిరో కూలన్నా!'

అంటున్న వంగపండు గీతం ఆంధ్ర దేశమంతా మార్మోగుతున్నది.

'ఓ శ్రమదోపిడి దొంగల్లారా!
సమసమాజ శత్రువులారా!'

అంటూ వై.విజయకుమార్ పెట్టుబడిదార్లను నిలదీస్తే...

'హెచ్చరిక పాలకుల్లారా!
హెచ్చరిక పాలకుల శ్యాలకుల్లారా!'
అంటూ రాంభట్ల కృష్ణమూర్తి హెచ్చరించారు.
'కార్మికవర్గం కళ్ళు తెరిస్తే
కదనానికి తొడగొట్టునులే
పెత్తందారుల పెట్టుబడులపై
తిరుగుబాటు కొనసాగునులే'

అంటూ ఒక అభ్యుదయ కవి (ఎస్వీ) స్పష్టం చేస్తుంటే...

'కార్మికులం.. శ్రామికులం
తరతరాల దోపిడిలో
నలిగిన కూలీలం'

అంటూ కె.ప్రతాపరెడ్డి శ్రమజీవుల జీవనరాగాన్ని పల్లవిగా తీసుకుని, పాటలల్లారు.

## ఎర్రజెండా పాటలు

తుమ్మల వెంకటరామయ్య రాసిన తొలి ఎర్రజెండా గీతాన్ని గురించి చర్చించుకున్నాం. తరువాతి కాలంలో కమ్యూనిస్టు ఉద్యమవ్యాప్తితో బాటు అనేక ఎర్రజెండా గీతాలు తెలుగుభాషలో వెలువడ్డాయి. వాటిలో బాగా ప్రఖ్యాతిచెంది, ప్రజల నోళ్ళలో గూళ్ళు కట్టుకున్న పలు గీతాలున్నాయి. 1954లో పార్లమెంట్‌లో ఒక సభ్యుడు ఎర్రజెండాను విదేశీయమైనదిగా విమర్శించాడు. అప్పటి ప్రధానమంత్రి జవహర్‌లాల్ నెహ్రూ కూడా దాన్ని సమర్థించాడన్న వార్తను

• సశేషం

అరుదైన ఫోటో



## తెలుగు సాహితీ వనంలో విరిసిన విదుషీమణులు..

(నిల్చున్నవారు ఎడమనుంచి కుడికి) పొత్తూరి విజయలక్ష్మి, ముక్తేవి భారతి, శీలా సుభద్రాదేవి, గోవిందరాజుల సీతాదేవి, శాంత సుందరి, కెబి లక్ష్మి, కొండవీటి సత్యవతి, శారదా అశోక్ వర్ధన్, బోయి హైమవతి. (కూర్చున్న వారు ఎడమనుంచి కుడికి) పోలాప్రగడ రాజ్యలక్ష్మి, తురగా జానకి రాణి, కొడవటిగంటి వరూధిని, నాయని కృష్ణ కుమారి, కె రామలక్ష్మి, ఆరుద్ర, ఉన్నవ విజయలక్ష్మి.

## తెలుగు సాహిత్యంలో మణిపూస కట్టమంచి


డిసెంబర్ 10న జయంతి

తెలుగు సాహితీ వైతాళికుల్లో కట్టమంచి రామలింగా రెడ్డి (10, డిసెంబర్ 1880– 24 ఫిబ్రవరి, 1951)మొదటి వరుసలో ఉంటారు. తెలుగు కవిత్వాన్ని కొత్తపుంతలు తొక్కించిన 'ముసలమ్మ మరణం' పుస్తకం 1889లో ప్రచురితమైంది. అప్పటికి కట్టమంచి వయసు కేవలం 19 సంవత్సరాలు. ఆధునిక భావాలున్న సరికొత్త కవితా విధానం ప్రజల్లోకి తొందరగానే చొచ్చుకుపోయింది. మద్రాసు క్రైస్తవ కళాశాలలో జరిగిన ఓ కార్యక్రమంలో కళాపూర్ణోదయంపై చేసిన ఉపన్యాసాన్ని, ఆయన ఇంగ్లాండ్‌లో విద్యాభ్యాసం పూర్తిచేసుకొని తిరిగి వచ్చిన తర్వాత మరింత విస్తృత పరిచారు. మైసూరులో ఆచార్య పదవిలో స్థిరపడిన అనంతరం, మరింత వివరంగా మార్చిన నాటి ప్రసంగాన్ని 'కవిత్వ తత్వవిచారము' అనే పేరుతో పుస్తక రూపంలోకి తెచ్చారు. తెలుగులో అప్పటి వరకూ లేని సాహిత్య విమర్శను కట్టమంచి తొలిసారి పరిచయం చేశారు. ఒక పుస్తకాన్ని చదివినప్పుడు, అందులోని వస్తువును, రూపాన్ని, కథన విధానాన్నీ విశ్లేషించడం ఆయనతోనే ప్రారంభమైంది. ఒక రకంగా చెప్పాలంటే, కవిత్వంపై చర్చలు ఆయనతోనే ప్రారంభమయ్యాయి. పింగళి సూరన వంటి గత తరం మేటి కవులను కూడా ఆయన విడిచిపెట్టలేదు. సహేతుకమైన విమర్శలు పాఠకులను ఆకట్టుకున్నాయి. ప్రజాస్వామ్య భావాలను తెలుగు సాహిత్య విమర్శలోకి ప్రవేశపెట్టారు. కవిత్వం దాగివున్న కవిత్వ తత్వాన్ని పరిశీలించడం అత్యవసరమని ఆయన అభిప్రాయం. ఆ కోణంలోనే సాహితీ విశ్లేషణలు, విమర్శలు కొనసాగించారు. మనిషిలోని ఆలోచనలు, భావాలు, సంకల్పాలను ఆయన ప్రధానంగా తరికించి చూశారు. భావ కవిత్వంలో విశేషణాలకే అత్యధిక ప్రాధాన్యం ఇవ్వడంతో, వాస్తవికత దూరమవుతున్నదని ఆయన అభిప్రాయం. పండితులు, కవులకు మధ్య తేడాను ఆయన పలు సందర్భాల్లో ప్రస్తావించారు. సామాన్య పాఠకులకు చేరని రచనలు చేసే పండితులు, తమ పాండిత్యాన్ని చాటుకోవడానికి ప్రయత్నిస్తూ, పాఠకులను ఆకట్టుకోలేకపోతున్నారన్నది కట్టమంచి అభిప్రాయం. మానవుల సహజభావోద్రేకాలకు మనోవికారాలన్న పేరుపెట్టి నిరసించడాన్ని ఖండించారు. రచన ఏదైనా, వస్తువు, రూపం రెండూ కీలకమని, వీటిలో ఏ ఒకటి తక్కువైనా, ఆ రచన పండదని ఆయన ఉద్దేశం. ఈ కోణంలో చూస్తే ఆయన భావకవిత్వాన్ని మాత్రమే వ్యతిరేకిస్తారని అనుకోవచ్చు. కానీ, ఆ రోజుల్లని అభ్యుదయ కవిత్వంపైన కూడా ఆయన పెద్దగా దృష్టిపెట్టలేదు. అందుకే, ఆయన తన రచనల్లో శుద్ధ గ్రాంధిక భాషనే వాడారు. విభిన్నమైన ఆలోచనా ధోరణి ఉంది కాబట్టే, కట్టమంచి ఫలానా రకమైన కవిత్వ పంథాను అనుసరించారని చెప్పడానికి వీల్లేని పరిస్థితి నెలకొంది. విమర్శకుల అభిప్రాయాలు, ఆరోపణలు ఎలావున్నప్పటికీ, కట్టమంచి తెలుగు సాహిత్యంలో కొత్త ఒరవడికి శ్రీకారం చుట్టారన్నది వాస్తవం.

## బహుభాషావేత్త సుబ్రహ్మణ్య భారతి


డిసెంబర్ 11న జయంతి

'భారతియార్', 'మహాకవి భారతి'గా ప్రసిద్ధి చెందిన చిన్నస్వామి సుబ్రహ్మణ్య భారతి (11 డిసెంబర్, 1882–11 సెప్టెంబర్, 1921) బహుభాషావేత్త. తమిళనాట పుట్టిన అతను గొప్ప రచయితగా, కవిగా, పాత్రికేయుడిగా, భారత స్వాతంత్ర ఉద్యమ కార్యకర్తగా, సంఘ సంస్కర్తగా బహుముఖ ప్రతిభ కనబరిచాడు. అతను ఆధునిక తమిళ కవిత్వానికి మార్గదర్శకుడు. తమిళ సాహితీవేత్తలలో అత్యున్నత స్థానాన్ని సంపాదించిన ప్రతిభావంతుడు. అతని అనేక రచనలలో భారత స్వాతంత్ర్య ఉద్యమ సమయంలో దేశభక్తిని రగిలించే ఆవేశపూరిత పాటలు ఉన్నాయి. తిరునెల్వేలి జిల్లా (ప్రస్తుత తూత్తుకుడి)లోని ఎట్టయపురంలో జన్మించిన భారతి తిరునెల్వేలి, వారణాసిలో ప్రాథమిక విద్యను అభ్యసించి, 'ది హిందూ'సహా 'బాల భారత', 'విజయ', 'చక్రవర్తిని', 'స్వదేశమిత్రన్', 'ఇండియా' వంటి అనేక వార్తా పత్రికల్లో జర్నలిస్టుగా పని చేశాడు. స్వాతంత్ర్య సమరానికి మద్దతుగా నిలిచి, అనేక ఉత్తేజితమైన రచనలు చేసిన భారతిపై అప్పటి బ్రిటిష్ ప్రభుత్వం 1908లో అరెస్టు వారెంట్ జారీ చేసింది. దీనితో అతను పది సంవత్సరాలు, అంటే 1918 వరకు కేంద్రపాలిత ప్రాంతమైన పాండిచ్చేరికి వెళ్లాడు. అక్కడి నుంచి కూడా తన రచనా వ్యాసంగాన్ని కొనసాగించాడు. తమిళ సాహిత్యంపై అపారమైన ప్రభావం చూపిన భారతికి 14 భాషల్లో ప్రావీణ్యం ఉంది. అందుకే, అతనిని బహుభాషావేత్తగా చెప్తారు. అయితే, అన్ని భాషల్లోకి తమిళం అంటే ఎంతో ఇష్టపడేవాడు. భారతి రాసిన లేదా స్వపరచిన పాటలు, పద్యాలు ఇప్పటికే తమిళ సినిమాల్లో ఏదో ఒక సందర్భంలో వినిపిస్తునే ఉంటాయి.

## త్యాగాల బాట పాట

నూరేళ్ళ నిజం పాట ఇది
కమ్యునిజం బాట ఈ
దేశ ప్రజలు త్యాగాలతో
రాసుకున్నపాట ॥
ఒకరికోసమొకరం
అందరికోసం ఒకరం
తోడంటూ సాగేదే
కమ్యునిజం నీవెన్నుతట్టి
నిలిపేదేకమ్యునిజం
వర్గాలుండొద్దంటూ
శ్రమజీవులు ఒకటంటూ
శాంతి కాంతి జల్లేదే
కమ్యునిజం ॥
మానవతను బోధిస్తూ
సమానతను చాటిస్తూ
జనాన్ని కలిపుంచేదే
కమ్యునిజం ॥
పేదల బాధల పాటకు
పల్లవిగా ముందుండే
పోరుపతాకంరా ఇది
కమ్యునిజం
నీకు పోరుపాట నేర్పేరా
కమ్యునిజం ॥
నూరు వసంతాల బాట
త్యాగధనుల రక్తంతో
ఎర్రగరాసిన చరితే కమ్యునిజం ॥
అజేయమై అమేయమై
జనాల గుండె నిలయమై
వెలుగొందే శాంరా కమ్యునిజం
నీకు కొత్త చూపునిచ్చేరా
కమ్యునిజం ॥
మతద్వేషాలను పెంచే
పాలకవర్గాల ఆట
కట్టించే సూత్రంరా కమ్యునిజం
నీలో సమభావం నింపేరా
కమ్యునిజం ॥
భరత రాజకీయాల్లో
మేలిమి బంగారంతో
రాసిన చరితున్నదేరా
కమ్యునిజం ॥
కమ్యునిజం ఊపిరితో
బతికేద్దాం అని అందాం....
ఎర్రబాటలో ఒకటై
కదిలెల్దాం అని అందాం....
రెపరెపలాడే ఎర్రని
జండాలకు జై అందాం....
ఇదే నేటి శపథమంటు
మునుముందుకె అడుగేద్దాం

ఏటుకూరి ప్రసాద్

## ఈ వారం కవితలు

## శతాధిక వసంతాల చరిత

శతాధిక వసంతాల చరితగల పార్టీరా కష్టజీవి
ఉద్యమాల కమ్యూనిస్టు పార్టీరా ॥శతా॥

చీకటిలో వేకువై చైతన్యం నింపెరా
కార్మికులను కర్షకులను కూడగట్టి నిలిపెరా
వలసవాద పాలనపై విప్లవాగ్ని చిమ్మెరా
దాస్య శృంఖలాలు తెంప దీక్షబూని సాగెరా ॥శతా॥

స్వాతంత్ర్యం మాహక్కని సమరాలను నడిపెరా
తెభాగ పున్నాప్ర తెగువ ఉద్యమాలురా
తెలంగాణ సాయుధపోరాట హోరురా
త్యాగధనుల రక్తంతో తరిగని ఎరుపాయెరా ॥శతా॥

కుట్రకేసులు జైళ్లయినా కుమిలి వెరువలేదురా
నిర్బంధం నిషేధాలు నిత్యం ఎదిరించెరా
సమసమాజ నిర్మాణం సాధనే ధ్యేయంగా
కాన్పూర్‌లో పుట్టి దేశక్రాంతి మార్గమాయెరా ॥శతా॥

స్వరాజ్యంలో ప్రజాస్వామ్య పోరుపథం నిలిచెరా
దోపిడి చెరనుండి దేశస్వేచ్ఛ గొంతుకాయెరా



పీడిత జన పక్షపాత హక్కుల కండాయెరా
సమానతా మానవతాసాధన జెండాయెరా ॥శతా॥

వర్గరహిత సమసమాజదుర్గమే గమ్యంగా
మార్క్సిజం అజేయంగా మనకు దారి అందెరా
ఐక్య ఉద్యమాలే మనకు ఆయుధ బలగంగా
ఎర్రజెండే భవితకండా ఏకమవుదమందిరా ॥శతా॥

–వేల్పుల నారాయణ
(కమ్యూనిస్టు పార్టీ శత వసంతాల సంబురాల సందర్భంగా )

## ఎర్రజెండాలన్నీ ఏకమైతే..

ఎర్రజెండాలన్నీ ఏకమైతే...
మహోన్నతమైన
మార్క్సిజమే
మానవాళికి దిక్సూచిగా
ప్రపంచ కార్మికులారా ఏకంకండి
నినాదంతో
పెట్టుబడిదారి వ్యవస్థలు
ఫెల్లుమని కూలిపోయాయి
సామ్రాజ్యవాద దేశాలు
చల్లగా జారుకున్నాయి
విశాల భారత దేశంలో
చైతన్యవంతులంతా కలిశారు
ఎర్రజెండానే దివిటిగా
భారత కమ్యూనిస్టు పార్టీని
ఏర్పరిచారు
స్వాతంత్ర్యానికై పోరాటం
చేశారు
ఏళ్లకేళ్లు చెరసాలల్లోఉన్నారు
చిత్రహింసలెన్నోఅనుభవించారు
సామాజిక ఆర్థిక రంగాల్లో
ఉద్యమాలు కొనసాగించారు
క్రమంగా.... సిద్ధాంతాల చర్చల్లో
రాద్ధాంతాలు మొదలయ్యాయి
ఒక పార్టీ రెండుగా
రెండు పార్టీలు నాలుగుగా
చీలుతూ కమ్యూనిస్టు పార్టీల
విస్ఫోటనం ప్రారంభమైంది
ప్రజల మధ్యన ఉన్న కమ్యూనిస్టు
పార్టీలు ఉద్యమాలు చేస్తూ
ఉనికిని కాపాడుకుంటున్నాయి
ఓట్ల కోసం జరిగే
ఎన్నికల రణరంగంలో
బూర్జువా పార్టీలతో
పోటీలు పడలేక
వెనుకబడిపోతున్నాయి
ప్రజల సమస్యల
పరిష్కారంకోసమే
తుపాకి చేతబట్టి
అడవి బాట పట్టిన
కమ్యూనిస్టు పార్టీలు
రక్తపు ధారుల్లో రణం
చేస్తున్నాయి
విజయాలు కొన్ని
అపజయాలు ఎన్నో
అంతులేని ప్రయాణంలో
ఎంతో మంది
అమరులవుతున్నారు
తాము నడిచే మార్గంలో
మార్పు లేదంటున్నారు
ఆశయాలు ఆకాశంలో
ఇంద్రధనస్సు లాగా
మెరుస్తున్నాయి
వాటిని చూస్తున్న పేద ప్రజలు
సంభ్రమాశ్చర్యాలకు
లోనవుతున్నారు
ఎందుకోగాని వాటిని ఎన్నడూ
తాకలేకపోతున్నారు
మన దేశ వాసులైన
పేద ప్రజల కోసం
ప్రజల మధ్యన ప్రజల తోటి
ప్రజల కొరకు ఎర్రజెండాలన్నీ
ఏకమైతే మహా సైన్యం
రూపొందదా
ప్రజాస్వామ్యక విప్లవం రాదా
సమ సమాజం నిర్మాణానికి
బాటపడదా

బూర భిక్షపతి
9866612717

మరవరాని మన చరిత్ర
రూ॥40/-
పేజీలు: 40

నవచేతన పబ్లిషింగ్ హౌస్
గిరిప్రసాద్ భవన్, బండ్లగూడ (నాగోల్), హైదరాబాద్-68. ఫోన్: 040-29884453/54
E-mail: navachethanaph@gmail.com
నవచేతన బుక్ హౌస్
బ్యాంక్ స్ట్రీట్(అబిడ్స్),హిమాయత్‌నగర్, కొండాపూర్, బండ్లగూడ(నాగోల్)- హైదరాబాద్ హన్మకొండ.



www.prajapaksham.in

# ప్రజాపక్షం

ప్రతి అక్షరం ప్రజల కోసం

PRAJAPAKSHAM ★


సంక్షోభంలో వ్యవసాయ కార్మికులు

విదేశాల్లో ఉద్యోగాలంటూ మోసం...

రోడ్డు ప్రమాదంలో ఇద్దరు కానిస్టేబుళ్లు మృతి


లోపలి పేజీల్లో



సంపుటి 08, సంచిక: 13 | సోమవారం | 09-12-2024 | మహబూబ్‌నగర్ | Published from: **Mahabubnagar, Hyderabad, Khammam, Karimnagar** | పేజీలు: 12 | వెల రూ. 5.00


# ఎయిర్ షో అదుర్స్



ఆకట్టుకున్న సూర్యకిరణ్ గగన విన్యాసాలు

ట్యాంక్‌బండ్ వద్ద ప్రారంభించిన సిఎం రేవంత్‌రెడ్డి

నగరవాసులతో కిక్కిరిసిన పరిసర ప్రాంతాలు





ప్రజాపక్షం/హైదరాబాద్

ప్రపంచంలో అత్యుత్తమైన ఐదు బృందాల్లో పేరొం దిన సూర్యకిరణ్ టీమ్ హైదరాబాద్ గగన వీధుల్లో నిర్వహించిన విన్యాసాలు ఆసాంతం ఆకట్టుకు న్నాయి. సూర్యకిరణ్ టీమ్ ఆధ్వర్యంలో 9 ఎయిర్ క్రాఫ్ట్స్ నిర్వహించిన విన్యాసాలు సందర్శకులను అబ్బురపరిచాయి. ఒళ్లు గగుర్పొడిచేలా విన్యా సాలు సాగాయి. ప్రజాపాలన విజయోత్స వాల్లో భాగంగా ఆదివారం సాయంత్రం ట్యాంక్‌బండ్ వద్ద నిర్వహించిన ఎయిర్ షో ఆకట్టుకుంది. ముఖ్యమంత్రి ఎను ముల రేవంత్ రెడ్డి ఎయిర్ షోను ప్రారం భించారు. 15 సూర్య కిరణ్ విమానా లతో చేసిన విన్యాసాలు సందర్శకులను ఆకట్టుకున్నాయి. నెక్లెస్ రోడ్, హెచ్ఎం డిఏ గ్రౌండ్స్‌లో జరిగిన ఎయిర్ షోను తిల కించేందుకు నగర వాసులు పెద్ద ఎత్తున తరలి వచ్చారు. ఆదివారం సెలవు దినంకావడంతో ఎయిర్ షోను తిలకించేందుకు ప్రజలు పెద్ద ఎత్తున రావడంతో ట్యాంక్‌బండ్ పరిసర ప్రాంతాలు కిక్కిరిసిపోయాయి. సిఎంతో పాటు శాసనసభ స్పీకర్ ప్రసాద్ కుమార్, మంత్రులు కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి, పొన్నం ప్రభాకర్, ఉత్తమ్ కుమార్ రెడ్డి, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, ప్రభుత్వ సలహాదారుడు వేం నరేందర్ రెడ్డి, పలువురు ఎంపి, ఎంఎల్ఏ, ఎంఎల్‌సిలు, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి, మున్సిపల్ శాఖ ముఖ్యకార్య దర్శి దానకిషో ర్‌తో పాటు పలు వురు ఉన్నతాధికా రులు హాజరయ్యారు. ఆదివారం సాయంత్రం 4:30 గంటలకు ప్రారంభమైన ఈ ఎయిర్ షో దాదాపుగా 30 నిమిషాల పాటు వైమానిక విన్యా సాలు ఆకట్టుకున్నాయి. ఎయిర్ షోను సినిమా హీరోయిన్లు మీనాక్షి చౌదరి, అంజలితో పాటు పలువురు ప్రముఖులు వీక్షించారు. భారత వైమా నిక దళం ఆధ్వర్యంలో ఎయిర్ షో జరిగింది. కెప్టెన్ అజయ్ దాశరథి నేతృత్వంలో వైమానిక విన్యాసాలు నిర్వహించారు. ఈ ఎయిర్ షోను చూడటానికి ట్యాంక్‌బండ్‌కు ప్రజలు పెద్ద సంఖ్యలో తరలి వచ్చారు. దీంతో ట్యాంక్ బండ్ పరిసర ప్రాంతాలు కిక్కిరిసిపోయాయి. హుస్సేన్ సాగర్‌పై అద్భుతంగా వైమానిక విన్యాసాలు అదర గొట్టాయి. ఒకే సారి ఆకాశంలో 9 ఎయిర్ క్రాఫ్ట్స్ సందడి చేశాయి.

**ఎయిర్ షో బందోబస్తులో పోలీసుల అత్యుత్సాహం..**

అయితే ట్యాంక్ బండ్ ఎయిర్ షోలో పోలీసుల అత్యుత్సాహం ప్రదర్శించారని పలువురు జర్నలి స్టులు అన్నారు. మీడియా ప్రతినిధులను పాసులు ఉన్నప్పటికీ లోపలికి పోలీసులు అనుమతించలేద న్నారు. పోలీసుల కుటుంబ సభ్యులు, స్నేహితు లను ఎలాంటి పాసులు లేకపోయినా పక్క దారిన పంపించారని ఆరోపించారు. పోలీసుల అతి ప్రవ ర్తనపై ప్రజలు ఆగ్రహం తరువాయి 6లో

# నేటి నుంచి అసెంబ్లీ



అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలపై చర్చకు ప్రభుత్వం సిద్ధం

ఆర్ఒఆర్ చట్టం, కులగణన, స్థానిక సంస్థల ఎన్నికల రిజర్వేషన్లపైనా చర్చించే అవకాశం

ఆరు గ్యారంటీలపై నిలదీసేందుకు ప్రతిపక్షాలు సంసిద్ధం

శీతాకాల సమావేశాల ఏర్పాట్లు సమీక్షించిన అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్, శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి

ప్రజాపక్షం / హైదరాబాద్

తెలంగాణ రాష్ట్ర శాసనసభ, శాసనమండలి శీతా కాల సమావేశాలు సోమవారం నుంచి జరగను న్నాయి. ఉదయం 10.30 గంటలకు ఉభయ సభలు ప్రారంభం కానున్నాయి. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి ఏడాది కాలం పూర్తి కావస్తుండగా ప్రభుత్వం చేసిన పలు అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల గురించి రానున్న కాలంలో చేపట్టనున్న కార్యక్రమాల గురించి అసెంబ్లీలో చర్చించడానికి ప్రభుత్వం సిద్ధమవుతోంది. కొత్త రెవెన్యూ(ఆర్ఒఆర్) చట్టం, కుల గణన, స్థానిక సంస్థల ఎన్నికల్లో రిజర్వేషన్లు తదితర ముఖ్యమైన అంశాలపై సమావేశాల్లో చర్చించనున్నట్లు సమా చారం. ఇటీవల ప్రభుత్వం చేసిన పంట రుణ మాఫీ కాగా కాంగ్రెస్ ఇచ్చిన ఎన్నికల హామీలు, ఆరు గ్యారంటీలపై నిలదీసేందుకు ప్రతిపక్షాలు సిద్ధమవుతున్నాయి.

**సమావేశాలు సజావుగా జరిగేలా చర్యలు**

శాసనసభ, శాసనమండలి సమావేశాలు సజా వుగా జరగడానికి అవసరమైన చర్యలు తీసుకోవా లని శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్, శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి సంబం ధిత అధికారులను ఆదేశించారు. సోమవారం నుండి ప్రారంభం కానున్న తెలంగాణ రాష్ట్ర శాసన సభ, శాసనమండలి సమావేశాల ఏర్పాట్లపై రాష్ట్ర ప్రభుత్వ ఉన్నతాధికారులు, పోలీసు శాఖ అధికా రులతో ఆదివారం శాసనసభ భవనంలోని స్పీకర్ ఛాంబర్‌లో తెలంగాణ రాష్ట్ర శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్, శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి తరువాయి 6లో

# వెయ్యిమంది సర్వేయర్లు త్వరలోనే నియామకం



విఆర్‌ఎ, విఆర్ఒ వ్యవస్థ పునరుద్ధరిస్తాం

ప్రస్తుత శాసనసభ సమావేశాల్లో ఆర్ఒఆర్ ముసాయిదా బిల్లు

తుగ్లక్ తరహా రాష్ట్రాన్ని పాలించినవారు ప్రజాపాలన ప్రభుత్వంపై ఆరోపణలు చేయడం విడ్డూరం : మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి

ప్రజాపక్షం/హైదరాబాద్

సచివాలయానికి రాకుండా ఎర్రవెల్లి నుంచి తుగ్లక్ తరహా రాష్ట్రాన్ని పరిపాలించిన వారు, నిత్యం ప్రజల మధ్యలో ఉంటున్న ప్రజాపాలన ప్రభు త్వంపై ఆరోపణలు చేయడం విడ్డూరమని రెవెన్యూ, సమాచార, గృహ నిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి మండిపడ్డారు. బిఆర్ ఎస్ పదేళ్ల పాలనపై ఏడాది క్రితమే తెలంగాణ రాష్ట్ర ప్రజానీకం ఆ పార్టీకి డిస్‌చార్జ్ షీట్ ఇచ్చిం దని ఎద్దేవా చేశారు. మాజీ మంత్రి హరీశ్ రావుకు ఇంకా జ్ఞానోదయం తరువాయి 6లో

ఏడాదిలో ‘తిరోగమన తెలంగాణ’

తెలుగులోమ్యూనిస్టు ఉద్యమగీతాలు

ముడుపులు ఇస్తేనే పనులు పూర్తి


లోపలి పేజీల్లో


# అసద్ పరార్!



కుప్పకూలిన సిరియా సర్కారు

తిరుగుబాటుదారుల చేతికి పగ్గాలు



**డమాస్కస్:** సిరియాలో గత 14 సంవత్సరాలుగా కొనసాగుతున్న అంతర్యుద్ధం ముగినట్టే కనిపిస్తున్నది. అధ్యక్షుడు బషీర్ అసద్ దేశం విడిచి పారిపోయినట్టు సమాచారం. ఈ విషయాన్ని ‘ఆ పరేషన్ రూమ్ టు కాన్కర్ డమాస్కస్’గా పిలిచే హయాత్ తహరీర్ అల్ షామ్ (హెచ్‌టిఎస్) తిరుగుబాటుదారుల ప్రతి నిధి ఒకరు మీడియాకు విడుదల చేసిన ప్రకటనలో పేర్కొ న్నారు. సిరియా టివిలో దీనికి సంబంధించిన ప్రకటన వెలువ డింది. అసద్ తన కుటుంబంతో కలిసి విదేశాలకు పరార య్యాడని అంటున్నప్పటికీ, ఈ విషయాన్ని ధ్రువీకరించేం దుకు ఎలాంటి ఆధారాలు ఇప్పటి వరకు మీడియాకు లభించ లేదు. కాగా, సిరియా ప్రస్తుతం తమ ఆధీనంలో ఉందని, ప్రజలంతా స్వేచ్ఛాయుతమైన జీవితాన్ని గడపవచ్చని ఆ ప్రకటనలో తెలిపిందారు. మొత్తం మీద సుమారు 54 సంవత్సరాలుగా అసద్ కుటుంబం సాగిస్తున్న పాలనకు తెరపడిందని ప్రజలు సంబరాలు చేసుకుంటున్నారు. అసద్ పరారీ వార్త వెలువడిన వెంటనే, ప్రతిపక్ష పార్టీలకు అధికా రాన్ని అప్పగించడానికి సిద్ధంగా ఉన్నట్టు ప్రధాని మహమ్మద్ ఘాజీ జలానీని ఉటంకిస్తూ వార్తా సంస్థలు కథనాలను వెలువ రించాయి. ప్రభుత్వ ఆస్తులను ధ్వంసం చేయవద్దని ఆయన తిరుగుబాటుదారులకు విజ్ఞప్తి చేసినట్టు సమాచారం. మరో వైపు, సిరియాలో అరాచకపాలన ముగిసి, కొత్త శకం ప్రారం భమైందని తిరుగుబాటుదారులు ప్రకటించారు. అసద్ తండ్రి హాఫీజ్ 1970లో సిరియాలో తరువాయి 6లో

# రైతులపై మళ్లీ టియర్ గ్యాస్

పంజాబ్-హర్యానా సరిహద్దు మరోసారి ఉద్రిక్తంగా మారిన శంభు

ర్యాలీ నేటికి వాయిదా



**శంభు :** పంజాబ్‌-హర్యానా సరిహద్దులో ఆందోళన చేస్తున్న రైతులు 101 మంది అన్నదాతలతో కూడిన ‘జాతా’ (గూపు) శంభు నుంచి దేశ రాజధాని ఢిల్లీకి ఆదివారం మధ్యాహ్నం ర్యాలీగా బయలుదేరింది. అయితే జాతా బయలుదేరిన వెంటనే హర్యానా భద్రతా సిబ్బంది బహుళంచలుగా బారికేడ్లను ఏర్పాటు చేసి ర్యాలీని అడ్డుకున్నారు. రైతులు బారిగేడ్లను చేరుకోగానే వారిని చెదరగొట్టేందుకు భద్రతా సిబ్బంది రైతులపై టియర్‌గ్యాస్ షెల్స్ ప్రయోగించారు. కెనాన్ల ద్వారా వాటర్ జెట్‌లతో కాల్పులు జరిపారు. ఈ నేపథ్యంలో ర్యాలీని సోమవారం నాటికి వాయిదా వేసుకున్నారు. కాగా, దేశ రాజధాని అధికార యంత్రాంగం నుంచి అనుమతి పొందిన తరువాతే ఢిల్లీకి ర్యాలీగా వెళ్లాలని రైతు సంఘాలకు ఇది వరకే అంబాలా పోలీసులు సూచించారు. కనీస మద్దతు ధర చట్టం కోసం తమ ప్రాణాలైనా అర్పిస్తామని పేర్కొంటూ రైతులు రాజధాని బాటపట్టారు. ఈ నేపథ్యంలో కొద్ది దూరం వెళ్లగానే భద్రతా సిబ్బంది వారిని అడ్డగించారు. ఢిల్లీకి ర్యాలీగా వెళ్లాలంటే అనుమతి పత్రాలను చూపించాలని హర్యానా పోలీసులు కోరారు. వారి వద్ద అనమతి ఉందో లేదా పరిశీలిస్తా మని, తమ వద్ద 101 మంది రైతుల జాబితా ఉందని, అయితే ఆ జాబితాలో ఉన్న పేర్లుగల వారి అక్కడ లేరన్నారు. వారి తమ తమ గుర్తింపు కార్డులను కూడా చూపలేదని తరువాయి 12లో

# తెలంగాణ తల్లి విగ్రహం మార్పు మూర్ఖపు చర్య

ప్రజా సమస్యలపై అసెంబ్లీలో గళమెత్తండి

బిఆర్ఎస్ ఎమ్మెల్యే, ఎమ్మెల్సీల సంయుక్త సమావేశంలో కెసిఆర్



ప్రజాపక్షం/హైదరాబాద్

తెలంగాణ తల్లి విగ్రహరూపాన్ని మార్చడం మూర్ఖపు చర్య అని, ఇవి ప్రభుత్వాలు చేయా ల్సిన పనులేనా? అని బిఆర్ఎస్ అధ్యక్షుడు కె.చంద్రశేఖర్ రావు మండిపడ్డారు. ప్రభుత్వాలు మారినప్పుడల్లా విగ్రహాల మార్పులు చేసు కుంటూ పోతే ఎలా?, సమస్యల పరిష్కారంపైన ప్రభుత్వం దృష్టి సారించాలన్నారు. శాసనసభ సమావేశాల ప్రారంభం నేపథ్యంలో ఎర్రవెల్లి లోని ఫామ్‌హౌస్‌లో కెసిఆర్ అధ్యక్షతన బిఆర్ ఎస్ ఎంఎల్‌ఏలు, తరువాయి 6లో





# పోరాటాలే అమరులకు సరైన నివాళి

పోటు ప్రసాద్ ఆశయ సాధనకు పునరంకితమవుదాం

సంస్మరణ సభలో అమర్‌జిత్ కౌర్

మోడీ పాలనలో ప్రభుత్వ రంగం నిర్వీర్యమైందని విమర్శ

ప్రజాపక్షం/ఖమ్మం

ప్రజా ఉద్యమాలలో పనిచేస్తూ బహుముఖ పోరాటాలకు నేతృత్వం వహించి అమరులైన వారికి ప్రజా పోరాటాల కొనసాగింపే సరైన నివాళి అని ఎఐటి యుసి జాతీయ ప్రధాన కార్యదర్శి, సిపిఐ జాతీయ కార్యదర్శి అమర్‌జిత్ కౌర్ తెలిపారు. విద్యార్థి దశ నుంచి కార్మిక నాయకునిగా, కమ్యూనిస్టు పార్టీ జిల్లా కార్యదర్శిగా పనిచేసిన పోటు ప్రసాద్ ఆశయ సాధనకు పునరంకితం కావా లని ఆమె పిలుపునిచ్చారు. గత నెల 27న మరణించిన సిపిఐ ఖమ్మంజిల్లా కార్యదర్శి పోటు ప్రసాద్ సంస్మరణ సభ ఖమ్మంలోని పాత మమత మెడికల్ కళాశాలలోని పువ్వాడ ఆడిటోరియంలో జరిగింది. సిపిఐ జిల్లా సహాయ కార్య దర్శి దండి సురేష్ అధ్యక్షతన జరిగిన సభలో అమర్‌జిత్ కౌర్ మాట్లాడుతూ పోటు ప్రసాద్ కుటుంబం మూడు తరాల నుంచి కమ్యూనిస్టు పార్టీలో పని చేస్తూ వచ్చారని, మూడో తరం వారైనా తరువాయి 12లో

# ఇన్‌ఫార్మర్ నెపంతో మహిళ దారుణ హత్య

ఛత్తీస్‌గఢ్ బీజాపూర్‌లో మావోయిస్టుల ఘాతుకం

ప్రజాపక్షం/భద్రాచలం

ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలోని బీజాపూర్ జిల్లాలో మావోయిస్టులు ఘాతుకానికి పాల్పడ్డారు. పోలీస్ ఇన్‌ఫార్మర్ నెపంతో 40ఏళ్ల మహిళను దారుణంగా హతమార్చారు. ఆమె మృత దేహం ఆదివారం లభ్యమైనట్లు పోలీసులు వెల్ల డించారు. శుక్ర అనే మహిళను మావోయిస్టులు గొంతుకోసి దారుణంగా హతమార్చి ఆమె మృత దేహం వద్ద మద్దేడు మావోయిస్టు ఏరియా కమిటీ పేరిట లేఖలు వదిలివెళ్లినట్లు పోలీసులు తెలిపారు. 2017 నుండి శుక్ర అనే మహిళ పోలీస్ ఇన్‌ఫార్మర్‌గా వ్యవహరిస్తున్నట్లు మావోయిస్టులు ఆరోపిస్తు న్నారన్నారు. మహిళను హతమార్చిన మావోయిస్టుల కోసం పోలీసు బల గాలు గాలింపు చర్యలు చేపట్టాయి. ఈ ఘటనలో తరువాయి 6లో

ఎన్‌ఎఫ్ఐడబ్ల్యు అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులుగా

# హమీద్, నిషాసిద్దూ ఎన్నిక

ఉపాధ్యక్షులుగా దుర్గాభవాని, రజనీ





**న్యూఢిల్లీ :** భారత జాతీయ మహిళా సమాఖ్య (ఎన్ఎఫ్ఐడబ్ల్యు) 22వ జాతీయ మహాసభలు ఢిల్లీలోని సరళాశర్మ హాల్‌లో ఆదివారం ఉత్సాహపూరిత వాతావరణంలో ముగిశాయి. మూడు రోజులపాటు జరిగిన ఈ మహాసభలకు 25 రాష్ట్రాల నుంచి 500 మంది ప్రతినిధులు హాజరయ్యారు. మహా సభ కొత్త కార్యవర్గాన్ని తరువాయి 6లో

ఘోకస్

# ఆరోగ్యం

# ఆహారమే మహాభాగ్యం

- సిరి ధాన్యాలతో సంపూర్ణ ఆరోగ్యం
- ఐటిడిఎ వినూత్న ప్రయోగం
- గిరిమహిళల ఆర్థిక భరోసాకు పెద్దపీట
- అందుబాటులో రాగి, నువ్వు, అవిసె, జొన్నలతో ఆహార పదార్థాలు
- విదేశాలకు అటవీ ఉత్పత్తుల ఆహారపదార్థాలు

కాదేది కలుషితానికి అనర్హతం అన్నట్లు తయారైంది ప్రస్తుతం ఆహారం.అది ఇదీతేడా లేకుండా అన్ని రకాల తినే పదార్థాలు విషపూరిత ఎరువులు, పురుగు మందులమయం అవుతున్నాయి. నానాటికీ రోగుల సంఖ్య పెరిగిపోతోంది. హృద్రోగులు, కిడ్నీ పేషంట్లు, నరాల బలహీనతలు, చిన్న వయస్సుల్లోనే వృద్ధాప్య ఛాయలు రావడం, ఆడ పిల్లల్లో పిసిఓడి సమస్య,గర్భ సమస్యలు, పెద్దల్లోగర్భ,రొమ్ము,పేగు క్యాన్సర్లతో పాటు రకరకాల క్యాన్సర్లు సోకుతున్నాయి. వీటన్నింటికీ కలుషితమే కారణం. కులుషిత ఆహారం, అసమతుల్య పోషకాలు వంటివి జీవితాలను తుంచివేస్తున్నాయి.ఇబ్బందికర పరిస్థితుల నుండి బయట పడాలంటే నాణ్యమైన, కలుషితం లేని ఆహారాన్ని తీసుకోవం ఒక్కటే మార్గం.



మనిషి జీవన యానం సాగాలంటే ప్రతి రోజు పోషకాలతో కూడిన ఆహారంతో పాటు పరిశుభ్రమైన మంచినీటిని తీసుకుంటుండాలి. కానీ ప్రస్తుతం రోజుల్లో అతి సాధ్యపడటం లేదు. పెసర్ల దగ్గర్నుండి పేరుగాంచి స్వర్ణ మసూరి బియ్యం వరకు, రకరకాల కూరగాయల వరకు అన్నీ పురుగు మందుల మందులతోనే పండుతున్నాయి. ఒక ఎకరా వరి ధాన్యం పడించాలంటే వేలాది లీటర్ల నీటిని కట్టడంతో పాటు ఆ నీటిలో యూరియాతో సహా పై పాటు పురుగుమందులు పెద్ద ఎత్తున పిచికారీ చేయాల్సి ఉంటుంది. అసలు పంటల సీజన్లో దుక్కి దున్నిన నాటి నుండి నేల తల్లి కలుషిత కోరల్లో చిక్కుకుపోతోంది. దీంతో చిన్న వయస్సు మొదలు పెద్దల వరకు రోగాలతో సతమతం అవుతూ టాబ్లెట్ల సహాయంతోనే బతుకు బండిని నడిపిస్తున్నారు. ఈ కలుషిత కోరల నుండి ప్రజలకు మేలు చేసేందుకు ఐటిడిఏ వినూత్న ప్రయోగానికి శ్రీకారం చుట్టింది.

## సిరి ధాన్యాలతో సంపూర్ణ ఆరోగ్యం

అసమతుల్య ఆహారంతో ఇబ్బంది పడుతున్న ప్రజలను ఆరోగ్యబాట పట్టించేందుకు ఐటిడిఏ నడుంబిగించింది. ఐటిడిఏ ద్వారా గిరిజన మహిళలను ప్రోత్సహిస్తూ అవెస,రాగి,నువ్వుల లడ్లు, జొన్న జావ, జొన్న సంకటి, రాగిముద్ద, జొన్న బిస్కెట్లు, రాగి బిస్కెట్లు, మునగ బిస్కెట్లు, మునగాకు, కర్వేపాకు కారంపొడి, స్వచ్ఛమైన అడవి చెట్టు,పుట్ట తేనె తో పాటు ఫెనాయిల్, సర్ఫ్, బట్టలు, స్నానం సబ్బులు, ఇప్పపువ్వు అందుబాటులోనికి తీసుకొచ్చారు. గిరిజన మహిళలను ఒక యూనిట్‌గా చేసి వారి ద్వారా ఆరోగ్యవంతమైన ఆహార పదార్థాలను తయారు చేస్తూ భద్రాచలం కేంద్రంగా విక్రయాలు సాగిస్తున్నారు. కొండకొనల్లో పశువుల ఎరువుల సహాయంతో పండే స్వచ్ఛమైన రాగులు, జొన్నలు, అవెసలు సేకరించి తయారు చేస్తున్నారు. మరో ప్రక్క నాటు మునగ, కర్వేపాకుతోనే కారం పొండి తయారు చేస్తున్నారు. మరో ప్రక్క జొన్నజావకు వాడే జొన్నలను సాధారణ రోటిలో రోకళ్లతో దంపి జావ కాస్తున్నారు. జొన్న, రాగి, అవెస ఆరు లడ్డూలు రూ.50కి, అరలీటర్ తేనే రూ.400లకు, కారంపొండి రూ.50, రాగి,జొన్న 20 బిస్కెట్ ప్యాకెట్ రూ.120, రాగి, జొన్న జావ ఒక జంబో గ్లాస్ రూ.20, రాగి ముద్ద రూ.20, రాగిసంకటి రూ.20 లకు అమ్మకాలు సాగిస్తున్నారు. పై ఆహార పదార్థాలను వాడటం ద్వారా ఏరకమైన ఆరోగ్యం సమకూరుతుంది, ఎలాంటి పోషకాలు అందుతాయో కూడా ప్యాకెట్లపై రాసిన స్టిక్కర్లు అతికించారు. పరిపూర్ణమైన ఆహారం సంపూర్ణమైన ఆరోగ్యాన్ని ఇస్తుందని ఉద్దేశ్యంతో పెద్ద ఎత్తున జనం వీటిని కొనుగోలు చేసేందుకు ఎగబడుతున్నారు.

## గిరిజన మహిళలకు ఆర్థిక భరోసా

గిరిజన మహిళలను ఒక యూనిట్‌గా చేసిన ఐటిడిఏ వారి ద్వారా వీటి విక్రయాలు సాగిస్తున్నారు. హోంశక్తి మల్టీ ప్రొడక్ట్స్ పేరిట అటవీ ఉత్పత్తులతో చక్కటి ఆహార పదార్థాలను తయారు చేస్తున్నారు. వీటి విక్రయాల ద్వారా ఆదాయాన్ని సమకూర్చుకుని ఆర్థికంగా స్థిరపడాలనేదే ఐటిడిఏ ఉద్దేశ్యం. స్థానిక ప్రజలతో పాటు, నిత్యం భద్రాచలం వచ్చే భక్తులకు వీటిని అందుబాటులోనికి తెచ్చి విక్రయాలు సాగిస్తూ ఆరోగ్యాన్ని అందిస్తున్నారు. వీటిని దేశ విదేశాల్లో సైతం విక్రయించేందుకు చర్యలు తీసుకుంటున్నారు. ఇప్పటికే రాగి, జొన్న బిస్కెట్లు అమెరికా, ఇంగ్లాడ్ వంటి దేశాలకు సరఫరా చేశారు.

## ఐటిడిఏ పిఒపై ప్రశంసల జల్లు

ఐటిడిఏ పిఓ బాధ్యతలు చేపట్టిన నాటి నుండి గిరిజనుల మేలు కోసం ఏవో ఒక కార్యక్రమాలు చేయడంతో పాటు గిరిజన విద్యార్థులు చదువులను ప్రోత్సహిస్తూ ఆర్థిక చేయూతనందిస్తున్నారు, ఉద్దీపన పేరుతో నూతన పుస్తకాలు అచ్చు వేయించి గిరిజన పిల్లలకు చదువులు సులువుగా అర్థమయ్యేరీతిలో చదువులను ముందుకు సాగిస్తున్నారు. ఇప్పటికే అటవీ ఉత్పత్తులతో ఆహార పదార్థాల తయారీతో పాటు ఇతర వస్తువులు తయారీ మొదలుపెట్టించారు. వీటికి విదేశాల్లో మార్కెటింగ్ సదుపాయం కల్పించేందుకు వేగంగా అన్ని రకాల చర్యలు చేపట్టారు. గిరిబిడ్డల వికాసానికి, ఆర్థిక భరోసా ఐటిడిఏ పిఓ చేయూత నందిస్తున్న తీరును పలువురు ప్రశంసిస్తూ అభినందనలు కురిపిస్తున్నారు.

## అవిసె లడ్డూలు బాగున్నాయి: జగన్ - వినియోగదారుడు



గిరిజన మహిళలు విక్రయిస్తున్న అవెస, రాగి లడ్డూలు నాణ్యతతో ఉన్నాయి. వీటి తయారీలో స్వచ్ఛమైన నెయ్యి, బెల్లం కలిపి తాయరు చేశారు. ఎలాంటి కలుషితం లేని అటవీ ఉత్పత్తులతో తాయరు చేయడం మంచి పరిణామం. వీటితో పాటు జావ, గటక కూడా అందు బాటులోనికి తెచ్చారు. వీటిని సేవించే పూర్వీకులు వందేళ్లపాటు సంపూర్ణ ఆరోగ్యంగా జీవించారు.

## బిస్కెట్లు జర్నీకు బాగుంటాయి కమలాకర్ - వినియోగదారుడు



అవెస, జొన్న బిస్కెట్లు రుచికరంగా ఉన్నాయి. ఇవి ఎక్కువ రోజులు నిల్వ ఉండే ఆహారపదార్థాలు కావడంతో ప్రయాణాల సమయంలో తీసుకెళ్లవచ్చు. అక్కడిక్కడ కలుషిమైన ఆహారాన్ని తీనేదానికంటే ఇలాంటి అటవీ ఉత్పత్తుల ద్వారా తయారు చేసిన వస్తువులు తినడం వల్ల ఆరోగ్య సురక్షితంగా ఉంటుంది.

**ఆనంద్, భద్రాచలం**

## అతి ఎప్పటికైనా ప్రమాదమే!

ఏ విషయంలోనైనా అతిగా వ్యవహరించడం ప్రమాదాలకు మూలం. అందుకే 'అతి సర్వత్రా వర్జయేత్' అంటారు. ఆరోగ్యం విషయంలో మరింత జాగ్రత్తగా ఉండాలి. గాస్టిక్ సమస్యతో బాధపడుతున్న చాలా మంది అడ్డూఅదుపూ లేకుండా మందులు వాడుతుంటారు. అయితే, ఈ విధంగా అసిడిటీకి మందులు వాడడం వల్ల మూత్రపిండాలు దెబ్బతింటాయని వాషింగ్టన్ విశ్వ విద్యాలయం నిపుణులు బృందం తన అధ్యయన పత్రంలో పేర్కొంది. ప్రోటాన్ పంప ఇన్హిబిటార్స్ (పిపిఐ)గా పిలిచే ఔషధ సమ్మేళనాలపై క్రం తప్ప కుండా ఇక్కడి వైద్య నిపుణులు, శాస్త్రవేత్తలు పరిశోధనలు చేస్తుంటారు. ఈ అధ్యయనాల వివరాలను ప్రకటిస్తూ ఉంటారు. అడిసిటీతో బాధపడుతూ, వివిధ రకాలపై మందులను వాడడం వల్ల కిడ్నీ సమస్యలు తలెత్తాయని వీరి అధ్యయనం స్పష్టం చేసింది. దీర్ఘకాలం మందుల వాడకందారులతో పోలిస్తే, తక్కువ కాలం అసిడిటీ మందులు తీసుకున్న వారిలో కిడ్నీ సమస్యలు తక్కువగా ఉన్నాయని గుర్తించారు. అరగకపోవడం, ఛాతీలో మంట తదితర కారణాలతో యాంటీయాసిడ్ మందులు విరివిగా వాడేస్తున్న వారు జాగ్రత్త పడాలి. మన దేశంలో అసిడిటీ నివారణకు చాలా మంది వాడే 'పాన్ డి' ఔషధంలో నాణ్యతా ప్రమాణాలు లేవని సెంట్రల్ డ్రగ్ రెగ్యులేటరీ అథారిటీ ఇటీవల హెచ్చరికలు జారీ చేసింది. దీనితోపాటు అత్యంత సాధారణంగా వాడే 'షెల్కాల్ 500' వంటి మొత్తం 49 మందుల నాణ్యతా ప్రమాణాలు సరిగ్గా లేవని స్పష్టం చేసింది. కాబట్టి, సొంత వైద్యం పనికిరాదని తెలుసుకోవాలి. ఆరోగ్యపరమైన సమస్యలు తలెత్తినప్పుడు వెంటనే వైద్యులను సంప్రదించడం ఉత్తమం. ఆరోగ్యకరం... క్షేమదాయకం.



ఈ శీర్షికన ఇచ్చిన సమాచారం కేవలం పాఠకుల అవగాహన కోసం మాత్రమే. ఆరోగ్య సమస్యలకు వైద్యులను సంప్రదించడం తప్పనిసరి

## పోటీ కోసం జికె

(గ్రూప్స్‌కు సిద్ధమవుతున్న వారికోసం) ప్రతి సోమవారం

- ఒక మైక్రోమీటర్
  100 nm
- జింబాబ్వే రాజధాని
  హరారే
- ముట్టుకుంటే ముడుచుకునే పువ్వు
  అత్తిపత్తి
- రిపబ్లిక్ గ్రంథ రచయిత:
  ప్లేటో
- మొదటి సాధారణ ఎన్నికలు జరిగిన సంవత్సరం
  – 1952
- గాంధీజీ జన్మించిన తేది?
  1869 అక్టోబర్ 2
- 'కౌండిన్య ఏనుగుల సంరక్షణ కేంద్రం' ఏ జిల్లాలో ఉంది?'
  చిత్తూరు
- ముస్లింలకు ప్రత్యేక నియోజకవర్గాలను ఏర్పాటుచేసిన చట్టం?
  1909 చట్టము
- కార్గిల్ విజయ్ దివస్ ఎప్పుడు నిర్వహిస్తారు?
  జులై 26
- బుద్ధుడు మొదటి ఉపన్యాసం చేసిన ప్రదేశం ఏది?
  సారనాథ్
- రెండు సార్లు ప్రవేశపెట్టబడ్డ ప్రణాళిక
  ఆరవ పంచవర్ష ప్రణాళిక
- చేప హృదయంలో గదుల సంఖ్య:
  2
- కిరణజన్య సంయోగక్రియలో క్రిందివాటిలో ఏది విడుదల అవుతుంది?
  ఆక్సిజన్
- మన రాష్ట్రంలో కెల్లా పెద్ద అడవులు
  నల్లమల అడవులు
- ఆఫ్రికాలో పెట్రోలియం లభించు నదీలోయ
  నైజర్
- వాక్సినేషన్ కనిపెట్టిన సంవత్సరం ?
  1776
- ప్రపంచంలో 'జనపనార ఉత్పత్తిలో ప్రథమ స్థానంలో ఉన్న దేశం ఏది?
  భారత్
- గోవా రాష్ట్ర రాజధాని?
  పనాజి
- పిహెచ్ అనగా దేని అణువుల గాఢత?
  హైడ్రోజన్
- క్రింది వానిలో ఏది ప్రాథమిక హక్కు కాదు?
  ఆస్తి హక్కు
- ప్రత్యేక హక్కులు లేనిది.
  సమన్యాయపాలన
- ఝరియా బొగ్గగనులు గల రాష్ట్రం
  ఝార్ఖండ్
- నాలుకపై ఎన్ని రుచులను తెలిపే గ్రాహకాలు కలవు?
  4
- రక్తం ఎర్రగా ఉండడానికి కారణం అందులోని
  హీమోగ్లోబిన్
- అనిబిసెంటు హోమ్‌రూల్ లీగ్‌ను ఇచట కేంద్రంగా చేసుకున్నది?
  మద్రాసు

## ఆర్‌ఎఫ్‌సిఎల్ శ్రీ చైతన్య స్కూల్ ప్రిన్సిపాల్‌ని వెంటనే తొలగించాలి

● విద్యార్థుల తల్లిదండ్రులతో అసభ్యకరంగా ప్రవర్తిస్తున్న కీచక ప్రిన్సిపాల్ ● ఎఐఎస్‌ఎఫ్ పెద్దపల్లి జిల్లా కార్యదర్శి ప్రీతం డిమాండ్



**ప్రజాపక్షం/పెద్దపల్లి ప్రతినిధి :** రామగుండం పారిశ్రామిక ప్రాంతంలోని ఆర్‌ఎఫ్‌సిఎల్ శ్రీ చైతన్య స్కూల్ ప్రిన్సిపాల్‌ని వెంటనే తొలగించాలని ఎఐఎస్‌ఎఫ్ పెద్దపల్లి జిల్లా కార్యదర్శి రేణుకుంట్ల ప్రీతం డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఎఐఎస్‌ఎఫ్ పెద్దపల్లి జిల్లా కార్యదర్శి రేణుకుంట్ల ప్రీతం మాట్లాడుతూ ఆర్‌ఎఫ్‌సిఎల్ శ్రీ చైతన్య స్కూల్లో విధులు నిర్వహిస్తున్న ప్రిన్సిపాల్ విద్యార్థులతో, వారి తల్లిదండ్రులతో, అదే స్కూల్లో విధులు నిర్వహిస్తున్నటువంటి తోటి ఉపాధ్యాయురాలులతో అసభ్యకరంగా ప్రవర్తిస్తున్నాడని, విద్యాబుద్ధులు నేర్పించాల్సిన ప్రధానోపాధ్యాయుడే చీకటి కోణంకు తెరలేపుతున్నాడని,గతంలో కూడా ప్రిన్సిపల్ పై అనేక ఆరోపణలు వచ్చాయని,చాలా సంఘటనలకు పాల్పడ్డాడని ఈలాంటి నీచమైన కీచక ప్రిన్సిపాల్ ని స్కూల్ నుండి తొలగించకుండా, శ్రీ చైతన్య యాజమాన్యం ప్రిన్సిపాల్‌ని ప్రోత్సహిస్తుందని ఆయన అన్నారు. ఇలాంటి ప్రిన్సిపాల్ ని వెంటనే సోమవారం ఉదయం కల్లా తొలగించాలని, తొలగించినట్టు బహిరంగ ప్రకటన చేయాలని, లేనిపక్షంలో విద్యార్థులతో ,వారి తల్లిదండ్రులతో కలిసి పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేస్తామని ఆయన హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ రామగుండం కార్పొరేషన్ అధ్యక్షులు మాతంగి సాగర్, గొడిసెల ప్రణీత్, గాజుల వినయ్, వంశీ ,అరవింద్ ,సిద్ధు తదితరులు పాల్గొన్నారు.

## జనవరి 5న ట్రేడ్‌యూనియన్ క్లాసులు

**ప్రజాపక్షం/ మంచిర్యాల :** మంచిర్యాల జిల్లా మందమర్రిలో 2025, జనవరి 5న జరిగే ట్రేడ్ యూనియన్ క్లాసులను విజయవంతం చేయాలని ఎఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి మేకల దాసు, సిపిఐ జిల్లా కార్యదర్శి రామడుగు లక్ష్మణ్ పిలుపునిచ్చారు. ఆదివారం మంచిర్యాల జిల్లాలోని సిపిఐ కార్యాలయం ఎఐటియూసి జిల్లా సమితి సమావేశం సిపిఐ జిల్లా ప్రధాన కార్యాలయంలో మిట్టపల్లి పౌల్, ముస్కె సమ్మయ్య అధ్యక్షతన నిర్వహించారు. ఈ సమావేశానికి ఎఐటియూసి జిల్లా ప్రధాన కార్యదర్శి మేకల దాసు, సిపిఐ జిల్లా కార్యదర్శి రామడుగు లక్ష్మణ్‌లు పాల్గొని మాట్లాడుతూ దేశంలో కార్మిక వర్గం ఎదుర్కొంటున్న పరిస్థితులపై జనవరి 5న ఆల్ ఇండియా ట్రేడ్ యూనియన్ కాంగ్రెస్ ఎఐటియుసి జిల్లా క్లాసులు జరుగుతాయని తెలిపారు. అసంఘటితంగా కార్మిక వర్గానికి కనీస వేతనాలు, సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని,జిల్లా కార్మిక శాఖ అధికారి డిసిఎల్‌ని మంచిర్యాలలో వెంటనే ఏర్పాటు చేయాలని కోరారు. ఈ సమావేశంలో దాగం మల్లేష్, ఎస్‌కె బాజి సైదా, సలేంద్ర సత్యనారాయణ సుద్శన్, నగేష్, దొట్టిపల్ల రవీందర్, గట్టు సర్వేశం, ప్రభాకర్, రాయమల్లు, మధు, నర్సింగరావు, పాల్గొన్నారు.



# హమాలీ వర్కర్స్‌కు సంక్షేమబోర్డు

ఎఐటియుసి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్. బాలరాజు డిమాండ్

**ప్రజాపక్షం/హన్మకొండ ప్రతినిధి :** హమాలీ వర్కర్స్‌కు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని ఎఐటియుసి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్. బాలరాజు డిమాండ్ డిమాండ్ చేశారు. జిల్లా హమాలి ప్రథమ మహా సభను ఎఐటియుసి హనుమకొండ బాల సముద్రంలోని జిల్లా కార్యాలయంలో నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి జిల్లా ఎఐటియూసి అధ్యక్షులు వేల్పుల సారంగపాణి అధ్యక్షత వహించారు. తొలుత ఖమ్మం జిల్లా సిపిఐ కార్యదర్శి పోటు ప్రసాద్, సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి బాల మల్లేష్ మృతిపట్ల సంతాప సభను బత్తిని సదానందం నిర్వహించడం జరిగినది. అనంతరం జరిగిన హమాలీల కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎఐటియుసి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్.బాలరాజు విచ్చేసి మాట్లాడుతూ ప్రభుత్వం హమాలీలకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని, వలస కార్మికులను నివారించి స్థానికులకు పని కల్పించే వరకు పోరాడాలని అన్నారు.



ఆధార్ కార్డు లాగా హమాలీలకు గుర్తింపు కార్డులను ప్రభుత్వం ఇవ్వాలని,10 సంత్సరాలు నిండిన కార్మికులకు రూ.10,000 పెన్షన్, ప్రమాదవశాత్తు హమాలీలు చనీపోతే రూ.20,000 ఎక్స్ గ్రేషియా ఇవ్వాలని, దహన సంస్కారాలకై సంక్షేమ బోర్డు ద్వారా రూ. 100000 లు ఇవ్వాలని, అంగ వికలాంగులు అయితే 10 లక్షల రూపాయలు ఇవ్వాలని, మెరుగైన కార్పొరేట్ వైద్యం అందించాలన్నారు. హమాలీ కార్మికులకు ఇంటి స్థలం 62 గజాలు ఇవ్వాలని, ఇండ్లు, డబుల్ బెడ్ రూమ్ లు కట్టి ఇవ్వాలని, హమాలి కార్మికులకు పిఎఫ్, ఇఎస్ఐ సౌకర్యం,హెల్త్ కార్డులు ఇవ్వాలని, హమాలీలకు ప్రభుత్వ సబ్సిడీల క్రింద ఉపాధి కల్పించాలన్నారు.ఈ సమస్యలను త్వరలో ప్రభుత్వం చొరవ చేసుకొని పరిష్కరించాలని మహాసభలో ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో హనుమకొండ జిల్లా సిపిఐ జిల్లా కార్యదర్శి కర్రె బిక్షపతి, సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు ఆదరి శ్రీనివాస్, ఏఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి జక్కు రాజు గౌడ్ , వర్కింగ్ ప్రెసిడెంట్ ధర్మల మూర్తి, సహాయ కార్యదర్శి రామ రాజేష్ ఖన్నా , ఉపాధ్యక్షులు శ్రీనివాస్, సహాయ కార్యదర్శి బత్తిని సదానందం, లంక దాసరి అశోక్, ఇల్లందుల రాములు తదితరులతో పాటు సుమారు 200 మంది హమాలీ కార్మికులు పాల్గొన్నారు.

## 'మధ్యాహ్న' వర్కర్స్‌కు రూ.10వేల గౌరవ వేతనం

మధ్యాహ్న భోజన వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు సుగుణ

సమ్మె కరపత్రాల ఆవిష్కరణ



**ప్రజాపక్షం/జయశంకర్ భూపాలపల్లి ప్రతినిధి:** కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు మధ్యాహ్న భోజన పథకం వర్కర్స్ కు పదివేల గౌరవ వేతనం అందజేయాలని మధ్యాహ్న భోజన పథకం వర్కర్స్ యూనియన్ ఏఐటియుసి రాష్ట్ర ఉపాధ్యక్షురాలు కొరిమి సుగుణ డిమాండ్ చేశారు. ఆదివారం భూపాలపల్లి జిల్లా కేంద్రంలోని స్థానిక ఎఐటియుసి కొమురయ్య భవన్‌లో మధ్యాహ్న భోజన వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో నిర్వహించబోయే సమ్మె కర పత్రాలు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సుగుణ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీని వెంటనే నిలబెట్టుకోవాలని మధ్యాహ్నం భోజన పథకం వర్కర్స్ పదివేల గౌరవ వేతనం వెంటనే అందజేయాలని కోరారు. అట్లాగే వంట సామాన్లు ప్రభుత్వమే సరఫరా చేయాలని అన్నారు. రాష్ట్రంలో ఉన్న మధ్యాహ్నం భోజన వర్కర్స్ సమస్యలను వెంటనే పరిష్కరించాలని లేదంటే ఈనెల 14న నిరవధిక సమ్మెకు పిలుపునివ్వడం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో వర్కర్స్ పరిమళ, పద్మ, రాజేశ్వరి, మల్లమ్మ, జనగాం పుష్ప, గుర్రం దేవమ్మ, కొండపర్తి మదనమ్మ, చీర లక్ష్మి, పద్మ అక్కినేని లక్ష్మి, రాజేశ్వరి, సుగుణ, ఎర్రం సారమ్మ తదితరులు పాల్గొన్నారు.

## ఎఐవైఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు వల్లీ ఉల్లా ఖాద్రీకి ఉత్తమ సంఘ సేవకులు అవార్డు




**ప్రజాపక్షం /హైదరాబాద్ :** అఖిల భారత యువజన సమాఖ్య (ఎఐవైఎఫ్) రాష్ట్ర అధ్యక్షులు వల్లీ ఉల్లా ఖాద్రీని ఉత్తమ సంఘ సేవకుల అవార్డు దక్కింది. ఆదివారం హైదరాబాద్‌లో జరిగి న ఓ కార్యక్రమంలో ఇండియన్ అమెరికన్ ఫోరమ్ వల్లీ ఉల్లా ఖాద్రీకి ఉత్తమ సంఘ సేవకులు అవార్డును ప్రధానం చేసి ఘనంగా సన్మానించింది. ఈ కార్యక్రమంలో ఎంఎల్‌సిలు ప్రొఫెసర్ ఎం.కోదండరామ్, అమీర్ అలీ ఖాన్, సీనియర్ కాంగ్రెస్ నాయకులు కొప్పుల రాజు, ఐఎఎస్ అధికారి అజయ్ మిశ్రా తదితరులు పాల్గొన్నారు.

## సమగ్ర శిక్ష ఉద్యోగుల సమ్మెకు ఎఐటియుసి మద్దతు

**ప్రజాపక్షం/జయశంకర్ భూపాలపల్లిప్రతినిధి :** విద్యా శాఖ సమగ్ర శిక్ష విభాగంలో పనిచేస్తున్న ఉద్యోగులను క్రమబద్ధీకరించాలని చేస్తున్న సమ్మెకు కాం ట్రాక్టు ఉపాధ్యాయులు ఉద్యోగులు ఈ నెల 10 నుండి తలపెట్టిన నిరవధిక సమ్మెకు ఎఐటియుసి జయశంకర్ భూపాలపల్లి జిల్లా సమితి సంపూర్ణ మద్దతు తెలియజేస్తున్నట్లు ఆ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి క్యాతరాజు సతీష్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, గత 18 సంవత్సరాలుగా విద్యా శాఖలో పనిచేస్తూ ఉన్న ఉద్యోగులను కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలో కి వచ్చిన వెంటనే క్రమబద్ధీకరిస్తానని, హామీ ఇచ్చి సంవత్సర కాలమైన తర్వాత కూడా ఆ వూసే ఎత్తడం లేదు అన్నారు. 2023 వరంగల్లో చేపట్టిన రాష్ట్రవ్యాప్త ఆందోళన సందర్భంలో ఇచ్చిన హామీని గుర్తు తెచ్చుకొని వెంటనే వారిని క్రమబద్ధీకరించాలని అన్నారు. రాష్ట్రవ్యాప్తంగా పనిచేస్తున్న



19600 మంది ఉద్యోగులకు భద్రత కల్పించాలని, అందరికీ జీవిత ఆరోగ్య భీమా సదుపాయాలు కల్పించాలన్నారు. ఉద్యోగ విరమణ చేసేవారికి 20 లక్షల రూపాయల ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎఐటియుసి నాయకులు కోరిమి సుగుణ, వేముల శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

## కొత్త పిచ్చయ్య సేవలు మరువలేనివి : విశ్వనాథం

**ప్రజాపక్షం/పాల్వంచ:** నిబద్ధత కలిగిన కమ్యూనిస్టు నాయకుడిని కోల్పోయామని సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు ముత్యాల విశ్వనాథం అన్నారు. రైతు సంఘం మాజీ జిల్లా సహాయ కార్యదర్శి కొత్త పిచ్చయ్య 3వ వర్ధంతి సందర్భంగా ఆదివారం సిపిఐ, రైతు సంఘం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. పాండురంగ పురం గ్రామంలో ఉన్న పిచ్చయ్య స్మారక స్థూపం వద్ద ఎర్రజెండాను ఆవిష్కరించి, పూలమాలలు వేసి నివాళి అర్పించారు. అనంతరం జరిగిన వర్ధంతి సభలో ఆయన మాట్లాడుతూ పాల్వంచ మండలంలో పార్టీ, ప్రజా సంఘాల విస్తరణకు ఎనలేని కృషి చేస్తూ రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శిగా అందించిన సేవలు మరువలేనివని ఆయన సేవలను స్మరించుకున్నారు. సమస్యలపై స్పందిస్తూ వాటి పరిష్కారం కోసం అనునిత్యం శ్రమించే వాడని, పలు గ్రామాల ప్రజలను



కమ్యూనిస్టు ఉద్యమాల వైపు మళ్లించి పార్టీ, ఎఐటియుసి విస్తరణలో ప్రముఖ పాత్ర పోషించాడని కొనియాడారు. ఆయన ఆశయాలను సాధించిన నాడే ఆయనకు ఘనమైన నివాళులర్పించిన వారు అవుతామని, నాయకులు కార్యకర్తలు ఈ బాధ్యతలు స్వీకరించి ఆయన ఆశయాలను సాధించాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా సమితి సభ్యులు బండి నాగేశ్వరరావు, ఉప్పుశెట్టి రాహుల్, వీ పద్మజ, గుండాల నాగరాజు, సిపిఐ ప్రజాసంఘాల నాయకులు ఇట్టి వెంకట్రావ్, శ్రీనివాస్‌రావు, తదితరులు పాల్గొన్నారు.

# సంక్షోభంలో వ్యవసాయ కార్మికులు

## దేశవ్యాప్తంగా దళితులు, మైనార్టీలు, గిరిజనులపై హత్యలు, అత్యాచారాలు

## అన్నివర్గాల ప్రజలను ఏకం చేసి బికెఎంయు పోరాటాలు

## బికెఎంయు జాతీయ కార్యదర్శి వి.ఎస్.నిర్మల్




**ప్రజా పక్షం/నార్సింగి :** పాలక ప్రభుత్వ విధానాల వల్ల వ్యవసాయ కార్మికులు సంక్షోభంలోకి నెట్టబడ్డారు అని బి.కె.ఎం.యు జాతీయ కార్యదర్శి వి.ఎస్ నిర్మల్ అన్నారు. ఎలైట్ హోటల్ శంషాబాద్‌లో ఆదివారం జరిగిన రాష్ట్ర కౌన్సిల్ సమావేశాలలో ముఖ్యఅతిథిగా పాల్గొని ఆయన మాట్లాడుతూ దేశవ్యాప్తంగా పాలక ప్రభుత్వ విధానాల వ్యవసాయ కార్మికులు సంక్షోభంలోకి నెట్టబడ్డారని ఆయన అన్నారు. దానికి కారణం దేశవ్యాప్తంగా వ్యవసాయ కార్మికుల మధ్యలో కులమతాల భేదాలవిభజన తీసుకువచ్చి వ్యవసాయ కార్మికులను ఐక్యం కాకుండా చేస్తున్నారని ఆయన విమర్శించారు. బిజెపి ప్రభుత్వం మూడు సార్లు అధికారంలోకి వచ్చి అధికార దాహంతో దళితులు, మైనార్టీలు గిరిజనులపై హత్యలు, అత్యాచారాలు కొనసాగుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఇలాంటి పరిస్థితుల్లో అన్నివర్గాల ప్రజలను ఏకం చేసి పోరాటాలు నిర్వహిస్తున్నది దేశవ్యాప్తంగా ఒక్క బికెఎంయు అని ఆయన తెలిపారు. ప్రధానమంత్రి నరేంద్రమోదీ దేశాలు తిరిగే దాని మీద పెట్టే దృష్టి భారతదేశంలో అట్టడు వర్గాల అభివృద్ధి కోసం పెట్టి ఉంటే బాగుండేదని అభిప్రాయపడ్డారు. కానీ ఆ దృష్టి నరేంద్ర మోదీకి లేదని, ఆదాని అంబానీ శతకోటీశ్వరులకు ఎర్ర తివాచీపరుస్తున్నారని ఆయన అన్నారు. పేదలను దోచుకొని దాచుకోండి అని చెబుతున్న పరిస్థితి ఉందని అన్నారు. పేదలకు కావాల్సింది ఉచిత పథకాలు కావని శాశ్వత పథకాలైన ఇల్లు, భూమి, ఉద్యోగమని, దానికోసం ప్రభుత్వాలు ప్రయత్నం చేయకపోవడం బాధాకరమన్నారు. భారతదేశ జనాభా 140 కోట్లు దాటిందని, అందులో 100 కోట్లకు పైగా పేదలే ఉన్నారని, వారి కోసం వారి సంక్షేమం కోసం ప్రభుత్వాలు పాటుపడాల్సింది పోయి పేదలనే దోచుకుంటే వారు ఇక ఎవరికి మొరపెట్టుకోవాలని కేంద్ర ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. ఎన్నో పోరాటాలు చేస్తే 2005లో జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం వచ్చిందని ఆ పథకం అమలుపరచడంలో బిజెపి ప్రభుత్వం బడ్జెట్ తగ్గించడంతోపాటు పథకంలో ఉన్న ఉద్యోగులను కూడా తొలగించి పథకాన్ని నీరుకారుస్తుందని అన్నారు. అందుకే బికెఎంయు ఆధ్వర్యంలో దేశవ్యాప్తంగా పోరాటాలు నిర్వహించాల్సిన అవసరం ఉందని ఆయన అన్నారు. తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో రెండు రోజుల కౌన్సిల్ సమావేశాలలో వ్యవసాయ కార్మికులు ఎదుర్కొంటు న్న సమస్యలపై సుదీర్ఘంగా చర్చించడం జరిగిందని తెలంగాణ రాష్ట్ర ప్రభు త్వం ప్రజలకు ఇచ్చిన 6 గ్యారంటీలను అమలు చేయడంలో విఫలమైందని రోజురోజుకు కెసిఆర్ ప్రభుత్వం లాగానే రేవంత్ రెడ్డి ప్రభుత్వం కూడా కొత్త కొత్త విధానాలను ఎజెండాలో లేని పథకాలను అమలుపరచడానికి ఉత్సాహపడుతుందని ఆరోపించారు. మొదట 6 గ్యారెంటీలను అమలుపరిచి తర్వాత మిగతా పథకాల జోలికి పోవాలని రాష్ట్ర ప్రభుత్వానికి సూచించారు. లేనియెడల పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు నిర్వహించాలని కౌన్సిల్ తీర్మానించింది అని ఆయన తెలిపారు. 27న కలెక్టర్ కార్యాలయం ముందు ప్రభుత్వ పథకాలు అమలు కోసం పోరాటాలు నిర్వహించాలని ఆయన పిలుపునిచ్చారు. రాష్ట్ర అధ్యక్షుడు కలకొండ కాంతయ్య అధ్యక్షతన జరిగిన ఈ కౌన్సిల్ సమావేశాలలో సీనియర్ నాయకులు మోతెలింగారెడ్డి, రాష్ట్ర ఆఫీస్ బేరర్స్ సృజన్ కుమార్, యేసయ్య, బాబు, బుద్ధుల జంగయ్య, సిపిఐ మాజీ జిల్లా కార్యదర్శి పుస్తకాల నర్సింగరావు, ఎఐటియుసి రాష్ట్ర కార్యదర్శి ఓరుగంటి యాదయ్య, బి.కె.ఎం.యు జిల్లా అధ్యక్షుడు అంజయ్య, సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు యాదగిరి, శంషాబాద్ మండల సిపిఐ కార్యదర్శి నర్రగిరి, నాయకులు ఎం.రాములు, ఎం.కృష్ణ, టి.శంకర్, మహాలక్ష్మి, వినోద, వివిధ జిల్లాల నుంచి కౌన్సిల్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# బాధ్యతల కోసం పరిశ్రమించండి

## రేపటి భారతావనిలో నైతిక విలువలు పెంచండి

## ఎస్‌టియు 78వ వార్షిక కౌన్సిల్ సమావేశంలో

## సిపిఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకటరెడ్డి పిలుపు



**ప్రజాపక్షం /హైదరాబాద్ :** స్వాతంత్ర్యానికి పూర్వం నుంచే ఉద్యమాలే ఊపిరిగా విద్యా ఉపాధ్యాయ రంగ సేవలో అగ్రగామిగా సాగుతున్న రాష్ట్రోపాధ్యాయ సంఘం (ఎస్‌టియుటిఎస్)గా రేపటి తరాన్ని ఉన్నతంగా తీర్చిదిద్దాల్సిన బాధ్యతను తీసుకోవాలని సిపిఐ జాతీయ కార్యవర్గ సభ్యులు చాడ వెంకటరెడ్డి సూచించారు. అదేసమయంలో మారుతున్న సమాజంలో కాలానుగుణంగా దిగజారిపోతున్న నైతిక విలువలు పెంపొందించేందుకు సైతం కృషి చేయాలన్నారు. హైదరాబాద్‌లోని ఎస్‌టియు రాష్ట్ర కార్యాలయంలో ఆదివారం రాష్ట్ర అధ్యక్షులు పర్వత్ రెడ్డి అధ్యక్షతన 78వ వార్షిక కౌన్సిల్ సమావేశం జరిగింది. ఈ సమావేశాలకు ముఖ్యఅతిథులుగా విచ్చేసిన చాడ వెంకటరెడ్డి మాట్లాడుతూ నిజాం కాలంలోను ఎస్‌టియు ఉపాధ్యాయులకు పేస్కేళ్లు సాధించడం, ప్రశ్నించే తత్వాన్ని సామాజిక కోణాన్ని ఉపాధ్యాయులకు అలవాటు చేయడం మంచి పరిణామమన్నారు. నిర్మాణాత్మక ప్రతిపక్షంగా కొనసాగడం, క్షేత్రస్థాయిలో అసంబద్ధతలను విధానాలను సలహాలను సూచనలను ప్రభుత్వానికి నివేదించడం అభినందనీయమన్నారు. ఇటీవల విద్యార్థులు ఉపాధ్యాయులపై దాడికి పాల్పడుతుండడం సమాజానికి మంచిది కాదని, ఇలాంటి పరిస్థితులు తలెత్తకుండా రేపటి తరానికి నైతిక విలువలను పెంపొందించాలన్నారు. ప్రస్తుత ప్రభుత్వం విద్యారంగం, ఉపాధ్యాయుల పట్ల సానుకూలంగా ఉండడం శుభసూచకమని, సమస్యల పరిష్కారంలో తమవంతు సహకారం ఉంటుందని చాడ వెంకటరెడ్డి తెలిపారు. ఎస్‌టియు మాజీ అధ్యక్షులు ఎపి మాజీ ఉపాధ్యాయ ఎంఎల్‌సి కత్తి నరసింహారెడ్డి మాట్లాడుతూ ఎస్‌టియు ప్రాతినిధ్యం పోరాటాలతో ఆలోచనలతో అనేక ఉత్తర్వులను సాధించామన్నారు. సంఘ కార్యకర్తలు, నాయకులు తమ వృత్తిలో అంకితభావంతో పనిచేయాలని ఆదర్శంగా నిలవాలని సూచించారు. ఎన్ని సాంకేతిక విప్లవాలు డిజిటల్ మాధ్యమాలు వచ్చినా ఉపాధ్యాయుని విలువ తరగదని, వృత్తి గౌరవాన్ని ఇనుమడింపజేసే విధంగా ఉండాలని, అదే సమయంలో సమస్యల సాధనలో, హక్కుల సాధనలో అండగా ఉండాలని క్రమశిక్షణే ఊపిరిగా జీవించాలన్నారు. ఎస్‌టియు బలపరిచిన, జాక్టో ఉమ్మడి ఉపాధ్యాయ సంఘాల అభ్యర్థి పూల రవీందర్ మాట్లాడుతూ... వరంగల్, ఖమ్మం, నల్గొండ ఉపాధ్యాయ ఎంఎల్‌సి ఎన్నికల్లో మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని కోరారు. రాష్ట్ర అధ్యక్షులు ఎం.పర్వత రెడ్డి మాట్లాడుతూ పిఆర్‌సి గడువు ముగిసి ఏడాది దాటినా ప్రభుత్వం స్పందించకపోవడం దారుణమన్నారు. 317 అమలుపై కమిటీలు వేసి కాలయాపన చేయడం కాకుండా స్థానికత కోల్పోయిన ఉపాధ్యాయులకు సర్దుబాటు చేయాలని డిమాండ్ చేశారు. ప్రధాన కార్యదర్శి సదానందం గౌడ్ మాట్లాడుతూ ప్రజా ప్రభుత్వం పెండింగ్‌లో ఉన్న బదిలీలు, పదోన్నతులు, పండిత పిఇటి పోస్టులను ఉన్నతీకరణ చేసి పరిష్కారం చేయడం సంతోషకరమన్నారు. ఎస్‌టియు ఎపి అధ్యక్షులు సాయిశ్రీనివాస్ మాట్లాడుతూ రెండు రాష్ట్రాలు ఒక ఉమ్మడివేదిక ఏర్పాటు చేసుకొని సంఘ ఉన్నతికి కృషిచేద్దామని పిలుపునిచ్చారు.ఈ సమావేశంలో రాష్ట్ర ఆర్థిక కార్యదర్శి ఆటసదయ్య, రాష్ట్ర బాధ్యులు గజేందర్, ఎల్ఎం ప్రసాద్, ఎవి.సుధాకర్, కరుణాకర్ రెడ్డి, కృష్ణారెడ్డి,పోల్ రెడ్డి, ఎఐఎస్‌టిఎఫ్ బాధ్యులు పరమేశ, పున్న గణేష్, సీనియర్ నాయకులు ముకుందరావు, శిరీష, ప్రసూన, శ్రీదేవి, అజర్ జహా, నీరజ, విశ్వశాంతి, శీతల్ చౌహాన్, 33 జిల్లాల అధ్యక్షులు కార్యదర్శులు రాష్ట్ర బాధ్యులు కన్వీనర్లు పాల్గొన్నారు.



## ప్రత్యక్ష నియామకాల ద్వారా..

# లైబ్రేరియన్ అనుబంధ పోస్టులు భర్తీ

## లైబ్రరీ సైన్స్ నిరుద్యోగ అభ్యర్థుల వినతి

**ప్రజాపక్షం /హైదరాబాద్ :** రాష్ట్రంలోని గ్రంథాలయాలలో ఖాళీగా ఉన్న లైబ్రేరియన్ తదితర అనుబంధ పోస్టులను ప్రత్యక్ష నియామకాల ద్వారా భర్తీ చేయాసేలా ఒత్తిడి తీసుకురావాలని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, ఎంఎల్‌ఎ కూనంనేని సాంబశివరావుకు లైబ్రరీ సైన్స్ నిరుద్యోగ అభ్యర్థులు విజ్ఞప్తి చేశారు. ఈమేరకు ఆదివారం హైదరాబాద్‌లోని సిపిఐ రాష్ట్ర కార్యాలయం మగ్దూం భవన్‌లో కూనంనేని సాంబశివరావుకు వినతిపత్రం అందజేశారు. గ్రంథాలయ శాఖ సమస్యల పరిష్కారానికై మాట్లాడాలని లైబ్రరీ సైన్స్ నిరుద్యోగ అభ్యర్థులు కూనంనేనికి విజ్ఞప్తి చేశారు. పాఠశాలలు, వివిధ ప్రభుత్వ కళాశాలలు, ఐటిఐ కళాశాలలు, సాంకేతిక కళాశాలలు, మెడికల్ కళాశాలలు, విశ్వవిద్యాలయాల్లో పౌర గ్రంథాలయంలో ఖాళీలుగా ఉన్న లైబ్రేరియన్ , వాటి అనుబంధ పోస్టులు గత 35ఏళ్ల నుంచి ప్రత్యక్ష నియామకాలు చేపట్టకపోవడంతో పౌర గ్రంథాలయాలు నిర్వీర్యం అవుతున్నాయని, సోమవారం నుంచి జరగనున్న అసెంబ్లీ సమావేశాల్లో అంశాలను లేవనెత్తి ఉద్యోగ అవకాశాలు కల్పించేలా చూడాలని కూనంనేని సాంబశివరావుకు ఎఐవైఎఫ్ రాష్ట్ర కార్యదర్శి కె.ధర్మేంద్ర, తెలంగాణ లైబ్రెరీ సైన్స్ నిరుద్యోగ సంఘం కన్వీనర్ ఆకుల సాయిలు విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా కూనంనేని సాంబశివరావు మాట్లాడుతూ సిపిఐ తరుపున లైబ్రరీ సైన్స్ నిరుద్యోగ అభ్యర్థుల అంశాలను అసెంబ్లీ సమావేశాల్లో ప్రస్తావించడం ద్వారా ముఖ్యమంత్రి దృష్టికి, క్యాబినెట్ దృష్టికి తీసుకెళ్తానని వారికి హామీ ఇచ్చారు. కూనంనేనిని కలిసివారిలో ఎఐవైఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు టి.సత్య ప్రసాద్, తెలంగాణ లైబ్రరీ సైన్స్ నిరుద్యోగ అసోసియేషన్ సభ్యులు ఎం. మంజూల, సుమన్, ఎం.రాము,ఎస్.ప్రశాంత్, ఎస్.శివ, సిద్దుల శివ,బాల బ్రహ్మం ఉన్నారు.

# సంధ్య థియేటర్ ఘటనపై ముగ్గురి అరెస్టు

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** పాన్ ఇండియా స్టార్ అల్లు అర్జున్ నటించిన పుష్పా 2 సినిమా చూసేందుకు వచ్చిన దిల్‌సుఖ్‌నగర్‌కు చెందిన రేవతి అనే మహిళ మృతి చెందింది. ఈ విషయాన్ని పోలీసులు సీరియస్‌గా తీసుకుని విచారణ చేపట్టారు. ఈ కేసులో ముగ్గురిని ఆదివారం అరెస్టు చేశారు. ఈ ఘటనపై పోలీసులు సంచలన విషయాలు మీడియా ముందుకు తెచ్చారు. ఈ ఘటనలో ముగ్గురు నిందితులను అరెస్టు చేశారు. నిందితులను మీడియా ముందు ప్రవేశపెట్టారు. సధ్య థియేటర్ యజమాని ఎం. సందీప్ (37)తో పాటు మేనేజర్ ఎం.నాగరాజు (51) అరెస్టు చేశారు. సరైన భద్రతా చర్యలు చేపట్టని సెక్యూరిటీ మేనేజర్ జి.విజయ్ చందర్ (53)ను కూడా అరెస్టు చేశారు. ముగ్గురిని అరెస్టు చేసిన చిక్కడపల్లి పోలీసులు రిమాండ్‌కు పంపించారు. సెంట్రల్ జోన్ డిసిపి అక్షాంశ్ యాదవ్ మాట్లాడుతూ..పుష్పా2 ప్రీమియర్ షో సంధ్య థియేటర్లో ఏరాపటు చేశారని, దీనికి అధిక సంఖ్యలో ప్రేక్షకులు హాజరయ్యారని తెలిపారు. ప్రేక్షకులతో పాటు సినిమాలో నటించిన కీలక నటులు హాజరవుతారన్న సమాచారం తమకు లేదని తెలిపారు. కనీసం థియేటర్ యాజమాన్యం కూడా తమకు సమాచారం చెప్పలేదని పేర్కొన్నారు. దీనికోసం థియేటర్ యాజమాన్యం కూడా ఎలాంటి ముందస్తు చర్యలు తీసుకోలేదని తెలిపారు. పబ్లిక్‌ను కంట్రోల్ చేసేందుకు ఎలాంటి ప్రైవేటు భద్రతను ఏర్పాటు చేయలేదని షాకింగ్ కామెంట్స్ చేశారు. ఎంట్రీ, ఎగ్జిట్‌లలో కూడా ఎటువంతి ప్రత్యేక ఏర్పాట్లు చేయలేదని తెలిపారు. ఇది ఇలా ఉండగా ఈ ఘటనలో నిఘా వైఫల్యం కూడా ఉన్నట్లు తెలుస్తుంది.

## దేశానికే ఆదర్శంగా

# కాంగ్రెస్ ప్రభుత్వ సంక్షేమ పథకాలు

## రాష్ట్ర రెవిన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి

## డోర్నకల్ నియోజకవర్గంలో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన



**ప్రజాపక్షం/మహబూబాబాద్ ప్రతినిధి:** దేశంలో ఎక్కడా లేనివిధంగా దేశానికే ఆదర్శంగా తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం సంక్షేమ పథకాలు అమలు చేస్తోందని, రాష్ట్ర రెవిన్యూ, గృహనిర్మాణ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. మహబూబాబాద్ జిల్లా డోర్నకల్ నియోజకవర్గంలో ప్రభుత్వ విప్ జాటోత్ రాంచంద్రునాయక్, మహబూబాబాద్ ఎంపి పోరిక బలరాంనాయక్, మహబూబాబాద్ ఎమ్మెల్యే డాక్టర్ భూక్య మురళీనాయక్‌తో కలిసి పలు సంక్షేమ పథకాలకు ఆదివారం ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి మాట్లాడుతూ రాష్ట్రంలో రైతు సంక్షేమం కోసం రైతు రుణమాఫీ, రైతుబంధు పథకాలు అమలు చేస్తూ పండిన ప్రతి గింజ ధాన్యం కొనుగోలు చేస్తూ సన్న రకాలకు రూ.500 బోనస్‌తో పాటు రైతులకు అనేక సౌకర్యాలు కల్పిస్తోందని అన్నారు. కొనుగోలు చేసిన ధాన్యంకు సంబంధించి 24గంటల్లోపే రైతుల ఖాతాల్లో డబ్బులు జమచేయడం జరుగుతుందన్నారు. పేదల కలలు సాకారం చేసేందుకు ఇందిరమ్మ ఇండ్ల పథకం ప్రవేశపెట్టిరూ.5లక్షలు రుణ సదుపాయం కల్పిస్తూ ప్రతి ఒక్కరికీ సొంతింటి కలను సాకారం చేసేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం శ్రీకారం చుట్టిందని అన్నారు. ఐటిడిఎ, జిల్లా వ్యాప్తంగా ఉన్న ప్రతి పేదవాడికి ఇల్లు నిర్మించుకునేందుకు ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత కల్పిస్తామని మంత్రి తెలిపారు. పేద కుటుంబంలోని ఎస్‌సి, ఎస్‌టి, బిసి, మైనార్టీ విద్యార్థినీ విద్యార్థులకు కార్పొరేట్ స్థాయిలో విద్యను అందించేందుకు ఇంటిగ్రేటెడ్ పాఠశాల నిర్మాణం చేపట్టడం జరిగిందని, అందులో భాగంగానే కందికొండ గ్రామంలో సుమారు రూ.125కోట్ల వ్యయంతో అత్యాధునిక వసతులతో పాశాల సముదాయం నిర్మించేందుకు శ్రీకారం చుట్టినట్లు ఆయన తెలిపారు. సర్వమతాలు, కులాలకు అతీతంగా అత్యున్నత ప్రమాణాలతో విద్యాబోధనలు అందించడం కోసం ప్రత్యేక నిధులు కేటాయిచామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జి కలెక్టర్ లెనిన్ వత్సల్ టోప్పో, అడిషనల్ కలెక్టర్ కె.వీరబ్రహ్మాచారి, పలు శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

**అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు**

డోర్నకల్ నియోజకవర్గంలో పలు అభివృద్ధి పనులకు మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి శంకుస్థాపనలు చేశారు. అమృత్ పథకం నిధుల కింద రూ.25.58 కోట్లతో పనులకు శంకుస్థాపన చేశారు. మహిళా సాధికారిక ఇందిరమ్మ క్యాంటిన్ ప్రారంభించారు. అబ్బాయిపాలెంలో అంగన్‌వాడి మోడల్ కేంద్రం ప్రారంభించి, చిన్నారులకు ఏకరూప దుస్తులు పంపిణీ చేశారు. 25ఎకరాల్లో సుమారు రూ.125కోట్ల వ్యయంతో ఇంటిగ్రేటెడ్ యంగ్ ఇండియా పాఠశాల భవన సముదాయానికి శంకుస్థాపన చేశారు. ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణానికి మంత్రి శంకుస్థాపన చేశారు.



ప్రజాపాలన విజయోత్సవాలలో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం ఏడాది పూర్తి చేసుకున్న సందర్భంగా జూబ్లీహిల్స్ నివాసంలో 'తెలంగాణ' మాసపత్రిక ప్రత్యేక సంచికను ఆవిష్కరించిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి

# విదేశాల్లో ఉద్యోగాలంటూ మోసం..

## నకిలీ జాబ్ వీసాలు జారీ చేసిన ఇద్దరి అరెస్టు




**ప్రజాపక్షం/హైదరాబాద్ :** విదేశాల్లో ఉద్యోగాలంటూ.. నకిలీ జాబ్ వీసాలు తయారు చేస్తున్న ఓ ముఠా గుట్టును హైదరాబాద్ నార్త్‌జోన్ టాస్క్‌ఫోర్స్ పోలీసులు రట్టు చేశారు.టాస్క్‌ఫోర్స్ డిసిపి వైవిఎస్. సుధీంద్ర కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. ఆసీఫ్‌నగర్‌కు చెందిన పౌల్ట్రీ వ్యాపారి ఎరువ అభిషేక్‌రెడ్డి 2020 నుంచి తుమ్మ చిన్నమ్మతో కలిసి హిమాయత్‌నగర్‌లోని కుబేరాటవర్స్‌లో 'జెఎంజె రెడ్డి కన్సల్టెన్సీ'ని నడపడం ప్రారంభించాడు. అభిషేక్‌రెడ్డి గతంలో ఉద్యోగ వీసాపై సింగపూర్ వెళ్లాడు. సింగపూర్లో ఉన్న పరిచయాల కారణంగా, అతను హిమాయత్‌నగర్‌లోని తుమ్మ చిన్నమ్మ సహాయంతో జెఎంజె రెడ్డి కన్సల్టెన్సీని ప్రారంభించాడు. వీరిద్దరూ తమ ప్రతినిధుల ద్వారా అధిక జీతాలు లేదా ప్రయోజనాలతో అభ్యర్థులకు ఆకర్షణీయమైన ఉద్యోగ ఆఫర్లను అందించారు. ఉద్యోగాల్లో ఎలాంటి అనుభవం లేకున్నా విదేశాల్లో నూటికి నూరు శాతం ఉద్యోగాలు కల్పిస్తామంటూ నమ్మబలికారు. వీసా, వసతి, మంచి జీతం వస్తుందని తెలిపారు. ఇది నమ్మిన సుమారు 25 మంది యువకులు జెఎంజె రెడ్డి కన్సల్టెన్సీ యజమాని అభిషేక్‌రెడ్డికి రూ.83లక్షలు డబ్బులు చెల్లించారు. మూడు నెలలు గడుస్తున్నా విదేశాల్లో ఉద్యోగం ఇప్పించకపోవడంతో అభ్యర్థులు ఆందోళన చెంది వారిని నిలదీశారు. దీంతో జెఎంజె రెడ్డి కన్సల్టెన్సీ వారు విదేశాల్లో ఉద్యోగాలు వచ్చాయని నమ్మిస్తూ నకిలీ వీసాలు, ఉద్యోగ పత్రాలు అందజేశారు. వీటిపై అభ్యర్థులు ఆరా తీయగా నకిలీవని గుర్తించారు. దీంతో బాధితులు హైదరాబాద్ పోలీసు కమిషనర్ సివి.ఆనంద్ దృష్టికి తీసుకెళ్లారు. దీంతో నారాయణగూడ పోలీస్టేషన్‌లో అభిషేక్‌రెడ్డి, తుమ్మ చిన్నమ్మలపై చీటింగ్ కేసు నమోదైంది. ఆ తర్వాత వారు తమ కార్యాలయాన్ని అల్వాల్‌కు మార్చుకున్నారు. అక్కడ వారిపై అల్వాల్ పోలీస్ స్టేషన్‌లో కూడాకేసు నమోదైంది. అప్పటి నుంచి వారు పరారీలో ఉన్నట్లు పోలీసులు గుర్తించారు. కమిషనర్ ఆదేశాల మేరకు టాస్క్‌ఫోర్స్ డిసిపి వైవిఎస్ సుధీంద్ర, నార్త్‌జోన్ టాస్క్‌ఫోర్స్ ఇన్‌స్పెక్టర్, నారాయణగూడ ఇన్‌స్పెక్టర్లు నిందితులను చాకచక్యంగా ఆదివారం అరెస్టు చేవారు. వారి నుంచి రెండు ల్యాప్‌టాప్‌లు, ఐదు సెల్ ఫోన్లు, 13 ఒప్పంద పత్రాలు, 11 నకిలీ వీసా పత్రాలు, ఐదు రబ్బర్ స్టాంపులు, బాధితుల సొమ్ముతో ఖరీదు చేసిన రూ.25 లక్షల విలువైన కియా కారును స్వాధీనం చేసుకున్నారు. ఇలాంటి కన్సల్టెన్సీల పట్ల అప్రమత్తంగా ఉండాలని నగర పోలీసు కమిషనర్ సివి ఆనంద్ ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

## రోడ్డు ప్రమాదంలో..

# ఇద్దరు కానిస్టేబుళ్లు మృతి

## బాధిత కుటుంబాలను పరామర్శించిన పోలీస్ కమిషనర్ అనురాధ



**ప్రజాపక్షం/గజ్వేల్ :** గజ్వేల్ పట్టణంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు యువ పోలీసులను కోల్పోవడం పోలీస్ శాఖకు తీరనిలోటని పోలీస్ కమిషనర్ అనురాధ పేర్కొన్నారు. అకారణంగా రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన పోలీసులు పరంధాములు, వెంకటేష్ మృతదేహాలను గజ్వేల్ ప్రభుత్వ ఆసుపత్రి మార్చురి వద్ద సందర్శించి ఆమె తీవ్ర దిగ్భ్రాంతి, సంతాపం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా పుష్పగుచ్చాలు వారి మృతదేహాలపై ఉంచి నివాళులర్పించారు. గా పెద్ద కోడూరుకు చెందిన వర్కల్ పరంధాములు(46) రాయపోల్ పోలీస్ స్టేషన్ లో విధులు నిర్వహిస్తుండగా, గాడిచర్లపల్లి కి చెందిన పూసల వెంకటేష్(38) దౌల్తాబాద్ పోలీస్ స్టేషన్లో విధులు నిర్వహిస్తున్నారు. ఆదివారం తెల్లవారు జామున ఈ ఇరువురు మోటార్ సైకిల్ పై హైదరాబాద్, ఈసీఎల్ లో రన్ జాతరకు పాల్గొనడానికి వెల్తుండగా, గజ్వేల్ శివారు పాండవుల చెరువు సమీపంలో గుర్తు తెలియని వాహనం ఢీ కొట్టింది. దీంతో వారికి బలమైన గాయాలు తగలడంతో అక్కడికక్కడే మృతి చెందారు. సంఘటన స్థలాన్ని పోలీస్ కమిషనర్ అనురాధ, అడిషనల్ డీసీపీ మల్లారెడ్డి, ఏసీపీ మధు, గజ్వేల్ సిఐ సైదా, దౌల్తాబాద్ ఎస్ఐ శ్రీరామ్ ప్రేమ్ దీప్ పరిశీలించారు. బాధితుల ఫిర్యాదు మేరకు గజ్వేల్ పోలీసులు కేసు నమోదు చేసి పరిశోధన ప్రారంభించినట్లు సిఐ సైదా పేర్కొన్నారు. బాధిత కుటుంబాలకు అండగా ఉంటామని, అంత్యక్రియల ఖర్చు నిమిత్తం ప్రభుత్వం తరపున ఇరు కుటుంబాలకు రూ.60 వేలు పోలీస్ కమిషనర్ అనురాధ అందజేశారు. ఈ సంఘటనతో ఇరు కుటుంబాలతో పాటు పోలీసు శాఖలో తీవ్ర విషాదం నెలకొంది.

# మెట్రో కారిడార్లు, స్టేషన్లలో ప్రజాపాలన ప్రజా విజయోత్సవాలు

## తెలంగాణ తల్లికి ఘన నీరాజనం




**ప్రజాపక్షం/హైదరాబాద్ :** ప్రజాపాలన ప్రజా విజయోత్సవాలను హైదరాబాద్ మెట్రో రైల్ సంస్థ ఘనంగా నిర్వహిస్తోంది. ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి దిశానిర్దేశంతో రూపొందించిన తెలంగాణ తల్లి విగ్రహ నమూనా చిత్రాన్ని రద్దీ ఎక్కువగా ఉండే మెట్రో స్టేషన్లలో ప్రదర్శిస్తున్నారు. 'జయ జయహే తెలంగాణ జననీ జయకేతనం' అనే పాట చరణంతో కూడిన పదాలతో హైదరాబాద్ మెట్రో రైల్ మొత్తం 25 మెట్రో స్టేషన్లలో కొత్తగా రూపొందించిన 'తెలంగాణ తల్లి' చిత్రాలను ఏర్పాటు చేసినట్టు హెచ్‌ఎంఆర్‌ఎల్ ఎం.డి. ఎన్‌విఎస్ రెడ్డి తెలిపారు. ముఖ్యమంత్రి సూచనల మేరకు ప్రజాపాలన విజయోత్సవాలను హైదరాబాద్ మెట్రో స్టేషన్ల పరిధిలో జోరుగా నిర్వహిస్తున్నామన్నారు. మెట్రో రైల్ రెండవ దశ ముఖ్య అంశాలను తెలియచేసేలా స్టేషన్ల కాన్ కోర్స్‌లు, ప్లాట్ ఫామ్‌లపైన స్టాండీలను ఏర్పాటు చేశామని, ప్రధాన మార్గాలలో మెట్రో పిల్లర్లకు హోర్డింగ్‌లను ఏర్పాటు చేసి ఈ సంవత్సరం ప్రభుత్వ విజయాలను, మెట్రో సాధిస్తున్న ప్రగతిని వివరించామని ఎన్‌విఎస్ రెడ్డి చెప్పారు. అందమైన విద్యుద్దీపాల అలంకరణతో ముఖ్యమైన మెట్రో మార్గాలు ప్రజలను విశేషంగా అలరిస్తున్నాయి. సంవత్సర పాలన విజయాలను ఘనంగా ప్రతిబింభించేలా హైదరాబాద్ మెట్రో రైల్ సంస్థ, నేను సైతం అంటూ వేడుకలలో ఉత్సాహంగా పాల్గొంటోంది.

# ఏడాది'లో 'తిరోగమన తెలంగాణ'

## సిఎం రేవంత్ ఒక దుర్భాష దురంధరుడు

## మాజీ మంత్రి హరీశ్ రావు



**ప్రజాపక్షం/హైదరాబాద్:** కాంగ్రెస్ ఏడాది పాలనలో తెలంగాణ ప్రజలను సంపూర్ణంగా హతాశులను చేసిందని బిఆర్‌ఎస్ మాజీ మంత్రి తన్నీరు హరీశ్ రావు ఆరోపించారు. బిఆర్‌ఎస్ చేసిన పదేళ్ల అభివృద్ధిని కాంగ్రెస్ పన్నెండు నెలల పాలనలోనే పాడు చేసిందని మండిపడ్డారు. సిఎం రేవంత్‌రెడ్డి ఒక దుర్భాష దురంధరునిగా వ్యవహరిస్తున్నారన్నారు. హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో "ఏడాది పాలన ఎడతెగని వంచన"అనే పేరుతో హరీశ్ రావు ఆదివారం బిఆర్‌ఎస్ చార్జ్‌షీట్‌ను విడుదల చేశారు. ఈ సందర్భంగా హరీశ్ రావు మాట్లాడుతూ పురోగమన తెలంగాణను తిరోగమన తెలంగాణగా మార్చారని దుయ్యబట్టారు. కాంగ్రెస్ ఏడాది పాలనలో సంక్షేమం కూనరిల్లిందని, సంక్షోభం ముంచుకొస్తుందన్నారు. అణిచివేత విరుచుకుపడుతున్నదన్నారు. మొత్తం మీద కాంగ్రెస్ ఏడాది పాలన ఎడతెగని వేదననే మిగిలించిందన్నారు. ఫిరాయింపులు, దబాయింపులు, బుకాయింపులతో రేవంత్ మార్కు ప్రజాపాలన వర్ధిల్లుతున్నదని ఎద్దేవా చేశారు. ఏడాది పాలనలో ఏం కోల్పోయామో ప్రజలు ఇప్పుడిప్పుడే గ్రహిస్తున్నారని కెసిఆర్ అన్న మాట అక్షర సత్యమన్నారు. వాస్తవాలను జీర్ణించుకోలేని రేవంత్, ఎగతాళిగా మాట్లాడుతున్నాడని, ఎగిరెగిరి పడుతున్నారని హరీశ్‌రావు ఆరోపించారు. రైతు బంధు, చేప పిల్లల పంపిణీ, దళిత, బిసి బంధును కోల్పోయారని అన్నారు. మంత్రివర్గంలో మైనార్టీలకు అవకాశం ఇవ్వలేదన్నారు. అమ్మ ఒడిలోనో, బడిలోనో ఆనందంగా ఉండాల్సిన పిల్లలు తమ విలువైన ప్రాణాలు కోల్పోయారని, రాష్ట్ర ప్రజలు ఉజ్వల భవిష్యత్తును కోల్పోయారని చెప్పారు. ప్రజాస్వామ్య పాలన , భావ ప్రకటనా స్వేచ్ఛ, నిరసన తెలిపే హక్కులను కాపాడుతామని కాంగ్రెస్ తన అభయహస్తం మ్యానిఫెస్టోలో పొందపర్చిందని హరీశ్‌రావు తెలిపారు. కాంగ్రెస్ ఏడాది పాలనలో భావ ప్రకటన స్వేచ్ఛకు భంగం వాటిల్లిందని, నిరసన తెలిపే హక్కు లేదని, నిరంకుశత్వమే మిగిలిందని చెప్పారు. ముఖ్యమంత్రి సొంతూరుకు ఎవరైనా పోవాలంటే కూడా పోలీసు స్టేషన్‌లో అనుమతి పత్రాలు తీసుకోవాల్సిన దుర్మార్గాన్ని ఎన్నడైనా చూశామా అని ప్రశ్నించారు. రాజకీయకక్షతో తప్పుడు కేసులు పెట్టడం, అవి న్యాయస్థానాల్లో వీగిపోవడం కాంగ్రెస్ ఏడాది పాలనలో సర్వసాధారణంగా మారిందన్నారు. ప్రతిపక్షాలకు తిట్లు, ప్రజలకు కొట్లు, దేవుళ్ల మీద ఒట్లు, తనకు తన వారికి దోపిడీ సొమ్ము నోట్లు అని హరీశ్ రావు ఎద్దేవా చేశారు.

# సామాజిక అభ్యున్నతే లక్ష్యంగా సాహితీ సృజన

## అరసం జాతీయ కార్యదర్శి వేల్పుల నారాయణ




**ప్రజాపక్షం/కరీంనగర్ ప్రతినిధి :** సామాజిక అభ్యున్నతే లక్ష్యంగా రచయితలు సాహితీ సృజన చేయాలని అభ్యుదయ రచయితల సంఘం జాతీయ కార్యదర్శి వేల్పుల నారాయణ అన్నారు. ఆదివారం కరీంనగర్‌లో భగవతి స్కూల్ ఆడిటోరియంలో అభ్యుదయ రచయితల సంఘం ఆధ్వర్యంలో ప్రముఖ రచయిత కాలువ మల్లయ్య పుస్తకాల ఆవిష్కరణ సభ జరిగింది. ఈ సభలో వేల్పుల నారాయణ మంచి అన్నది మాల ఐతే నవలను వేల్పుల నారాయణ, పదహారు గంటల యాది నవలను బొద్దుల లక్ష్మణ్, గంప వ్యాస సంపుటిని సంతోష్ ఆవిష్కరించారు. ఈ పుస్తకాలను రచయితలు కూకట్ల తిరుపతి, బూర్ల వెంకటేశ్వర్లు, సంకెపల్లి నాగేంద్ర శర్మలు సమీక్షించారు. సంకెపల్లి నాగేంద్ర శర్మలు సమీక్షించారు. అరసం జిల్లా అధ్యక్షుడు గులాబీల మల్లారెడ్డి అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా పాల్గొన్న వేల్పుల నారాయణ మాట్లాడుతూ రచయితలు ఏ ప్రక్రియలో రచనలు చేసినా ప్రజాజీవిత వాస్తవికతను ప్రతిబింబించాలని, ప్రజాపక్షంగా ఉండాలన్నారు. అవార్డులు, రివార్డుల కోసం కాకుండా జనచైతన్యం కోసం కృషి చేయాలని, ప్రజలిచ్చే అవార్డులే గొప్పవన్నారు. ప్రముఖ రచయిత కాలువ మల్లయ్య మాట్లాడుతూ తెలంగాణ జీవద్భాషను రక్షించుకోవాలని, అందుకోసం తాను తెలంగాణ యాసలో ప్రజాసమస్యలే వస్తువులుగా రచనలు చేస్తున్నానని అన్నారు. కొత్త రచయితలు సాహితీ రంగంలోకి రావాల్సిన అవసరముందని అన్నారు.

ఈ సమావేశంలో బొద్దుల లక్ష్మణ్, సబ్బని లక్ష్మి నారాయణ, బాలసాని కొంరయ్య, దామెరకుంట శంకరయ్య, సంగినేని రవీందర్, కందుకూరి అంజయ్య తదితరులు మాట్లాడారు.

# ఐఎల్–76 విమానంలో అసద్ పలాయనం?




**డమాస్కస్:** తిరుగుబాటుదారులు దేశ రాజధాని డమాస్కస్‌ను కూడా ఆక్రమించుకోవడంతో, సిరియా అధ్యక్షుడు బషీర్ అసద్ 'ఎస్‌ఎఎస్‌ఆర్ 9218' అనే రష్యా తయారీ ఐఎల్ 76 విమానంలో వెళ్లిపోయినట్లు సైన్యాధికారి ఒకరు వెల్లడించారు. అయితే అధ్యక్షుడి గమ్యస్థానం ఏదో చెప్పలేదు. అంతేగాక, అధికారిక ప్రకటనగా పేర్కొలేదు. కాగా, అధ్యక్షుడు అసద్ విమానాన్ని తిరుగుబాటుదారులు కూల్చివేసినట్లు సామాజిక మాధ్యమాల్లో ప్రచారం జరుగుతోంది. తొలుత సిరియా సముద్ర తీరం వైపు ప్రయాణించిన అసద్ విమానం మార్గమధ్యలో ఒక్కసారిగా వ్యతిరేక దిశలోకి ప్రయాణించాక కొద్ది సేపటికే ఫ్లైట్ రాడార్ నుంచి అదృశ్యమైందని యుఎస్ఎ టుడే పేర్కొంది. జామింగ్, ట్రాకింగ్ ఎర్రర్ వల్ల ఇలా జరిగిందా లేక విమానాన్ని కూల్చివేశారా? ఏదైనా ప్రమాదం జరిగిందా? అన్న అనుమానాలు ఉత్పన్నమయ్యాయి. అయితే రాజధాని డమాస్కస్‌పై పట్టు బిగించిన నేపథ్యంలో అసద్ కుటుంబ సమేతంగా నగరాన్ని వీడినట్లు సైన్యాధికారులు తెలిపారు. ఆయన ప్రయాణిస్తున్న ఐఎల్76 విమానం 3,650 మీటర్ల ఎత్తు నుంచి 1,070 మీటర్లకు పడిపోయిందని ఫ్లైట్ ట్రాకింగ్ వెబ్‌సైట్ల ద్వారా తెలిసినట్లు ఈజిప్ట్ రచయిత ఖలీద్ మహమూద్ ఎక్స్‌లో పేర్కొన్నారు. తిరుగుబాటు దళాలే ఆయన విమానాన్ని కూల్చివేశాయన్న ప్రచారం మొదలైంది. దీనిపై సిరియా నుంచి అధికారిక సమాచారం లేదు.

## సిరియాలో ఇజ్రాయెల్–అమెరికా విజయం తాత్కాలికం

### టర్కీ కమ్యూనిస్టు పార్టీ

**ఇస్తాంబుల్:** సిరియాలో అసద్ ప్రభుత్వాన్ని సాయుధ తిరుగుబాటుదారులు కూల్చివేశారు. రాజధాని డమాస్కస్‌ను స్వాధీనపర్చుకున్నారు. తాజా పరిణామాన్ని టర్కీ కమ్యూనిస్టు పార్టీ (టీకేపీ) ఆదివారం ఒక ప్రకటనలో ఖండించింది. అమెరికా, బ్రిటన్, ఇజ్రాయెల్, ఏకేపీ ప్రభుత్వం కలిసి కట్టుగా సిరియా ప్రభుత్వాన్ని కేవలం వారం రోజుల్లో కూల్చేశాయని దుయ్యబట్టింది. సిరియాను అస్థిరపర్చేందుకు 15ఏళ్లుగా సాగుతున్న తిరుగుబాటుదారుల ప్రయత్నాలు ఫలించాయి. అమెరికా సామ్రాజ్యవాదం గెలిచింది. అయితే ఇది తాత్కాలికమే' అని పేర్కొంది. 'వీళ్లు చెబుతున్నట్లు సిరియాలో సుస్థిరత, శాంతి నెలకొనబోవు. ఏళ్ల తరబడి మారణహోమాలు, దురాక్రమణలు, లూటీలు, దోపిడీలు, ఘర్షణలు జరుగుతున్న సిరియా పరిస్థితి మరింత క్షీణిస్తుంది. అక్కడ ఆటవిక శకం మొదలు కానుంది' అని ఆందోళన వ్యక్తంచేసింది. ఇజ్రాయెల్ గెలుపు... అమెరికా సామ్రాజ్యవాద గెలుపు అని వ్యాఖ్యానించింది. అమెరికా 'శాంతి' ఎప్పుడూ రక్తంతో తడిచివుంటుందని, కొత్త కలహాలు/ఘర్షణలకు తెరతీస్తుందని టీకేపీ విమర్శించింది. శాంతి, సుస్థిరత, పారదర్శకత అన్నవి సిరియాలో నెలకొనాలంటే సామ్రాజ్యవాదం... తిరుగుబాటుదాలు చిత్తు కావాలి అని వెల్లడించింది. 'ఇది ఆట కాదు... మన దేశం, మన భవిష్యత్ గురించి ఆందోళన ఉంటే ఈ ఆటవికత నుంచి ఏ విధంగా విముక్తి పొందాలనేది ఆలోచించాలి... ఎలాంటి చర్యలు తీసుకోవాలో నిర్ణయం చుకోవాలి...విదేశీ శక్తులపై ఆధారపడితే ఏం జరుగుతుందనే దానికి సిరియా పరిస్థితులే రుజువు' అని టర్కీ ప్రజలకు కమ్యూనిస్టు పార్టీ పిలుపునిచ్చింది. మనుగడ సాగించాలంటే టర్కీ మారాలని నొక్కి చెప్పింది. దోపిడీలు, అన్యాయాలు, అసమానతలు ఉంటే దేశంలో ఐక్యతకు తావు ఉండదని స్పష్టంచేసింది. సిరియా పరిణామాల దృష్ట్యా అప్రమత్తంగా ఉండాలని సూచించింది. మనపై, మన ప్రజలపై, మానవత్వంపై మనకు నమ్మకం ఉండాలని టీకేపీ హితవు పలికింది. ఇజ్రాయెల్ అనుకున్నది జరగబోదని పేర్కొంది.




## గమనిస్తున్న ప్రపంచ దేశాలు




**వాషింగ్టన్:** సిరియా పరిస్థితులను గమనిస్తున్నట్లు అమెరికా, బ్రిటన్, చైనా సహా అనేక దేశాలు వెల్లడించాయి. సిరియాలో సుస్థిరత నెలకొంటుందని ఆకాంక్షించాయి. తూర్పు సిరియాలో తమ దళాలు కొనసాగుతాయని, ఇస్లామిక్ స్టేట్‌ను నిరోధించడం అవసరమని అమెరికా అధ్యక్షుడు జో బైడెన్, పెంటగాన్ అధికారి డానియల్ షాపిరో కార్యాలయాలు ప్రకటించాయి. అంతర్జాతీయ నిబంధనలను గౌరవించాలని, పౌరులు ముఖ్యంగా మైనారిటీలకు రక్షణ కల్పించాలని అన్ని వర్గాలకు పిలుపునిచ్చాయి. సాధ్యమైనంత త్వరగా సిరియాలో సుస్థిరత నెలకొంటుందని చైనా ఆకాంక్షించింది. సిరియా పరిస్థితులు, తాజా పరిణామాలను బీజింగ్ నిశితంగా గమనిస్తున్నట్లు ఆ దేశ విదేశాంగ శాఖ ఒక ప్రకటన చేసింది. సిరియాను వీడాలనుకునే తమ పౌరులకు అవసరమైన సహాయ సహకారాలు అందిస్తున్నట్లు వెల్లడించింది. అక్కడే ఉన్న చైనీయులకు సహకరిస్తున్నట్లు పేర్కొంది. డమాస్కస్‌లోని తమ దౌత్య కార్యాలయంతో పాటు ప్రధాని కార్యాలయంతో ఎప్పటికప్పుడు సంప్రదిస్తూ క్షేత్రస్థాయి పరిస్థితులు తెలుసుకుంటున్నామని ఇటలీ విదేశాంగ మంత్రి ఆంటోనియో తజానీ 'ఎక్స్'లో వెల్లడించారు. ఇరాన్ తమ రాయబార కార్యాలయ సిబ్బందిని లెబనాన్‌కు తరలించింది. సిరియా ప్రజలకు నియంత పాలన, ఉగ్రవాదం ముప్పు పొంచి ఉన్నట్లు బ్రిటన్ ఉప ప్రధాని ఏంజిలా రేనర్ అన్నారు. సిరియా అస్థిరతకు దారితీసే పరిస్థితుల దృష్ట్యా రాజకీయ పరిష్కారం అవసరమని, ఆపద్ధర్మ ప్రభుత్వం సిరియా ప్రజల ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకొని పనిచేస్తోందన్నారు. ఇలాంటి ప్రజాస్వామ్యాన్నే ప్రపంచం చూడాలని అనుకుంటోందన్నారు. అసద్ వెళ్లిపోవడం స్వాగతించదగ్గ పరిణామమని బ్రిటన్ ఉప ప్రధాని అన్నారు. సిరియాలోని దళాలు సంయమనం పాటించాలని ఫిలిప్పీన్స్ పిలుపునిచ్చింది. యుద్ధాన్ని తీవ్రతరం చేసి ప్రజలను మరింత ప్రమాదంలోకి నెట్టవద్దని హితవు పలికింది. అవసరాన్ని బట్టి ఆహారం, తాగునీరు, ఇంధనం, దుప్పట్లు, టెంట్లు వంటివి సరఫరా చేస్తామని ఐరాస అధికారి టామ్ ఫ్లెచ్చర్ వెల్లడించారు.

## దక్షిణ కొరియా మాజీ రక్షణ మంత్రి అరెస్టు



**సియోల్:** దేశంలో హఠాత్తుగా మార్షల్ లా విధించడంలో కీలక పాత్ర పోషించాడన్న ఆరోపణలపై దక్షిణ కొరియా మాజీ రక్షణ శాఖ మంత్రి కిమ్ యోంగ్ హ్యూన్‌ను ప్రాసిక్యూటర్ల బృందం అరెస్టు చేసింది. దేశ అధ్యక్షుడు యూన్ సుక్ యోల్ దేశంలో అత్యవసర పరిస్థితిని ప్రకటించి, మార్షల్ లా విధించడంతో దేశ వ్యాప్తంగా తీవ్ర స్థాయిలో నిరసనలు వ్యక్తమైన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలోనే ప్రతిపక్ష పార్టీలు అతనిపై అభిశంసన తీర్మానాన్ని ప్రవేశపెట్టాయి. అయితే, మూడింట రెండువంతుల మెజారిటీ ఉంటేనే ఈ తీర్మానానికి ఆమోద ముద్ర పడుతుంది. కానీ, ముగ్గురు మినహా, అధికార పక్షానికి చెందిన మిగతా సభ్యులు ఓటింగ్‌కు గైర్హాజరుకావడంతో, అభిశంసన తీర్మానం వీగిపోయినట్టు స్పీకర్ ప్రకటించిన విషయం తెలిసిందే. ఈ పరిణామం చోటు చేసుకొని 24 గంటలు గడిచేలోపే మాజీ రక్షణ మంత్రి అరెస్టు కావడం సంచలనం సృష్టిస్తున్నది. కిమ్ యోంగ్ హ్యూన్‌ను పదవి నుచి తప్పించాలని ప్రతిపక్ష పార్టీలు డిమాండ్ చేశాయి. గత్యంతరం లేని పరిస్థితుల్లో అతనిని పదవి నుంచి తప్పిస్తున్నట్లు అధ్యక్షుడు యూన్ సుక్ యోల్ ప్రకటించారు. ఆ తర్వాత మార్షల్ లా విధింపుపై అతను దేశ ప్రజలకు క్షమాపణ చెప్పారు. ఇలాంటి పొరపాటు మరోసారి చేయనని హామీ ఇచ్చారు. కాగా, మార్షల్ లా విధింపుపై దాఖలైన కేసు కోర్టు విచారణలో ఉంది. ప్రాసిక్యూషన్ అధికారులు ఈ క్రమంలోనే కిమ్ యోంగ్ హ్యూన్‌ను అదుపులోకి తీసుకున్నారు. అయితే, ఈ విషయంపై అధ్యక్షుడు యూన్ సుక్ యోల్ ఇంకా ఎలాంటి అధికారిక ప్రకటన చేయలేదు.

## యూన్‌పై 14న మళ్లీ అభిశంసన!

### అధ్యక్షుడి రాజీనామాకు విపక్షం డిమాండ్

### అది త్వరలోనే జరుగుతుందన్న అధికార పార్టీ

### మిత్రపక్షాలతో సంబంధాలు చెడిపోనివ్వం: ప్రధాని హాన్

**సియోల్:** దక్షిణ కొరియాలో రాజకీయ సంక్షోభం ముదురుతోంది. అధ్యక్షుడు యూన్ సుక్ యోల్‌పై కత్తి వేలాడుతోంది. ఆయన ఏ సమయంలోనైనా పదవిలో నుంచి తప్పుకునే పరిస్థితి నెలకొంది. పార్లమెంటులో ప్రవేశపెట్టిన అభిశంసన తీర్మానం అధికార పక్ష సభ్యుల మద్దతు లేక వీగిపోవడంతో మరోమారు అభిశంసన తీర్మానాన్ని ప్రవేశపెట్టాలని ప్రధాన ప్రతిపక్షం యోచిస్తోంది. ఇందుకోసం ఈనెల 14వ తేదీని ఎంచుకున్నట్లు డెమొక్రటిక్ పార్టీ (డీపీ) వెల్లడించింది. అదే సమయంలో పదవి నుంచి తప్పుకోవాలని అధ్యక్షుడిని డిమాండ్ చేస్తోంది. ఇదిలావుంటే, యూన్ సుక్ యోల్ త్వరలోనే రాజీనామా చేయబోతున్నట్లు అధికార వర్గాలు తెలిపాయి. ఈలోగా ఆయనకు అధికార బాధ్యతల నుంచి తప్పిస్తున్నట్లు పేర్కొన్నాయి. అధికార పార్టీ పీపీ అధ్యక్షుడు హాన్ డోంగ్ హూన్ ఆదివారం విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ యోల్ రాజీనామా చేసేందుకు ముందే విదేశీ లేక దేశ వ్యవహారాల్లో ఆయనకు జోక్యం ఉండబోదన్నారు. మార్షల్ లా అమలు క్రమంలో యూన్ దేశానికి క్షమాపణలు చెప్పారు. పదవిని కాపాడుకునే ప్రయత్నంచేశారు. అయితే తనను కొనసాగించాలా లేదా అన్న నిర్ణయాన్ని అధికార పార్టీకి వదిలేసినట్లు తెలిపారు. మరోవైపు రక్షణ శాఖ మాజీ మంత్రి కిమ్ యోంగ్ హ్యూన్‌ను పోలీసులు అరెస్టు చేసి విచారిస్తున్నారు. అంతర్గత వ్యవహారాల శాఖ మంత్రి లీ సాంగ్ మిన్ కూడా రాజీనామా చేయగా ఆయననూ పోలీసులు విచారించారు. తాజా పరిణామాల దృష్ట్యా మిత్రదేశాలు (అమెరికా, జపాన్‌నుద్దేశించి)తో సంబంధాలు చెడిపోకుండా, వారిలో అపనమ్మకం కలగకుండా తమ కేబినెట్ చూసుకుంటుందని ప్రధాని హాన్ డక్ సూ చెప్పారు. మార్షల్ లాను మరోమారు విధించేలా ఉత్తర్వులు జారీ చేస్తేగనుక వాటిని తిరస్కరిస్తామని ప్రజలకు ఆపద్ధర్మ రక్షణ మంత్రితో సహా సైన్యాధికారులు అభయమిచ్చారు. దక్షిణ కొరియా పార్లమెంటు వద్ద 1,50,000 మంది ఆందోళనకు దిగారు. జెండాలు, రంగుల కర్రలు, ఎల్ఈడీ క్యాండిల్స్‌తో నిరసన తెలిపారు. స్పీకర్లు పెట్టి కెపాప్ పాటలతో హోరెత్తించారు.



## అసద్ పరార్!

(3వ పేజీ తరువాయి)

ప్రభుత్వంపై తిరుగుబావుటా ఎగురవేసి అధికారంలోకి వచ్చారు. 2000 సంవత్సరంలో మరణించే వరకూ ఆయన అధికారంలోనే ఉన్నారు. తండ్రి మరణం తర్వాత అసద్ శకం మొదలైంది. తండ్రిదారిలోనే అతను కూడా ఎన్నో ప్రజావ్యతిరేక చర్యలకు పాల్పడినట్టు విమర్శలు ఉన్నాయి. ప్రజల్లో వ్యక్తమవుతున్న తీవ్ర వ్యతిరేకత నేపథ్యంలోనే తిరుగుబాటుదారులు అసద్ ప్రభుత్వ వ్యతిరేక ఉద్యమాన్ని మొదలు పెట్టారు. రెండు రోజుల క్రితం ఈ బలగాలు వివిధ కీలక ప్రాంతాల్లోకి దూసుకొస్తున్నారన్న సమాచారం అందిన వెంటనే అసద్ ప్రభుత్వం అప్రమత్తమై, దక్షిణ సరిహద్దుల్లో ఉన్న సైనిక బలగాలను వెనక్కు పిలిపించింది. ఈ ప్రక్రియ ఇంకా పూర్తికాకముందే, రాజధాని డమాస్కస్‌ను కూడా తిరుగుబాటుదళాలు ఆక్రమించాయి. దీనితో అసద్ కనిపించకుండా అజ్ఞాతంలోకి వెళ్లిపోయారు. ఆయన దేశాన్ని విడిచిపెట్టాడన్న అంటున్నారు. ఇలావుంటే డమాస్కస్‌లో కాల్పులకు పాల్పడవద్దని హెచ్‌టిఎస్ నాయకుడు అబూ మహమ్మద్ అల్ గోలానీ పిలుపునిచ్చారు. ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కల్పించవద్దని ఆయన తన దళాలను ఆదేశించాడు. ప్రభుత్వ సంస్థలను తమకు అధికారికంగా అప్పగించేవరకు ప్రధానమంత్రి పర్యవేక్షణలోనే ఉంటాయని పేర్కొన్నారు.

## మహిళ దారుణ హత్య

(3వ పేజీ తరువాయి)

బీజాపూర్ సహా, ఏడు జిల్లాలతో కూడిన బస్తర్ డివిజన్‌లో ఈ ఏడాది ఇప్పటి వరకు యుద్ధ వాతావరణమే కొనసాగుతోంది. ఇదిలా ఉండగా ఇదే ప్రాంతంలో 60 మంది మావోయిస్టుల వరకు మృతి చెందినట్లు పోలీస్ వర్గాలు వెల్లడించాయి. డిసెంబర్ 6వ తేదీన బీజాపూర్‌లోని బాసగూడ ప్రాంతంలో మహిళా అంగన్‌వాడీ అసిస్టెంట్‌ను పోలీసులు ఇన్‌ఫార్మర్‌గా అనుమానిస్తూ హత్య చేయగా, డిసెంబర్ 4న బీజాపూర్ జిల్లాలో ఇద్దరు సర్పంచ్‌లను వేర్వేరు చోట్ల హత్యకు గురయ్యారు. ఇదిలాఉండగా డిసెంబర్ 1వ తేది తెల్లవారు ఝామున ములుగు జిల్లా వాజేడు మండలం పామోడు సమీపంలో ఇద్దరు గ్రామ కార్యదర్శులను మావోయిస్టులు ఇన్‌ఫార్మర్ల నెపంతో అతి కిరాతంగా హత్య చేశారు.

## మూర్ఖపు చర్య

(3వ పేజీ తరువాయి)

ఎంఎల్‌సిలతో ఆదివారం సంయుక్త సమావేశం జరిగింది. సమావేశాల్లో ప్రతిపక్ష పార్టీగా అనుసరించాల్సిన వ్యూహాలపై చర్చించినట్టు సమాచారం. ప్రజా సమస్యలపై అసెంబ్లీలో గళమెత్తి కొట్లాడాలని, ప్రభుత్వాన్ని నిలదీయాలని కెసిఆర్ మార్గనిర్దేశం చేశారు.ప్రజా సమస్యలపై బలంగా తమ వాణిని వినిపించాలని సూచించారు.ఈ సమావేశంలో బిఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటి.రామారావు, ఎంఎల్‌ఎలు తన్నీరు హరీశ్ రావు, సబితాఇంద్రారెడ్డి, పద్మారావు, జి.జగదీశ్ రెడ్డి, వేముల ప్రశాంత్ రెడ్డి, గంగుల కమలాకర్, ముఠాగోపాల్, కాలేరు వెంకటేశ్, పల్లా రాజేశ్వర్ రెడ్డి, తలసాని శ్రీనివాస్ యాదవ్, సుధీర్ రెడ్డి, వివేకానంద, మల్లారెడ్డి, ఎంఎల్‌సిలు మధుసూదనచారి, మహ్మద్ మహమూద్‌అలీ, కల్వకుంట్ల కవిత ,ఎల్.రమణ,మదు తదితరులు హాజరయ్యారు.ఈ సమావేశనంతరం కెటిఆర్ మీడియాకు వివరాలను వెల్లడించారు.

**ప్రజా సమస్యలపైన ప్రభుత్వాన్ని నిలదీస్తాం: కెటిఆర్**

ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలను అసెంబ్లీ, మండలిలో నిలదీస్తామని బిఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటి.రామారావు తెలిపారు.కాంగ్రెస్ 420 హామీలతో పాటు బిసి డిక్లరేషన్, ప్రజా సమస్యల పరిష్కారానికి అసెంబ్లీలో ప్రస్తావిస్తామన్నారు. ఆయన ఆదివారం మీడియాతో మాట్లాడుతూ పల్లెల దీన స్థితిపై అసెంబ్లీలో ప్రభుత్వాన్ని నిలదీస్తామన్నారు. రైతు రుణమాఫీని అరకొరగా పూర్తి చేసింది, బోనస్, మద్దతు ధర, రైతు కూలీలు ఇలా పలు అంశాలపైన ప్రభుత్వ వైఫల్యాలను ఎండగొడుతామని కెటిఆర్ తెలిపారు. రాష్ట్రంలోని గురుకులాలలో నెలకొన్న సంక్షోభాలను ప్రస్తావిస్తామన్నారు. ప్రతిరోజు ప్రజా సమస్యల విషయంలో ప్రభుత్వంపైన ఒత్తిడి తీసుకురావడానికి అసెంబ్లీ సమావేశాలను ఉపయోగించుకుంటామని కెటిఆర్ చెప్పారు.

## ఎయిర్ షో అదుర్స్

(3వ పేజీ తరువాయి)

వ్యక్తం చేశారు. ఒక వైపు ప్రభుత్వం ప్రజాపాలన ఉత్సవాలకు రావాలని ఆహ్వానిస్తు పోలీసులేమో ఓవరాక్షన్‌తో తీవ్ర ఇబ్బందులకు గురి చేశారని మండిపడ్డారు. నగర పోలీసు ఉన్నతాధికారుల పర్యవేక్షణలోపం ఎయిర్ షో బందోబస్తులో కొట్టోచ్చినట్టు కనిపించింది. కింది స్థాయి పోలీసుల అత్యుత్సహంతో ప్రజలు తీవ్ర ఆసౌకర్యానికి గురయ్యారు.

**ఆట పాటలతో హోరెత్తిపోయిన సాగరతీరం..**

ప్రజాపాలన విజయోత్సవ సంబరాలు అంబరాన్నంటాయి. హైదరాబాద్ ఎన్‌టిఆర్ మార్గ్‌లో ప్రజాపాలన విజయోత్సవ సభ నిర్వహించారు. ఐమాక్స్ హెచ్‌ఎండిఏ, నెక్లెస్ రోడ్‌లలో సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. తెలంగాణ ఆట పాటలతో సాగరతీరం హోరెత్తిపోయింది. విజయోత్సవాలను పురస్కరించుకొని సిఎం రేవంత్ రెడ్డి ట్యాంక్‌బండ్ పరిసరాల్లో ఏర్పాటు చేసిన స్టాళ్లను పరిశీలించారు. వివిధ వేదికల నుండి సిఎం రేవంత్ రెడ్డి ప్రజలకు అభివాదం చేశారు. ఈ సందర్భంగా స్థానిక ఐమాక్స్ గ్రౌండ్‌లో ఏర్పాటు చేసిన సంగీత కార్యక్రమం ప్రత్యేక ఆకర్షణగా నలిచింది. ప్రముఖ సింగర్ రాహుల్ సిప్లిగంజ్ ఆలపించిన పాటలు ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్, ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రులు పొన్నం ప్రభాకర్, కోమటి రెడ్డి వెంకట్ రెడ్డి, టిపిసిసి అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్, ఇతర ప్రముఖులు హాజరయ్యారు. విజయోత్సవాల సందర్భంగా ట్యాంక్‌బండ్ పరిసర ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన రంగు రంగుల విద్యుత్ దీపాలతో సరికొత్త శోభను సంతరించుకుంది. డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ సచివాలయం, ఎన్‌టిఆర్ గార్డెన్స్, ఫుట్‌ఓవర్ బ్రిడ్జి వద్ద మూడు వేదికలను ఏర్పాటు చేశారు. వేదికల వద్ద నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు సందర్శకులను ఆకట్టుకున్నాయి.



## హమీద్, నిషా సిద్దూ ఎన్నిక

(3వ పేజీ తరువాయి)

ఎన్నుకుంది. నూతన అధ్యక్షురాలిగా సీనియర్ సామాజిక కార్యకర్త, విద్యావేత్త డాక్టర్ సైదా హమీద్, ప్రధాన కార్యదర్శిగా మహిళా హక్కుల కార్యకర్త నిషా సిద్దూ ఎన్నికయ్యారు. ప్యాట్రన్‌గా అరుణా రాయ్, ఉపాధ్యక్షులుగా అరుణా సిన్హా, కొనినికా రాయ్, కమల్‌జిత్, రాజేంద్ర పాల్, సుశీలా సహాయ్, డాక్టర్ కె.రజనీ, కమలా సదానందన్, పి.పద్మావతి, పి.దుర్గాభవాని, జె.చించురాణి, కార్యదర్శులుగా నివేదిత, రుషిదా సిద్దీఖ్, సుప్రియా చటర్జీ, డాక్టర్ శాంతి, శ్యామశ్రీ దాస్ గుప్తా, బ్రిజ్ మౌళి, సహాయ కార్యదర్శులుగా మంజు కవాశి, అపరాజిత రాజా, దీప్తి భర్తీ ఎన్నికయ్యారు. జాతీయ కార్యవర్గానికి ఆంధ్రప్రదేశ్ నుంచి పి. దుర్గాభవానీతోపాటు అత్తిలి విమల ఎన్నికయ్యారు. జాతీయ సమితికి వీరిద్దరితోపాటు పద్మావతి, పి దుర్గాంబ, కె. స్వాతి, వి జయలక్ష్మి , ఎం యామిని, పి శ్రావణి ఎన్నికయ్యారు. నూతన నాయకత్వానికి మాజీ ప్రధాన కార్యదర్శి అనీరాజా శుభాకాంక్షలు తెలిపారు. కాగా, మహాసభకు హాజరైన ప్రముఖుల్లో అమర్‌జిత్ కౌర్, బృందా కారత్, స్వేతా రాజ్, బృందా గ్రోవర్, కవితా శ్రీవాత్సవ, అంజలి భరద్వాజ్, దీపా సిన్హా, అమృతా జొహ్రీతో పాటు అనేకమంది రాజకీయ, కార్మిక నేతలు, కార్యకర్తలు, మేధావులు ఉన్నారు.

## నేటి నుంచి అసెంబ్లీ

(3వ పేజీ తరువాయి)

సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ మాట్లాడుతూ సభ్యులు అడిగిన సమాచారాన్ని సాధ్యమైనంత త్వరగా అందించాలని, గత సమావేశాలకు సంబంధించిన ప్రశ్నలకు పెండింగులో ఉన్న జవాబులను వెంటనే పంపించాలని సూచించారు. సభకు సమర్పించే సమాధాన పత్రాలను ముందుగానే పంపినట్లయితే వాటిని సభ్యులు చదువుకుని సభలో మాట్లాడడానికి, చర్చించడానికి అవకాశం ఉంటుందన్నారు. శాఖకు సంబంధించిన చర్చ జరుగుతున్నప్పుడు సంబంధిత శాఖల అధికారులు అందుబాటులో ఉంటూ మంత్రులకు, సభ్యులకు తగిన సమాచారం అందిస్తూ సహకరించాలని, సమావేశాలు జరిగినన్ని రోజులు ప్రభుత్వ శాఖల ఉన్నతాధికారులు అందుబాటులో ఉండాలని, ప్రతి శాఖ తరుపున ఒక నోడల్ అధికారిని నియమించాలని స్పీకర్ ఆదేశించారు. సమావేశాలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా సజావుగా జరగడానికి పోలీసు శాఖ తరుపున చర్యలు తీసుకోవాలని, సభ లోపలితో పాటుగా, పరిసరాలలో కూడా శాంతియుత వాతావరణం ఉన్నప్పుడే చర్చలు బాగా జరుగుతాయన్నారు. అలాగే కౌన్సిల్ చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి మాట్లాడుతూ ప్రోటోకాల్ విషయంలో వివాదాలు తలెత్తకుండా తగు చర్యలు తీసుకోవాలని, శాసనమండలి పరిసరాలలో చట్టవ్యతిరేకమైన కార్యకలాపాలకు ఆస్కారం లేకుండా చూడాల్సిన బాధ్యత పోలీసు శాఖదన్నారు. శాసన సభ వ్యవహారాల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు మాట్లాడుతూ సభ సజావుగా జరగడానికి ప్రభుత్వం నుంచి పూర్తి సహకారం అందిస్తామని, ప్రోటోకాల్ ఉల్లంఘన సంఘటనలపై ప్రభుత్వ అధికారులతో మాట్లాడి తగిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి దుద్దిళ్ళ శ్రీధర్‌బాబు, శాసనమండలి చీఫ్ విప్ పట్నం మహేందర్‌రెడ్డి, లెజిస్లేటివ్ సెక్రటరీ డాక్టర్ వి.నరసింహాచార్యులు, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎ.శాంతికుమారి, స్పెషల్ చీఫ్ సెక్రటరీ (ఫైనాన్స్) రామకృష్ణారావు, ప్రిన్సిపల్ సెక్రటరీ దానకిశోర్, జిఎడి సెక్రటరీ రఘునందన్‌రావు, హోం శాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ రవి గుప్తా, రాష్ట్ర డిజిపి డాక్టర్ జితేందర్, ఎడిజిపి మహేష్ భగవత్, డిజి (ఫైర్) వై.నాగిరెడ్డి, హైదరాబాద్, రాచకొండ, సైబరాబాద్ కమిషనర్లు సివి అనంద్, సుధీర్‌బాబు, అవినాష్ మహంతి, ఇంటెలిజెన్స్ ఐజి కార్తికేయ, అసెంబ్లీ చీఫ్ మార్షల్ కర్ణాకర్, కౌన్సిల్ చీఫ్ మార్షల్ సంజీవరెడ్డి తదితరులు సమావేశానికి హజరయ్యారు.

**అసెంబ్లీ వద్ద ఆంక్షలు..మూడంచెల భద్రత**

అసెంబ్లీ సమావేశాల నేపథ్యంలో హైదరాబాద్ పోలీసులు కట్టుదిట్టమైన బందోబస్తు ఏర్పాటు చేశారు. దీంతో పాటు అసెంబ్లీకి రెండు కిలోమీటర్ల దూరం వరకు ఆంక్షలు విధించారు. ఈ పరిధిలో ఎలాంటి ర్యాలీలు, ధర్నాలు, రాస్తారోకోలు, సమావేశాలపై ఆంక్షలు విధించారు. అసెంబ్లీ వద్ద మూడంచెల భద్రతను ఏర్పాటు చేశారు. ఆంక్షలు ఉల్లంఘించిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హైదరాబాద్ పోలీసు కమిషనర్ సివి ఆనంద్ హెచ్చరించారు.ముందు జాగ్రత్త చర్యగా అదనపు పోలీసు బలగాలను వినియోగిస్తున్నారు.

## వెయ్యిమంది సర్వేయర్లు

(3వ పేజీ తరువాయి)

కాకపోవడం విచారకరమని,ఆయన తీరు దొంగే దొంగా, దొంగా అన్నట్టుగా ఉన్నదన్నారు. ప్రస్తుత శాసనసభ సమావేశంలోనే ఆర్‌ఒఆర్ ముసాయిదా బిల్లును ప్రవేశపెడుతున్నామని వెల్లడించారు. త్వరలోనే వెయ్యి మంది సర్వేయర్లను నియమిస్తామని, విఆర్‌ఎ, విఆర్‌ఒ వ్యవస్థను పునరుద్ధరిస్తామని ప్రకటించారు.హైదరాబాద్‌లోని సచివాలయంలో ఆదివారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో రెవెన్యూ, సమాచార పౌర సంబంధాల, గృహ నిర్మాణ శాఖలకు చెందిన నివేదికను పొంగులేటి విడుదల చేశారు. ప్రజాప్రభుత్వం రెవెన్యూ విభాగంలో గణనీయమైన ప్రగతిని సాధించిందన్నారు. ఒక వైపు ధరణి పోర్టల్ ప్రక్షాళనకు అవసరమైన చర్యలు చేపడుతూనే, ధరణికి సంబంధించి గత ప్రభుత్వంలో వచ్చిన దరఖాస్తుల పరిష్కారానికి చర్యలు తీసుకున్నామని వివరించారు. గత ప్రభుత్వం ధరణి పోర్టల్ నిర్వహణ బాధ్యతలను టెర్రాసిస్ అనే విదేశీ సంస్థకు అప్పగించారని, దీనిని తాము కేంద్ర ప్రభుత్వానికి చెందిన ఎన్ఐసికి అప్పగించామన్నారు. ధరణి పోర్టల్‌తో రాష్ట్ర ప్రజలు, వ్యవసాయదారులు ఎన్నో సమస్యలను ఎదుర్కొన్నారని, తరతరాలుగా తమ యజమాన్యంలో ఉన్న భూములపై సర్వ హక్కులు కోల్పోయారని, భూముల వివరాలను ధరణి పోర్టల్‌లో నమోదు చేసే సమయంలో జరిగిన లోపాలు, అక్రమాలు,అవకతవకలతో లక్షలాది మంది రైతులు తీవ్ర మనోవేదనకు గురయ్యారని ఆరోపించారు. రైతులు తమ భూములను అమ్ముకునేందుకు , ఆ భూములపై బ్యాంకుల నుంచి రుణాలు పొందడానికి రైతులు పడిన కష్టాలు వర్ణణాతీతమన్నారు. ధరణి సమస్యలను సమీక్షించి, వాటి పరిష్కారం నిమిత్తం భూ నిపుణులతో కమిటీ ఏర్పాటు చేశామన్నారు. ధరణి సమస్యలను పరిష్కరించేందుకు మండల స్థాయిలో తహశీల్దార్‌కు, డివిజన్ స్థాయిలో ఆర్‌డిఒలకు ,జిల్లా స్థాయిలో అదనపు కలెక్టర్లకు సమస్యలను పరిష్కరించే అధికారాన్ని అప్పగించామని మంత్రి పొంగులేటి పునరుద్ఘాటించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చే నాటికి 2.46 లక్షల దరఖాస్తులు పెండింగ్‌లో ఉండగా, స్పెషల్ డ్రైవ్ నిర్వహించి 1.38 లక్షల దరఖాస్తులను పరిష్కరించామని, కొత్తగా 3.16 లక్షల మంది దరఖాస్తులు చేసుకున్నారని, ఇప్పటి వరకు వచ్చిన మొత్తం 5.62 లక్షల దరఖాస్తులలో 4.68 లక్షల దరఖాస్తులను పరిష్కరించామని, దాదాపు 83 శాతం దరఖాస్తులను పరిష్కరించిందని అన్నారు. హరీష్ రావు,బోయినపల్లి వినోద్ కుమార్‌లు చేసిన సూచనలను కూడా బిఆర్‌ఎస్ పరిగణనలోకి తీసుకోలేదని ఆయన ఆరోపించారు. గత బిఆర్‌ఎస్ ప్రభుత్వం ధర్నా చౌక్‌లను ఎత్తేసిందని, కనీసం తమ పార్టీకి చెందిన ఎంఎల్‌ఎలు, మంత్రులను కూడా కెసిఆర్ కలువలేదన్నారు. రాజ్యాంగం ప్రకారం సంక్రమించిన స్వేచ్ఛను హరించి వేసిందని, ప్రశ్నించిన ప్రతివాన్ని బెదిరింపులకు పాల్పడిందని ఆరోపించారు.

**గ్రామ రెవెన్యూ సేవలు పునరుద్ధరణ**

గ్రామీణ ప్రాంతాలలో రెవెన్యూ వ్యవస్థను పటిష్టపర్చేందుకు గ్రామాలలో రెవెన్యూ సేవల పునరుద్ధరణకు చర్యలు చేపట్టామని, రాష్ట్రంలో 10,954 రెవెన్యూ గ్రామాలలో రెవెన్యూ వ్యవహారాలను పర్యవేక్షించేందుకు ఒక రెవెన్యూ ఉద్యోగిని నియమించడానికి కార్యాచరణను రూపొందించామని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి అన్నారు. ఇప్పటికే 26వేల విఆర్‌ఎ,విఆర్‌ఒలను గత ప్రభుత్వం ఇతర శాఖలకు పంపిన వారిలో నేరుగా నియమితులైన 2432 మంది తీసుకుంటామని,మిగత వారికి పరీక్షద్వారా రెవెన్యూ శాఖలో తీసుకుంటామని వివరించారు. 11 నుంచి 13 మాడ్యూల్స్‌లో మార్పులు తీసుకొస్తామని తెలిపారు. తరతరాల భూ సమస్యలకు ముగింపు పలికేలా భవిష్యత్ తరాలకు ఉపయోగపడేలా, దేశానికే ఆదర్శంగా ఉండేలా ఒక రోల్ మోడల్ '2024 ఆర్‌ఒఆర్' చట్టాన్ని తీసుకురాబోతున్నామన్నారు.

**నాలుగు సంవత్సరాల్లో 20లక్షల ఇందిరమ్మ ఇండ్లు:**

దశల వారీగా వచ్చే నాలుగు సంవత్సరాలలో సుమారు 20 లక్షల ఇందిరమ్మ ఇండ్లను నిర్మించాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకున్నదని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి అన్నారు. గత ప్రభుత్వంలో అమలు చేసిన ఇంటి నిర్మాణ కాంట్రాక్ట్ వ్యవస్థను రద్దు చేసి, లబ్ధిదారులే ఇళ్లు నిర్మించుకునేలా అవకాశం కల్పిస్తున్నా మన్నారు. పేదలకు ఇండ్లు నిర్మించే హౌసింగ్ శాఖను గత ప్రభుత్వం పూర్తిగా నిర్వీర్యం చేసిందని,ప్రజాప్రభుత్వం ఈ శాఖను పునరుద్ధరించి, లబ్దిదారుల ఎంపిక నుంచి ఇండ్ల నిర్మాణం, పర్య వేక్షణ వరకు అవసరమైన యంత్రాంగాన్ని సమకూర్చుకున్నదని వివరించారు. ఇందిరమ్మ లబ్దిదారుల ఎంపిక కోసం ప్రత్యేక మొబైల్‌యాప్‌ను రూపొందించామని, ఇప్పటికే నాలుగు గ్రామాలు, నాలుగు మునిసిపాలిటీలలోని నాలుగు వార్డుల్లో ప్రయోగాత్మకంగా ఈ సర్వే పూర్తి చేశామని మంత్రి పొంగులేటి అన్నారు. జర్నలిస్టుల ఇంటి స్థలాల సమస్య పరిష్కారానికి త్వరలోనే జర్నలిస్టు ముఖ్యులతో చర్చించిన తర్వాత, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దృష్టికి సమస్యను తీసుకెళ్తానని పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి హామీనిచ్చారు.

# ముడుపులు ఇస్తేనే పనులు పూర్తి

## గత 12 నెలల్లో లంచాలు చెల్లించినట్లు 66 శాతం వ్యాపార సంస్థలు అంగీకారం
## 'ఆన్‌లైన్ ప్లాట్‌ఫారమ్ లోకల్‌క్రికల్స్ ' నివేదిక వెల్లడి



**న్యూఢిల్లీ :** దేశంలో ఏ సంస్థలో చూసినా లంచం ఇవ్వనిదే పనులు కావడంలేదు. అది ప్రభుత్వ సంస్థ అయినా, ప్రైవేటు సంస్థ అయినా తమ పనులు కావాలంటే ముడుపులు ఇచ్చుకోవాల్సిందే. తాజాగా ఆన్‌లైన్ ప్లాట్‌ఫారమ్ లోకల్‌క్రికల్స్ 159 జిల్లాల్లో నిర్వహించిన సర్వేలో దాదాపు 66 శాతం వ్యాపార సంస్థలు గత 12 నెలల్లో లంచాలు చెల్లించినట్లు అంగీకరించాయని తన నివేదికలో వెల్లడించింది. 18,000 మంది పాల్గొన్న ఈ సర్వేలో 54 శాతం మంది లంచాలు ఇవ్వాల్సి వచ్చిందని, 46 శాతం మంది ప్రక్రియను వేగవంతం చేసేందుకు స్వచ్ఛందంగా తామే ముడుపులు చెల్లించుకున్నామని తేలింది. 'చాలా వ్యాపారాలు అనామకంగా హామీ ఇస్తున్నందున, ప్రభుత్వ శాఖలు అనుమతి లేదా సమ్మతి ప్రక్రియను వేగవంతం చేయడానికి, అథారిటీ లైసెన్స్ యొక్క నకిలీ కాపీని పొందడం లేదా ఆస్తి విషయాలలో ఏదైనా చేయాలనుకున్నప్పుడు లంచాలు పరిపాటిగా మారాయి. గత 12 నెలల్లో లంచం ఇచ్చుకున్నట్లు సర్వేలో పాల్గొన్న 66 శాతం వ్యాపారాల సంస్థలు అంగీకరించినట్లు నివేదిక పేర్కొంది. సర్వేలో పాల్గొన్న వ్యాపారుల్లో కేవలం 16 శాతం మంది మాత్రమే లంచం చెల్లించకుండా పనిని పూర్తి చేయగలుగుతున్నామని, 19 శాతం మంది తమకు అలా చేయవలసిన అవసరం లేదని చెప్పారు. 'గత 12 నెలల్లో లంచాలు చెల్లించిన వ్యాపార సంస్థల్లో 54 శాతం సంస్థలు లంచాలు ఇచ్చుకోవాల్సి వచ్చిందని చెప్పగా, మరో 46 శాతం సంస్థలు మాత్రం సకాలంలో ప్రాసెసింగ్ కోసం ముడుపులు చెల్లించుకున్నట్లు ఒప్పుకున్నాయి. ఈ రకమైన లంచం అనుమతులు, సరఫరాదారు అర్హతలు, ఫైల్‌లు, ఆర్డర్‌లు, చెల్లింపులు దోపిడీకి సమానం. అని నివేదిక పేర్కొంది. అనేక చోట్ల కంప్యూటరీకరణ ఉన్నప్పటికీ, సిసిటివిల్లో నిక్షిప్తం కాకుండా తలుపులు మూసివేసి వ్యాపారులు ముడుపులు చెల్లించుకోవడం విశేషం. సరఫరాదారుగా అర్హత సాధించడం, కొటేషన్లు, ఆర్డర్‌లను సురక్షితం చేయడం, చెల్లింపులను సేకరించడం కోసం వివిధ రకాల సంస్థలకు గత 12 నెలల్లో లంచం చెల్లించినట్లు వ్యాపార సంస్థలు అంగీకరించాయి. 'ప్రభుత్వ ఇప్రొక్యూర్‌మెంట్ మార్కెట్‌ప్లేస్ వంటి కార్యక్రమాలు అవినీతిని తగ్గించడానికి మంచి చర్యలు అయినప్పటికీ, సరఫరాదారు అర్హత, బిడ్ అవకతవకలు, సర్టిఫికేట్, చెల్లింపుల పూర్తి కోసం అవినీతికి పాల్పడే అవకాశాలు ఇంకా ఉన్నాయి' అని నివేదిక పేర్కొంది. మే 22 నుంచి నవంబర్ 30, 2024 మధ్య నిర్వహించిన సర్వేలో పాల్గొన్న వ్యాపార సంస్థలు, లీగల్, మెట్రాలజీ, ఫుడ్ డ్రగ్స్, హెల్త్ తదితర శాఖల అధికారులకు 75 శాతం లంచాలు చెల్లించినట్లు తెలిపారు. చాలా మంది జిఎస్‌టి అధికారులు, కాలుష్య విభాగం, మున్సిపల్ కార్పొరేషన్, విద్యుత్ శాఖలకు కూడా లంచాలు ఇచ్చినట్లు నివేదికలో వెల్లడయింది. సర్వేలో వ్యాపార సంస్థలు గత 12 నెలల్లో లంచం లావాదేవీల సంఖ్య, వ్యాపారులు చెల్లించిన లంచాల మొత్తం విలువ తగ్గాయని చెప్పారు. అవినీతి నిరోధక సమస్యపై డెలాయిట్ ఇండియా, భాగస్వామి, ఆకాష్ శర్మ మాట్లాడుతూ, పాలసీలు, విధానాల పరంగా కనీస స్థాయిని నిర్వహించడం వల్ల నియంత్రణాపరమైన పరిశీలన, శిక్షార్హమైన చర్యలు ఉండవని చాలా సంస్థలు విశ్వసిస్తున్నాయని అన్నారు. 'గతంలో ఈ విధానం సరిపోయి ఉండవచ్చు, అవినీతి కేసుల్లో ఇటీవల పెరుగుతున్న పోకడలు, మారుతున్న నియంత్రణ ల్యాండ్‌స్కేప్‌తో కలిపి సంస్థలు తమ సమ్మతి ఫ్రేమ్‌వర్క్‌ను తిరిగి పరిశీలించి, బలమైన అవినీతి నిరోధక కార్యక్రమాన్ని ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉంది' అని శర్మ చెప్పారు.

## 'నేడు' భారత విదేశాంగ కార్యదర్శి
# విక్రమ్‌మిస్రీ 'ఢాకా' పర్యటన

### బంగ్లాదేశ్ విదేశాంగ కార్యదర్శి మహమ్మద్ జాషిమ్‌ఉద్దిన్‌తో విస్తృత చర్చలు
### హిందువులు, ఇతరమైనారిటీలు, ఆలయాలపై దాడులు, చిన్మయ్‌కృష్ణదాస్ అరెస్ట్ నేపథ్యంలో
### ఢాకా పర్యటనకు ప్రాధాన్యత



**న్యూఢిల్లీ :** భారత విదేశాంగ కార్యదర్శి విక్రమ్ మిస్రీ సోమవారం నాడు బంగ్లాదేశ్‌లో ఒకరోజు పర్యటన ప్రారంభం నేపథ్యంలో హిందువులు, ఇతర మైనార్టీలపై ఢాకా ఇండియా ఆందోళనలను లేవనెత్తారు. భారీ తిరుగుబాటు అనంతరం ఆగస్టులో పదవీచ్యుతులైన ప్రధాన మంత్రి షేక్ హసీనా పదవీకాలం ముగిసిన తర్వాత మొట్టమొదటి అత్యున్నత స్థాయి పర్యటన ఇది. మిస్రీ బంగ్లాదేశ్ విదేశాంగ కార్యదర్శి మహమ్మద్ జాషిమ్ ఉద్దీన్‌తో విస్తృత చర్చలు జరుపనున్నారు.మిస్రీ ఈ సందర్భంగా బంగ్లాదేశ్ వాస్తవ విదేశాంగ మంత్రి మోహమ్మద్ తౌహిత్‌హుస్సేన్‌నునూ కలువనున్నారు. దాదాపు 12గంటల పాటు ఢాకా పర్యటనలో ఉండనున్న మిస్రీ బంగ్లాదేశ్ తాత్కాలిక నేత, నోబెల్ శాంతి బహుమతి గ్రహీత మహ్మద్ యూనస్‌ను కలిసే అవకాశం కూడా ఉన్నదని సమాచారం. హసీనాకు భారత్ ఆశ్రయం ఇవ్వడంపై బంగ్లాదేశ్ తన ఆందోళనను వ్యక్తం చేసే అవకాశంఉంది. గత నెలలో యూనస్ తన ప్రభుత్వం హసీనాను భారతదేశం నుండి అప్పగించాలని కోరుతుందని చెప్పినట్లు మిస్రీ పర్యటన గురించి తెలిసిన వ్యక్తులు చెప్పారు. ఆగస్టులో జరిగిన భారీ ప్రభుత్వ వ్యతిరేక నిరసన నేపథ్యంలో హసీనా దేశం విడిచి వెళ్లవలిసి రావడంతో భారత్, బంగ్లాదేశ్ మధ్య సన్నిహిత సంబంధాలు తీవ్ర ఒత్తిడికి గురయ్యారు. షేక్ హసీనా భారత్‌లో ఆశ్రయం పొందిన కొద్దిరోజులకే యూనస్ బంగ్లాదేశ్‌లో అధికారపగ్గాలు చేపట్టారు. హిందువులపై దాడులు, హిందూ సన్యాసి చిన్మయ్ కృష్ణ దాస్ అరెస్ట్ కారణంగా ఇటీవలి వారాలలో భారత్‌బంగ్లాదేశ్ మధ్య సంబంధాలు మరింత క్షీణించాయి. భారత్‌కు వ్యతిరేకంగా హింసాత్మక సంఘటనలు అనేకం చోటుచేసుకున్నాయి. గత కొన్ని వారాలుగా హిందువులు, ఇతర మైనారిటీలు అలాగే పొరుగుదేశమైన బంగ్లాదేశ్‌లోని ఆలయాలపై కొనసాగుతున్న దాడులు న్యూఢిల్లీలో తీవ్రస్థాయిలో ఆందోళనలను రేకెత్తించాయి.'ఈ విషయంపై మా వైఖరి చాలా స్పష్టంగా ఉంది.మైనారిటీలను అందరినీ రక్షించే బాధ్యత తాత్కాలిక ప్రభుత్వం నిర్వర్తించాలి' అని విదేశీ వ్యవహారాల మంత్రిత్వ శాఖ అధికార ప్రతినిధి రణ్‌ధీర్ జైస్వాల్ నవంబరు 29న చెప్పారు.'ఉగ్రవాద వాక్చాతుర్యం, పెరుగుతున్న హింస, రెచ్చగొట్టే సంఘటనలపై మేం ఆందోళన చెందుతున్నాం. ఈ పరిణామాలను మీడియా అతిశయోక్తిగా మాత్రమే కొట్టిపారేయలేదు. మైనారిటీల రక్షణ కోసం అన్ని రకాలుగా గట్టి చర్యలను తీసుకోవాలని మేం బంగ్లాదేశ్‌ను మరోసారి కోరుతున్నాం' అని జైస్వాల్ చెప్పారు. పశ్చిమ బెంగాల్, అసోం, మేఘాలయ, త్రిపురలలో గత కొన్ని రోజులుగా బంగ్లాదేశ్‌లో హిందువులను హింసించడం, దాస్ అరెస్ట్‌పై నిరసనలు చోటుచేసుకుంటున్నాయి. దేశ ద్రోహం కేసుకు సంబంధించి గత నెలలో ఢాకాలోని హజ్రత్ షాజలాల్ అంతర్జాతీయ విమానాశ్రయంలో హిందూ సన్యాసి చిన్మయ్ కృష్ణ దాస్‌ను అరెస్ట్ చేశారు. విదేశీ కార్యాలయం సంప్రదింపుల చట్రంలోజరుగనున్న సమావేశంలో పాల్గొనేందుకు భారత విదేశాంగ కార్యదర్శి విక్రమ్ మిస్రీ ఢాకాకు వెళుతున్నట్లు భారత్ శుక్రవారం నాడు ప్రకటించిన విషయం తెలిసిందే.

# ఎమ్మెల్యేలుగా ఎంవిఎ సభ్యులు ప్రమాణం



**ముంబయి :** మహారాష్ట్రలో శనివారం నుంచి అసెంబ్లీ ప్రత్యేక సమావేశాలు ప్రారంభమయ్యాయి. రెండవ రోజు అయిన ఆదివారం మహావికాస్ అఘాడీ నాయకులు సహా దాదాపు 105 మంది కొత్తగా ఎన్నికైన సభ్యులు ఎమ్మెల్యేలుగా ప్రమాణం చేశారు. మూడు రోజుల పాటు జరిగే ప్రత్యేక అసెంబ్లీ సమావేశాల్లో భాగంగా తొలి రోజు ప్రమాణ స్వీకార కార్యక్రమాన్ని ప్రతిపక్ష సభ్యులు బైకాట్ చేశారు. రాష్ట్రంలో ఇటీవల జరిగిన ఎన్నికల్లో ఇవిఎంలు దుర్వినియోగానికి గురైనవి అని ఆరోపిస్తూ సమావేశాలను వారు బైకాట్ చేశారు. కాంగ్రెస్ నేతలు నానా పటోల్, విజయ్ వటెట్టివార్, అమిద్ దేశ్‌ముఖ్, ఎన్‌సిపి (ఎస్‌పి) నేత జితేంద్ర ఆవాద్, శివసేన (యుబిటి) నేత ఆదిత్య ఠాక్రే సహా పలువురు ప్రముఖ నాయకులు ఆదివారం ఎమ్మెల్యేలుగా ప్రమాణం చేశారు. శనివారం దాదాపు 173 సభ్యులు శాసనసభ్యులుగా ప్రమాణం చేశారు. కాగా, కార్యక్రమానికి గైర్హాజరైన 9 మంది శాసనసభ్యులు సోమవారం ప్రమాణం చేయనున్నారు. తొలిసారి శాసనభ్యులుగా ఎన్నికైన అనేకమంది ఆదివారమే ప్రమాణం చేయగా, వారి కుటుంబ సభ్యుల రాకతో అసెంబ్లీ రద్దీగా మారింది.

**స్పీకర్‌గా రాహుల్ నార్వేకర్ ఏకగ్రీవం**

మహారాష్ట్ర అసెంబ్లీ కొత్త స్పీకర్‌గా బిజెపి ఎమ్మెల్యే రాహుల్ నార్వేకర్ ఎలాంటి పోటీ లేకుండా ఎన్నికయ్యారు. స్పీకర్ పదవికి పోటీ చేయరాదని విపక్ష 'మహా వికాస్ అఘాడి' నిర్ణయించడం, నామినేషన్ వేయకపోవడంతో స్పీకర్‌గా రాహుల్ నార్వేకర్ ఎన్నిక ఏకగ్రీవమైంది. షెడ్యూల్ ప్రకారం ఈనెల 9న స్పీకర్ ఎన్నిక జరగాల్సి ఉండగా, బిజెపి నుంచి రాహుల్ నార్వేకర్ ఆదివారంనాడు నామినేషన్ వేశారు. ఇతరులెవరూ నామినేషన్ వేయకపోవడంతో ఆయన ఎన్నిక ఏకగ్రీవమైంది. అయితే, అధికారికంగా సోమవారంనాడు ఆయన ఎన్నికను ప్రకటిస్తారు.

**డిప్యూటీ స్పీకర్ పదవిని ఆశిస్తున్న ఎంవిఎ**

కాగా, స్పీకర్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నేందుకు తాము సహకరిస్తామని, ప్రోటోకాల్ ప్రకారం విపక్ష కూటమి పార్టీల్లో ఒకరికి డిప్యూటీ స్పీకర్ పదవి కేటాయించాలని సీఎం దేవేంద్ర ఫడ్నవిస్‌ను 'మహా వికాస్ అఘాడీ' కోరింది. ఈ మేరకు ఎంవిఎ ప్రతిధుల బృందం ఫడ్నవిస్‌ను ఆదివారం కలిసింది.

## ప్రమాణ స్వీకార కార్యక్రమంలో
# దొంగల చేతివాటం

**ముంబయి :** దక్షిణ ముంబయిలోని ఆజాద్ మైదానంలో ఈనెల 5వ తేదీన జరిగిన మహాయుతి ప్రభుత్వ ప్రమాణస్వీకార కార్యక్రమంలో దొంగలు తమ చేతివాటం చూపారు. రూ. 12 లక్షల విలువగల బంగారు చైన్‌లు, మొబైల్ ఫోన్లు, నగదు దోచుకుపోయినట్లు ఓ పోలీసు అధికారి చెప్పారు. గుర్తితెలియని వారిపై ఎఫ్‌ఐఆర్ నమోదు చేశామని, నిందితులను పట్టుకునేందుకు ప్రయత్నిస్తున్నామని ఆజాద్ మైదాన్ పోలీస్ స్టేషన్ అధికారులు వెల్లడించారు. కాగా, 5వ తేదీన బిజెపి అగ్రనేత దేవేంద్ర ఫడ్నవీస్ సిఎంగా, శివసేన నేత ఏక్‌నాథ్‌షిండే, ఎన్‌సిపి నేత అజిత్ పవార్‌లు డిప్యూటి సిఎంలుగా ప్రమాణంస్వీకారం చేసిన విషయం తెలిసిందే. ఈ కార్యక్రమానికి ప్రధాని మోదీ సహా సినీ, రాజకీయ ప్రముఖులు హాజరయ్యారు. కార్యక్రమానికి భద్రత కల్పించేందుకు దాదాపు 4 వేలమంది పోలీసులను మోహరింపజేశారు. 2వ గేట్ వద్ద కార్యక్రమానికి హాజరైన వారంతా ఎంతో ఆసక్తిగా ప్రమాణస్వీకార కార్యక్రమాన్ని తిలకిస్తుండగా, దొంగలు ఇదే అవకాశంగా భావించి బంగారు చైన్‌లు, మొబైల్ ఫోన్లు, పర్సులు తస్కరించినట్లు అధికారులు పేర్కొన్నారు. పోలీస్ స్టేషన్ సిబ్బంది, క్రైమ్ బ్రాంచ్ సిబ్బంది నిందితులను పట్టుకునేందుకు ప్రయత్నిస్తున్నారన్నారు. ఈ నేపథ్యంలో సిసిటివి ఫుటేజీలను పరిశీలిస్తున్నారని, ఇప్పటి వరకు ఎవరిని కూడా అరెస్టు చేయలేదన్నారు.

# ఇవిఎంలపై అనుమానాలు: పవార్



**ముంబయి్ :** మహారాష్ట్రలో మహాయుతి ప్రభుత్వం కొలువుదీరిన విషయం తెలిసిందే. ప్రతిపక్ష మహావికాస్ అఘాడీ(ఎంవిఎ) సభ్యులు ఇవిఎంలపై అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. ఈ నేపథ్యంలో రాష్ట్రంలో జరిగిన ఎన్నికల ప్రక్రియపై ప్రజల్లో అనుమానాలు ఉన్నాయని నేషనలిస్ట్ కాంగ్రెస్ పార్టీ (ఎస్‌పి) అధినేత శరద్ పవార్ వ్యాఖ్యానించారు. షోలాపూర్ జిల్లాలోని మర్కద్వాడి గ్రామంలో యాంటిఈవీఎం కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. 'ఇటీవల మహారాష్ట్రలో జరిగిన ఎన్నికల ప్రక్రియపై ప్రజల్లో అనుమానాలున్నాయి. ఇవిఎంలపై ప్రజల్లో విశ్వాసం లేదు. అయినా.. ఓటు వేశారు. అమెరికా, ఇంగ్లాండతో సహా ప్రపంచమంతా బ్యాలెట్ విధానంలో ఎన్నికలు నిర్వహిస్తోంది. భారత్‌లో మాత్రమే ఇవిఎంలు ఎందుకు? ఇక్కడి ప్రజలు బ్యాలెట్‌లతోనే ఎన్నికలు నిర్వహించాలని కోరుకుంటున్నారు' అని పేర్కొనారు. ఎన్నికల ప్రక్రియపై స్థానిక ప్రజల్లో ఎలాంటి ఫిర్యాదులున్నా తనకు అందజేయాలని వాటిని ఎన్నికల కమిషన్‌కు, రాష్ట్ర ముఖ్యమంత్రికి పంపిస్తానని శరద్ పవార్ తెలిపారు. మరోవైపు.. ఎన్నికల్లో ఇవిఎంలను దుర్వినియోగం చేశారని ఆరోపిస్తూ.. ఎంవిఎ ఎమ్మెల్యేలు శనివారం ప్రమాణ స్వీకారం చేసేందుకు నిరాకరించిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో ఆదివారం వారు ప్రమాణస్వీకారం చేశారు.

## కన్నం రాజేంద్రన్ ఆదర్శ నేత
### వర్ధంతి సభలో వినయ్ విశ్వం

**కొట్టాయం:** భారత కమ్యూనిస్టు పార్టీ నాయకుడు కన్నం రాజేంద్రన్ ఆదర్శ నేత అని సిపిఐ కార్యదర్శి, కేరళ రాష్ట్ర కార్యదర్శి వినయ్ విశ్వం కొనియాడారు. రాజేంద్రన్ ప్రథమ వర్ధంతి సందర్భంగా ఆయన స్వగ్రామం కొట్టాయంలో నిర్వహించిన స్మారక సభలో వినయ్ విశ్వం ప్రసంగించారు. సిపిఐ బలోపేతానికి, కేరళలో వామపక్షం బలోపేతానికి కన్నం రాజేంద్రన్ ఎంతో శ్రమించారని ఆయన శ్లాఘించారు. 1982 నుంచి 1991 వరకు కేరళ శాసనసభ సభ్యునిగా, వజ్హూర్ నియోజకవర్గానికి రాజేంద్రన్ ప్రాతినిధ్యం వహించారని తెలిపారు. సిపిఐ కేరళ రాష్ట్ర కార్యదర్శిగా గణనీయమైన సేవలు అందించి ఆదర్శంగా నిలిచారన్నారు. రాజేంద్రన్‌తో తనకున్న అనుబంధాన్ని వినయ్ విశ్వం గుర్తు చేసుకున్నారు. కాగా, రాజేంద్రన్ 2023, డిసెంబరు 8న అమరులయ్యారు. రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఆర్ రాజేంద్రన్ అధ్యక్షతన జరిగిన ఈ సభకు సిపిఐ జాతీయ కార్యవర్గ సభ్యులు కె.ప్రకాశ్ బాబు, కె.సంతోశ్ కుమార్ (ఎంపి), కెపి రాజేంద్రన్, కేరళ మంత్రులు కె.రాజన్, జీఆర్ అనిల్, పి.ప్రసాద్, విఎన్ వాసవన్, పీపీ సునీర్ (ఎంపి), ఇస్మాయిల్ హాజరయ్యారు.

## భారతదేశ సరిహద్దుల భద్రత కోసం త్వరలోనే
# 'సమగ్ర యాంటీ డ్రోన్ విభాగం'
### బిఎస్ఎఫ్ దళాల '60వ రైజింగ్ డే' కార్యక్రమంలో కేంద్ర హోంమంత్రి అమిత్‌షా వెల్లడి





**జోధ్‌పూర్ :** రానున్న రోజులలో మానవరహిత వైమానిక వాహనాల ముప్పు తీవ్రతరం కానున్నందున భారతదేశం తన సరిహద్దులను సురక్షితంగా ఉంచడానికి త్వరలో సమగ్ర యాంటీ డ్రోన్ విభాగాన్ని రూపొందించనున్నదని కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్‌షా ఆదివారంనాడు ఇక్కడ తెలిపారు. భారతదేశంపాకిస్తాన్ సరిహద్దు నుంచి 300కి.మీ దూరంలో ఉన్న శిక్షణాశిబిరంలో బిఎస్ఎఫ్ దళాల '60వ రైజింగ్ డే' కార్యక్రమంలో పాల్గొన్న హోం మంత్రి అమిత్‌షా 'లేజర్ అమర్చిన యాంటీడ్రోన్ గన్‌మౌంటెడ్' మెకానిజయం ప్రారంభ ఫలితాలు ప్రోత్సాహకరంగా ఉన్నాయన్నారు. ఇది పంజాబ్‌లోని భారత్‌పాకిస్తాన్ సరిహద్దులో డ్రోన్ న్యూట్రలైజేషన్, డిటెక్షన్ కేసులు 3శాతం నుంచి 55శాతానికి పెరిగాయని అమిత్‌షా తెలియజేశారు.'రాబోయే రోజుల్లో డ్రోన్ ముప్పు మరింత తీవ్రం కానుంది. రక్షణ, పరిశోధనా సంస్థలు, డిఆర్‌డిఓ చేతులు కలపడంతో మేము ఈ సమస్యను పూర్తి ప్రభుత్వ విధానంతో పరిష్కరిస్తున్నాం. రాబోయే కాలంలో దేశం కోసం సమగ్ర యాంటీ డోన్ యూనిట్‌ను రూపొందించబోతున్నాం' అని చెప్పారు. అధికారిక సమాచారం ప్రకారం 2023లో సుమారు 110 డ్రోన్‌లు ఉండగా ఈ ఏడాది 260కంటే ఎక్కువ డ్రోన్‌లు పాకిస్థాన్ దేశంతో భారతదేశ సరిహద్దు నుండి కూల్చివేయబడటం, తిరిగి పొందబడటం జరిగాయన్నారు.ఆయుధాలు, మాదకద్రవ్యాలు మోసుకెళ్లే డ్రోన్‌ల యొక్క అటువంటి నిషేధాలు గరిష్టసంఖ్యలో పంజాబ్‌లో జరుగగా, రాజస్థాన్, జమ్ములలో తక్కువగా జరిగాయని అమిత్‌షా వివరించారు. ఈసందర్భంగా కేంద్ర హోం మంత్రి అమిత్‌షా ఉత్సవ పరేడ్‌ను సమీక్షించారు. గౌరవ వందనాన్ని స్వీకరించారు. గాలంట్రీ విజేతలకు పతకాలు, కొన్ని అలంకరణలను ప్రదానం చేశారు. దాదాపు 2.65లక్షల మంది సిబ్బందితో కూడిన బోర్డర్ సెక్యూరిటీ ఫోర్స్ (బిఎస్ఎఫ్) 1965 సంవత్సరం డిసెంబరు 1న ఏర్పాటైంది.బిఎస్ఎఫ్ ప్రాథమికంగా వివిధ రకాల విధులను నిర్వర్తించడమే కాకుండా పాకిస్తాన్, బంగ్లాదేశ్‌లతో కూడిన 6.300కి.మీ కంటే ఎక్కువగా ఉన్న భారత సరిహద్దులను రక్షించడం, అంతర్గత భద్రతలో దేశం డొమైన్‌గా వ్యవహరిస్తోంది. ఈ సందర్భంగా అమిత్‌షా మాట్లాడుతూ పాకిస్తాన్ (2,289కి.మీ), బంగ్లాదేశ్ (4,096కి.మీ)లతో భారతదేశ సరిహద్దుల భద్రత కోసం కొనసాగుతున్న సమగ్ర సమీకృత సరిహద్దు నిర్వహణ వ్యవస్థ (సిఐబిఎంఎస్) పురోగతిలో ఉందని చెప్పారు. రూ.48,000 కోట్లతో సరిహద్దు భద్రతను పెంపొందించడంలో, మారుమూల ప్రాంతాలలో నివసిస్తున్న ప్రజలకోసం పనిచేయడంలో నరేంద్రమోదీ ప్రభుత్వం సాధించిన అతిపెద్ద విజయం ఇదేనన్నారు. దాదాపు 3,000గ్రామాలలో ప్రయోగాత్మకంగా దీనిని నిర్వహిస్తున్నట్లు తెలియజేశారు. భారత సరిహద్దుల పటిష్టత, ఫెన్సింగ్, సరిహద్దు మౌలిక సదుపాయా లు, ఇతర లాజిస్టిక్స్ కోసం కేంద్ర ప్రభుత్వం 'పెద్ద' బడ్జెట్‌ను మంజూరు చేసిందని అమిత్‌షా చెప్పారు. మోదీ ప్రభుత్వం 1,812కి.మీ రోడ్లనే కాకుండా 573 కొత్త సరిహద్దు పోస్టులను కూడా సృష్టించిందని అమిత్‌షా తెలిపారు. బిఎస్ఎఫ్ డైరెక్టర్ జనరల్ (డిజి) దల్జిత్ సింగ్ చౌదరి ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

# 'హిండన్ నది కాలుష్యం'పై వివరణ ఇవ్వండి
### ఉత్తర్‌ప్రదేశ్ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సహా
### పలువురికి ఎన్‌జిటి నోటీసులు జారీ




**న్యూఢిల్లీ :** హిండన్ నది కాలుష్యంపై నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్ (ఎన్‌జిటి) ఉత్తర్ ప్రదేశ్ ప్రభుత్వ ప్రధానకార్యదర్శిని వివరణను కోరింది. పారిశ్రామిక వ్యర్థాలను విడుదల చేయడం, మురుగునీటి శుద్ధి సౌకర్యాలు తగినంత లేకపోవడం వల్ల నదిలో కాలుష్యం ఏర్పడుతుందని మీడియా నివేదికను సుమోటోగా (స్వయంగా) స్వీకరించిన విషయంపై జాతీయ హరిత ట్రిబ్యునల్ విచారణ జరిపింది. 'సహారన్‌పూర్‌లోని శివాలిక్ కొండల నుంచి ఉద్భవించి ఏడు జిల్లాల గుండా ప్రవహించే 400కిలోమీటర్ల వర్షపునది దాని ఒడ్డున ఉన్న19మిలియన్ల జనాభాకు మద్దతు ఇస్తుంది. అయితే ఈ నది విషపూరిత (టాక్సిక్) కాలువగా మారింది. రోజుకు 72,170కిలో లీటర్లకు పైగా అందుకుంటుంది. 357 పరిశ్రమల నుండి పారిశ్రామిక వ్యర్థాలు రోజుకు943మిలియన్ లీటర్లు గృహ మురుగు నీటి (ఎంఎల్‌డి) తగినంత మౌలిక సదుపాయాల లేమి కారణంగా 220 ఎంఎల్‌డి కంటే ఎక్కువగా శుద్ధి చేయబడదు' అని నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్ చైర్మన్ జస్టిస్ ప్రకాష్ శ్రీవాత్సవ ధర్మాసనం నవంబరు 27నాటి ఉత్తర్వులో పేర్కొంది.జ్యుడీషియల్ సభ్యుడు జస్టిస్ అరుణ్‌కుమార్ త్యాగి, నిపుణుడు ఎ.సెంథిల్ వేల్‌లతో కూడా ధర్మాసనం వార్తా కథనాన్ని ఉటంకిస్తూ, కాలుష్యం తీవ్రత నది స్థిరమైన నీటి నాణ్యత కొలమానాలలో ప్రతిబింబిస్తుందని తెలియజేసింది. ఇంకా ఈ వార్తాంశం 'నదీ కాలుష్యం తీవ్రమైన ప్రభావాలను కలిగిస్తుందని, నది వెంబడి ఉన్న కమ్యూనిటీలు క్యాన్సర్, కాలేయసమస్యలు, చర్మ ఇన్ఫెక్షన్లు, కామెర్లు, దంత సమస్యలు, మూత్రపిండాలలో రాళ్లు, ఎక్కువగా ఉన్నట్లు నివేదిస్తున్నాయి' అని గిరిజనులు తెలిపారని పేర్కొంది. పర్యావరణ అధ్యయనాలను ఉదహరించినట్లు నివేదిక తెలిపింది. సీసం (పరిమితుల కంటే 179రెట్లు అధికం), కాడ్మియం (పరిమితులకంటే 9రెట్లు ఎక్కువ) క్రోమియం (పరిమితుల కంటే 123 రెట్లు ఎక్కువ)సహా హెవీలోహాల ప్రమాదకరస్థాయిలో నీటిలో ఉన్నట్లు వెల్లడైంది. 'ముఖ్యంగా పిల్లలకు ఈ కలుషితాలు హానికలిగిస్తాయి. ఈ లోహాల తీవ్రత స్థాయిల నుంచి పిల్లలు అధిక ప్రమాదాలను ఎదుర్కొంటారు' అని ట్రిబ్యునల్ పేర్కొంది. 'ఇది పార్టీలు లేదా ప్రతివాదులుగా ఉత్తర ప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వ ప్రధాకార్యదర్శి, కేంద్ర పర్యావరణ, అటవీ, వాతావరణ పరిస్థితుల మార్పు మంత్రిత్వ శాఖ ఉత్తరప్రదేశ్ ప్రాంతీయకార్యాలయం, కేంద్ర కాలుష్య నియంత్రణ బోర్డు, రాష్ట్ర కాలుష్య నియంత్రణ బోర్డులను అభ్యర్థించింది. సమాధానాలు దాఖలు చేయడానికి పై ప్రతివాదులకు నోటీస్ జారీచేయాలి' అని ఎన్‌జిటి ధర్మాసనం ఆదేశించింది. తదుపరి ప్రొసీడింగ్ కోసం మార్చి 19కి పోస్ట్ చేయబడిందని ధర్మాసనం తెలిపింది.

# అన్నింటా మహిళలదే ప్రధాన పాత్ర
### ఎన్‌ఎఫ్‌డబ్ల్యూ జాతీయ మహాసభలో
### రావుల వెంకయ్య సందేశం

**న్యూఢిల్లీ:** అన్ని రంగాలలో మహిళలదే ప్రధాన పాత్ర అని అఖిల భారత కిసాన్ సభ (ఏఐకేఎస్) ప్రధాన కార్యదర్శి రావుల వెంకయ్య పేర్కొన్నారు. మూడు రోజులుగా ఇక్కడ జరుగుతున్న భారత జాతీయ మహిళా సమాఖ్య (ఎన్‌ఎఫ్‌ఐడబ్ల్యూ) 22వ జాతీయ మహాసభ ఆదివారం ముగింపు సభలో రావుల వెంకయ్య సందేశం ఇచ్చారు. వ్యవసాయాన్ని మొట్టమొదట కనుగొన్నది మహిళలేనని చెప్పారు. అంతరిక్షంలో అడుగుపెట్టిన తొలి మహిళ రష్యాకు చెందిన వలెంటినా టెలిస్కా కావడం గర్వకారణమన్నారు. తెలంగాణ సాయు ధ పోరాటంలో చాకలి ఐలమ్మ, మల్లు స్వరాజ్యం వంటి ఎందరో మహిళామణులు కీలకపాత్ర పోషించారన్నారు. మూడు వినాశకర సాగుచట్టాలకు వ్యతిరేకంగా దేశరాజధాని ఢిల్లీలో 13 నెల లు మొక్కవోని దీక్షతో ఆందోళన నిర్వహించి ప్రధానమంత్రి నరేంద్ర మోదీ మెడలు వంచిన పోరులో మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్న విష యం మరిచిపోలేమన్నారు. మహిళల ప్రధానపా త్ర వహించని రైతు, వ్యవసాయ కార్మిక ఉద్యమాలు లేవంటే అతిశయోక్తికాదన్నారు. డెయిరీ వంటి వ్యవసాయ అనుబంధ పరిశ్రమల్లోనూ మహిళలదే ప్రధాన పాత్ర అని చెప్పారు. నేడు సమాజంలో మహిళలు ఎదుర్కొంటున్న అన్ని సమస్యలను మహాసభ చర్చిస్తుందని ఆశిస్తున్నట్టు తెలిపారు, దేశంలో ఎక్కువగా సమస్యలు ఎదుర్కొంటూ దోపిడీకి గురవుతున్న గ్రామీణ ప్రాంత మహిళలు ప్రత్యేకించి రైతు, వ్యవసాయ రంగాలలో పనిచేసే మహిళల సమస్యలను ఈ మహాసభలో సవివరంగా చర్చిస్తారన్న ఆశాభావాన్ని వ్యక్తంచేశారు. మహాసభలు విజయవంతం కావాలని రావుల వెంకయ్య అకాంక్షించారు. ఆంధ్రప్రదేశ్ మహిళా సమాఖ్య ప్రధాన కార్యదర్శి పెనుమత్స దుర్గాభవాని రాష్ట్రంలో నిర్వహించిన కార్యకలాపాలను వివరించారు.

# ఢిల్లీలో ఆందోళనలకు కేంద్ర ప్రభుత్వమే కారణం
### కరోల్‌బాగ్‌లో అసెంబ్లీ ఎన్నికల పాదయాత్రలో
### ఆప్ చీఫ్ అరవింద్‌కేజ్రీవాల్ ధ్వజం



**న్యూఢిల్లీ :** దేశ రాజధాని ఢిల్లీలో శాంతిభద్రతలు ఆందోళనకరంగా మారడంపై ఆమ్ ఆద్మీ పార్టీ అ ధినేత అరవింద్ కేజ్రీవాల్ కేంద్ర ప్రభుత్వంపై వి రుచుకు పడ్డారు. ఈ పరిస్థితికి కేంద్ర ప్రభుత్వమే బాధ్యత వహించాలన్నారు. ఢిల్లీ పోలీసులపై తమ ప్రభుత్వం నియంత్రణను కలిగి ఉంటే ఈ పరిస్థితి భిన్నంగా ఉండేదని కేజ్రీవాల్ నొక్కిచెప్పారు. రాబోయే అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో దేశ రాజధాని ఢిల్లీలోని కరోల్‌బాగ్‌లో ఆదివారం నాడు అరవింద్ కేజ్రీవాల్ అసెంబ్లీ ఎన్నికల ప్రచార 'పాదయాత్ర' నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ప్రజలను ఉద్దేశించి ప్రసంగించారు. నగరంలో వారి భద్రతను నిర్ధారించడానికి, కేంద్రంపై ఒత్తిడి పెంచడానికి తాను ప్రజలతో కలిసి ఆందోళన చేస్తానని ప్రజలకు భరోసా ఇచ్చారు.'ఢిల్లీ పోలీసులు మా నియంత్రణలో లేరు. లేకుంటే, ఢిల్లీలో పరిస్థితి ఇంత దారుణంగా ఉండేదికాదు.నేను పాఠశాలలు, హాస్పిటల్స్, విద్యుత్ సమస్యలను పరిష్కరించినట్లే శాంతిభద్రతలను కూడా పరిష్కరించాను' అని కేజ్రీవాల్ ప్రజలకు గుర్తుచేశారు.'ఇప్పుడు మనందరం సంఘటితంగా గళం విప్పాలి. నేను ఢిల్లీ మొత్తాన్ని ఏకం చే స్తాను. ఢిల్లీకి భద్రత కల్పించాలని ఈ బిజెపి నేతల ను డిమాండ్ చేస్తాను' అని 2025 సంవత్సరం ఫిబ్రవరిలో జరుగనున్న ఢిల్లీ అసెంబ్లీకి 70స్థానాల కు ఎన్నికలు జరుగనున్న నేపథ్యంలో ఆప్ అధినేత అరవింద్ కేజ్రీవాల్ తన స్వరాన్ని పెంచారు.

# 'నేడు ఢిల్లీ'లో మణిపూర్ ఇండియా కూటమి 'నిరసన'

**న్యూఢిల్లీ :** ఇంఫాల్ : హింసకాండ చోటుచేసుకున్న మణిపూర్ రాష్ట్రానికి చెందిన ఇండియా కూటమి పార్టీల నేతలు సోమవారం (డిసెంబరు 9) నాడు న్యూఢిల్లీలోని జంతర్‌మంతర్‌వద్ద నిరసన చేపట్టనున్నట్లు ఆదివారం కాంగ్రెస్‌పార్టీ ప్రకటించింది. మణిపూర్ రాష్ట్రంలోని, కేంద్రంలోని బిజెపి నేతృత్వంలోని ఎన్‌డిఎ ప్రభుత్వాలకు వ్యతిరేకంగా ఈ నిరసన చేపట్టనున్నట్లు తెలిపింది. మణిపూర్ రాష్ట్ర కాంగ్రెస్ ముఖ్య అధికార ప్రతినిధి హరేశ్వర్ గోస్వామి విలేకరులతో మాట్లాడుతూ మణిపూర్ నుంచి వచ్చిన ఇండియా కూటమి నేతలు దేశ రాజధాని ఢిల్లీలో నిరసన చేపట్టనున్నారని, ఈ ప్రతిపాదిత నిరసన కార్యక్రమానికి అనుమతి లభించినా, అనుమతించకున్నా నిరసన ప్రదర్శన నిర్వహిస్తామని తెలిపారు. మణిపూర్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కెయిషమ్ మేఘచంద్ర నవంబరు 25వ తేదీ నుంచి ఢిల్లీలోనే ఉండి నిరసనకు సంబంధించిన ఏర్పాట్లను చూసుకుంటున్నారని గోస్వామి చెప్పారు. దే శ రాజధాని ఢిల్లీలో మణిపూర్‌కు చెందిన 5గురు కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యేలు సహా పలువురు నాయకులు, ఆఫీస్ బేరర్లు ఇప్పటికే నిరసనకు దిగారని హరేశ్వర్ గోస్వామి తెలిపారు. నిరసన ప్రదర్శనలో మణిపూర్‌కు చెందిన సిపిఐ(ఎం), తృణమూల్ కాంగ్రెస్, ఆమ్ ఆద్మీ పార్టీ, ఎన్‌సిపి నేతలు పాల్గొంటారని ఆయన విలేకరులు అడిగిన ప్రశ్నకు సమాధానంగా చెప్పారు .'డిసెంబరు 6న ఢిల్లీలో నిరసన చేపట్టాలని అనుకున్నాం. కానీ కొన్ని అసౌకర్యాల కారణంగా వాయిదా వేయాల్సి వచ్చింది.ఇప్పుడు కేంద్రం అనుమతి ఇచ్చినా, ఇవ్వకపోయినా సోమవారం నాడు నిరసనకు దిగుతాం. సిట్ కావచ్చు, లేదా మరేదైనా రూపంలో ప్రదర్శన నిర్వహించడానికి మా విధానాన్ని మేం అనుసరిస్తాం' అని గోస్వామి తెలియజేశారు.

## నేడు సోనియా గాంధీ జన్మదిన వేడుకలను ఘనంగా జరుపుకోవాలి

### డిసిసి మీడియా సెల్ కన్వీనర్ సిజె బెనహర్

**ప్రజాపక్షం/మహబూబ్‌నగర్ ప్రతినిధి :** ప్రత్యేక తెలంగాణ రాష్ట్రాన్ని ఏర్పాటు చేసిన ప్రదాత, ఎఐసిసి అగ్ర నాయకురాలు సోనియాగాంధీ జన్మ దిన వేడుకలను నేడు సోమవారం జిల్లా వ్యాప్తంగా కాంగ్రెస్ నాయకులు కార్యకర్తలు ఘనంగా జరుపుకోవాలని డిసిసి మీడియా సెల్ కన్వీనర్ సిజే బెనహర్ ఆదివారం ప్రకటనలో తెలిపారు. గ్రామ, మండల కేంద్రాలు, నియోజకవర్గాల్లో సోనియా గాంధీ జన్మదిన వేడుకలను ఘనంగా జరుపుకో వాలని ఈ సందర్భంగా రక్తదాన శిబిరాలు, సేవా కార్యక్రమాలు చేపట్టాలని ఆయన కోరారు. జిల్లా కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఉదయం10:30 గంటలకు సోనియా గాంధీ జన్మదిన వేడుకలు జరుగుతా యని, పార్టీ ఎమ్మెల్యేలు, ప్రజాప్రతినిధులు పాల్గొంటారని తెలిపారు. ఈ వేడుకల్లో పార్టీకి సంబంధించిన అన్ని విభాగాల నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొనాలని ఆయన కోరారు.



## మతాలకతీతంగా మనిషిని ఆవిష్కరించేదే కవిత్వం

**ప్రజాపక్షం/మహబూబ్‌నగర్ ప్రతినిధి :** సమూహ సెక్యులర్ రైటర్స్ ఫోరం రాష్ట్ర మహాసభలు ఈనెల 14న మహబూబ్నగర్లో నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా నేడు సీనియర్ సిటిజన్స్ ఫోరం కార్యాలయంలో కవి సమ్మే ళనం ఉర్దూ ముషాయిరా ప్రముఖ విద్యావేత్త కే లక్ష్మ ణ్ గౌడ్ అధ్యక్షతన జరిగింది. ఈ సభలో ప్రముఖ ఆధ్యాత్మిక సా మాజికవేత్త ముస్తాక్ అభి లాష్, పాలమూరు అధ్యయన వేదిక ఉమ్మడి జిల్లా కన్వీనర్ రాఘవాచారి, బెక్కం జనార్దన్, ప్రముఖ కవులు నూరా పాశీ, జనజ్వాల, చిచా పాల మూరి, జగపతి రావు, బోల యాదయ్య, ఖలీల్ ప్రసగించారు. వక్తలు మాట్లాడుతూ మతం కంటే ముందు మనుషులని, మానవత్వమే సమాజ ప్రగతికి దోహదపడుతుందని తెలిపారు. సామాన్యమైన ప్రజల్లో కవులు విశి ష్టత కలిగిన వారని మతాల నధిగమించి మానవత్వాన్ని ఆవిష్కరించే దృక్పథం కవులకు ఉండాలని పిలుపునిచ్చారు. దేశంలో సామరస్య లౌకిక ప్రజా జీవనాన్ని కోరుకునే వారే అధికంగా ఉన్నారని తెలిపారు. మతోనా ద్మల శిబిరంలో ఉన్న వారు కూడా సత్యాలు తెలుసుకుంటున్నారని, వాళ్లు మనుషులే కాబట్టి వాళ్ళలో మార్పు వస్తుందనే ఆశా భావం వ్యక్తం చేశారు. తెలంగాణ రాష్ట్రంలోని సాహిత్య కారులు ఇవాళ దేశానికి అవసరమైన స్నేహపూర్వకమైన ప్రజాస్వామ్య విలువలను కాపాడాలనే లక్ష్యంతో సమూహ సెక్యులర్ రైటర్స్ ఫోరం ఏర్పాటు చేసుకున్నారని తెలిపారు. సాహిత్య కారుల ఈ కృషిని మహబూబ్నగర్ జిల్లా స్వాగతిస్తుందని, రచయి తలకు సాహిత్యకారులకు ఆతిథ్యానిస్తుందని వారు తెలిపారు. ఆతిథ్యాని స్తుందని వారు తెలిపారు. ధార్మిక గ్రంథాలలో సెక్యులరిజమే ఉందని, మతా ఉన్నాద చర్యలకు తావు లేదని ముస్తాక్ అభిలాష్ తెలిపారు. ధార్మిక గ్రంథాల యడల మిడిమిడి జ్ఞానం ఉన్నవాళ్లే మతోన్మాద చర్యలను ప్రోత్స హిస్తారని వారన్నారు. ఈ కార్యక్రమంలో వల్లభాపురం జనార్దన్, మౌలానా నాసర్, పులి జమున, హనీఫ్ అహమ్మద్, శాంతారెడ్డి, సత్యవతి, పరిమళ్ తదితర 28 మంది కవులు కవితా గానం చేశారు.



## ఘనంగా బోధి దినోత్సవం

**ప్రజాపక్షం/జడ్చర్ల:** స్థానిక డా. బూర్గుల రామకృష్ణ రావు ప్రభుత్వ డిగ్రీ, పీజీ కళాశాల, .జడ్చర్ల లోని తెలంగాణ బొటానికల్ గార్డెన్ లో బోధి దినో త్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా స్థానిక కౌన్సిలర్ సతీష్ కుమార్ పాల్గొన్నారు. ప్రపంచానికి శాంతిని బోధిం చిన గౌతమ బుద్ధునికి రావి చెట్టు కింద జ్ఞానోదయం పొందిన రోజును బోధి దినోత్సవం గా పాటిస్తామని సతీష్ తెలిపారు. గార్డెన్ లోని బుద్ధ విగ్రహానికి పూలమాల వేసి అనంతరం మిఠాయిలు పంచిపెట్టారు. ప్రపంచమంతా అహింస, జ్ఞానదీపాన్ని వెలిగించిన బుద్ధ భగవానుడు జ్ఞానోదయం పొందని రోజుగా బుద్ధుని భోదన ల ద్వారా మాత్రమే సాధ్యమని గార్డెన్ సమన్వయ కర్త డా. సదాశివయ్య తెలిపారు. గార్డెన్ లో బుద్ధుని విగ్రహాన్ని ఏర్పాటు చేసిన సతీష్ ను అభినందించారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ సతీష్, గార్డెన్ సమన్వయకర్త సదాశివయ్య, రాధాకృష్ణ, ఎన్ఎస్ఎస్ యూనిట్ 3 వాలంటీర్ లు వనజ, వాణి, మనూష తదితరులు పాల్గొన్నారు.

## దేవాలయ అభివృద్ధి కృషి



**ప్రజాపక్షం/జడ్చర్ల :** జడ్చర్ల పట్టణంలో శ్రీ వెంకట స్వామి దేవాలయ అభివృద్ధికి అన్ని రకాల కృషి చేస్తానని జడ్చర్ల ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి అన్నారు. ఆదివారం నాడు ఆయన పట్ట ణంలో శ్రీ వెంకట స్వామి దేవాల యంలో ప్రత్యేక పూజలు నిర్వ హించి అనంతరం గాలి గోపురం ఏర్పాటు కు పూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లా డుతూ దేవాలయ అభివృద్ధికి తనకు వీలు అయ్యేంతవరకు కృషి చేస్తానని ఆయన హామీ ఇచ్చారు. దేవాలయానికి వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని రకాల సౌకర్యాలు కల్పించాలని పూజరులను ఆదేశిం చారు. ముఖ్యంగా దేవాలయ ప్రాంగణంలో ఎల్లప్పుడు శుభ్రంగా ఉంచా లని. కోనేరు చుట్టుపక్కల ప్రాంతాలు పరిశుభ్రంగా ఉంచి భక్తులకు ఇలాంటి ఇబ్బందులు కలగకుండా చూసుకోవాల్సిన బాధ్యత అని అన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ కోనేటి పుష్పలత సారిక రాజు బుక్క వెంకటేశం జనార్దన్ రెడ్డి మీనాస్ కాజా తదితరులు పాల్గొన్నారు.

## బావి పైకప్ప నిర్మాణం కోసం నిధులు మంజూరు

**ప్రజాపక్షం / పెబ్బేరు :** మండల పరిధిలోని శాఖపూర్ వై గ్రామంలో బావి పై కప్పు జాలి కొరకు ఎమ్మెల్యే మెగారెడ్డి దృష్టికి తీసుకుపోగా తక్షణమే స్పందించిన ఎమ్మెల్యే జిల్లా కలెక్టర్ దరఖాస్తు పంపించారు. ఈ దరఖాస్తుపై స్పందించిన కలెక్టర్ ఆధర్శ సురభి , అడిషనల్ కలెక్టర్ లోకల్ బాడీ నిధుల నుంచి రూ. 3 లక్షల ప్రొజిడింగ్ మంజూరు చేయించడం జరిగింది. దరఖా స్తుకు స్పందించిన వెంటనే ప్రొజిడింగ్ ఇచ్చిన జిల్లా కలెక్టర్ ఆదర్శ సురభికి అడిషనల్ కలెక్టర్‌కి ఎమ్మెల్యే మెగా రెడ్డికి , గ్రామ ప్రజల తరపున తెలంగాణ ఉద్యమకారుడు, ప్రముఖ న్యాయవాది, కావలి గోవింద్ నాయుడు కృతజ్ఞ తలు తెలియజేశారు.

# వ్యవసాయ రంగానికి ప్రభుత్వం పెద్దపీట

### ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ



**ప్రజాపక్షం/వంగూర్ :** తెలంగాణరాష్ట్రంలో వ్యవసా యరంగానికి కాంగ్రెస్ ప్రభుత్వం పెద్దపీట వేస్తుందని ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ అన్నారు. ఆదివారం మండలపరిధిలోని కొండారెడ్డిపల్లి గ్రామంలో ప్రజా పాలన విజయోత్సవ కార్యక్రమంలో భాగంగా ఉద్యా నవనశాఖ ఆధ్వర్యంలో రైతులకు స్ప్రింక్లర్‌సెట్లు, సిఎం రిలీఫ్‌ఫండ్ చెక్కులను అందజేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర వ్యవసాయశాఖ కమీషన్ సభ్యులు కెవిఎన్‌రెడ్డిలు మాట్లాడుతూ గతప్రభుత్వ అశ్రద్ధతో రైతాంగానికి తీవ్ర అన్యాయం జరిగిందని అన్నారు. వ్యవసాయం సాగుచేసే రైతులను గాలికివదిలేసి కార్పొరేట్ వ్యవస్థకు కొమ్ముకాశారని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభు త్వంలో సన్న చిన్నకారు రైతులకు వ్యవసాయ పనిముట్లు పంపిణీచేస్తూ సాగుచేసే రైతులకు అండగా ఉంటుందని అన్నారు. త్వరలోనే రైతుబంధు , రుణమాఫీ పూర్తిచేసేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని అన్నారు. మండలంలోని ప్రతి ఎకరాకు కెఎల్ఐ ద్వారా సాగునీళ్లు అందించేందుకు ప్రభుత్వం కృషి చేస్తుందని అన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల ప్రచార కార్యదర్శి పాండురంగారెడ్డి, కాంగ్రెస్ పార్టీ నాయకులు బొజ్జకృష్ణారెడ్డి, యూత్‌కాంగ్రెస్ అసెంబ్లీ అధ్యక్షులు క్యామ మల్లయ్య, లాలుయాదవ్, వేమారెడ్డి, లక్ష్మారెడ్డి, పిల్లివెంకటయ్యయాదవ్, వివిధ శాఖల అధికా రులు , గ్రామస్తులు పాల్గొన్నారు.

## ఆచారి మహిళలకు తక్షణమే క్షమాపణ చెప్పాలి



**ప్రజాపక్షం/కల్వకుర్తి :** దేశంలో మోడి గ్యారెంటీ అనే నినాదంతో ఇచ్చిన హామీలు ఏమైందో ప్రజ లకు చెప్పాలని ఆచారిని కల్వ కుర్తి నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ యువనాయకులు డిమాండ్ చేశారు. ఆది వారం నియోజకవర్గ యువజన కాంగ్రెస్ నాయ కులు పట్టణంలోని ఎమ్మెల్యేక్యాంపు కార్యాల యంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ కల్వకుర్తిలో బిజెపి నాయకులు కేంద్రంలోని తమ ప్రభుత్వం గతపదేళ్లుగా ఇచ్చిన ఏ ఒక్క హామీలను నెరవేర్చనందుకు ర్యాలీచేశారా అని ప్రశ్నించారు. ఏంమొఖం పెట్టుకొని బిజెపి నాయకులు ర్యాలీలు చేస్తున్నారని ప్రశ్నించారు. ఎదుటివారిపై వేలెత్తిచూపేముందు తమవీపు చూసుకోవాలన్నారు. ఆచారి మహిళలపై అనుచిత వ్యాఖ్యలు చేస్తూ ఏపనిపాటలేకుండా ఆడవారు ఎర్రబస్సులో ఎక్కి పట్నం తిరుగుతున్నారని మహి ళలను అవమానపర్చేవిధంగా మాట్లాడటం జరి గిందని , తక్షణమే మహిళలోకానికి ఆచారి క్షమా పణలు చెప్పాలని డిమాండ్‌చేశారు. కార్యక్ర మంలో యువజన కాంగ్రెస్ జిల్లా కార్యదర్శి రాపోతు అనిల్‌గౌడ్, తాలుకా యువజన కాంగ్రెస్ అధ్యక్షులు దళపతిగౌడ్, జిల్లాప్రధాన కార్యదర్శి అభినవ్‌రెడ్డి, కల్వకుర్తి మండల యువజన కాంగ్రెస్ అధ్యక్షులు బీసబాలరాజు, యువజన కాంగ్రెస్ తాలుకా ఉపాధ్యక్షులు ఇమ్రాన్‌బాబా, ప్రధాన కార్యదర్శి పురుషోత్తం, యువజన కాంగ్రెస్ వెల్దండ మండల ఉపాధ్యక్షులు మహేష్ నాయక్, యువజన కాంగ్రెస్ నాయకులు జంగ య్యగౌడ్, శ్రీహరి, కడ్తాల్ మండల ఉపాధ్యక్షులు సాయి, నాయకులు కురుమూర్తి, మల్లేష్‌గౌడ్, శివ,ధర్మ, రమేష్ పాల్గొన్నారు.



### కాంగ్రెస్‌పార్టీకి

## ప్రజలే బ్రాండ్ అంబాసిడర్లు

**ప్రజాపక్షం/నాగర్‌కర్నూల్‌టౌన్ :** ప్రజలే కాంగ్రెస్‌పార్టీకి బ్రాండ్ అంబా సిడర్లని టిపిసిసి స్పోక్‌పర్సన్ లింగయాదవ్ అన్నారు. ఆదివారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావే శంలో ఆయన మాట్లాడుతూ సంవత్సరపాలనలో కాంగ్రెస్ ప్రభుత్వం రేవంత్‌రెడ్డి నాయకత్వంలో చేపట్టిన సంక్షేమ పథకాలకు ప్రజలే బ్రాండ్ అంబాసిడర్లని అన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలకు అండగా నిలుస్తూ బిజెపి, బిఆర్ఎస్ చేస్తున్న కుట్రలకు రాబోయేకాలంలో ప్రజలే బుద్ధిచెబు తారని అన్నారు. పది సంవత్సరాల కెసిఆర్ కుటుంబ పాలనకు చరమగీ తంపాడి ప్రజలు కాంగ్రెస్‌పార్టీని గెలిపించారని అన్నారు. ఈసంవత్సర కాలంలో గ్యారంటీలను అమలుచేస్తూ ప్రజాపాలన సాగించడంతో దేశం లోని అన్ని రాష్ట్రాలు తెలంగాణవైపు చూస్తున్నాయని అన్నారు. సంవత్సర కాలంలో 55వేల ఉద్యోగాలను భర్తీచేయడంతోపాటు విద్యార్థులకు 30శాతం కాస్మొటిక్ చార్జీలను పెంచడం జరిగిందని గతంలో 5వేల పాఠ శాలలను మూసివేస్తే కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చినతర్వాత 11000టీచర్ పోస్టులను భర్తీచేసిందన్నారు. విద్యకు అధికంగా నిధులను కేటాయించి ఇంటిగ్రేటెడ్ పాఠశాలలకు శంకుస్థాపన చేయడం జరిగిందన్నారు. ఈ సమావేశంలో అలంపూర్‌కు చెందిన నాయకులు ఆచారి, కౌన్సిలర్లు జక్కా రాజ్‌కుమార్‌రెడ్డి, సురేంద్ర, పద్మమ్మ, కొండూరులలిత, అచ్యుత్‌రెడ్డి, బచ్చ న్నయాదవ్, నాయకులు బాదం నరేందర్, సంపత్‌కుమార్ పాల్గొన్నారు.



## అయ్యప్ప పడిపూజ

**ప్రజాపక్షం / కొత్తకోట :** కొత్తకోట మున్సిపాల్టీ కేంద్రంలో జరిగిన అయ్యప్ప స్వామి మహ పడిపూజ కార్యక్రమంలో కొత్తకోట మాజీ జడ్పీ టీసీ పొగాకు విశ్వేశ్వర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా అయ్యప్ప స్వామి పడిపూజ కార్యక్రమానికి తమ వంతు సహాయం అందించినందుకు పూజారి గోపీ స్వామితో పాటు అయ్యప్ప స్వామి దేవాలయ నిర్వాహ కులు గంగాధర్ స్వామి, సుధాకర్ రెడ్డి స్వామి, ఆంజనేయులు స్వామి, నాగరాజు, స్వామి, అనిల్ , తదితరులు మాజీ జడ్పీటీసీ విశ్వేశ్వర్ రెడ్డి ప్రత్యేకంగా అభినందించి శాలువాతో సన్మానించారు.



## నూతన వధూవరులను ఆశీర్వదించిన మండల కాంగ్రెస్ నాయకులు

**ప్రజాపక్షం / కొత్తకోట :** కొత్తకోట మున్సిపాల్టీ కేంద్రంలో పి. శ్రీకాంత్ రెడ్డి వివాహం, అదేవిధంగా బిపిఆర్ గార్డెన్‌లో హరినాథ్ శెట్టి కూతురు ప్రవళిక వివాహం, అప్పరాలలో బొగ్గు మొగులన్న కుమారుడు సోమేశ్వర్ వివాహం రామకృష్ణాపురంలో సిడిసి మాజీ చైర్మన్ చంద్రశేఖర్ రెడ్డి తమ్మిని కుమారుని వివాహం ఆదివారం మండల కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు. గ్రామాలలో వివాహ వేడుకల్లో పాల్గొని నూతన వధూవరులను ఆశీర్వదించారు. కొత్తకోట మండల కాంగ్రెస్ నాయకులు సిడిసి చైర్మన్ గొల్ల బాబు, కిసాన్ కాంగ్రెస్ వనపర్తి జిల్లా అధ్యక్షుడు వేముల శ్రీనివాస్ రెడ్డి, మాజీ జడ్పీటీసీ పిజె బాబు, మండల కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి ఎల్లంపల్లి నరేందర్ రెడ్డి, మాజీ సర్పంచులు శేఖర్ రెడ్డి, మాసన్న, శివరాములు, మోహన్ రెడ్డి, రవీందర్ , రవీందర్ రెడ్డి, కదిరి సాయియాదవ్ , వనపర్తి కృష్ణారెడ్డి, పి. శ్రీనివాస్ రెడ్డి, జగన్ రెడ్డి, ప్రసాద్ , జలంధర్ రెడ్డి, యాదగిరి, నాగేశ్వర్ రెడ్డి, కోటీశ్వర్ రెడ్డి, దామోదర్ రెడ్డి , రాములు యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

### ఆంజనేయస్వామి బ్రహ్మోత్సవాలకు

## సిఎంకు ఆహ్వానం

**ప్రజాపక్షం / మక్తల్ :** ఈ నెల 15వతేదీన జరగబోయే మక్తల్ శ్రీశ్రీశ్రీ పడ మటి ఆంజనేయస్వామి వారి బ్రహ్మోత్సవాలకు రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, దేవాదాయశాఖ మంత్రి కొండా సురేఖ, కొడంగల్ నియోజకవర్గం ఇంచార్జీ తిరుపతిరెడ్డిని ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి, కాంగ్రెస్ నాయకులు ఆహ్వా నించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు బాలకృష్ణరెడ్డి, మాజీ జడ్పీ టీసీ లక్ష్మారెడ్డి, మాజీ ఎంపీపీ చంద్రకాంత్ గౌడ్ , మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ రవికుమార్ యాదవ్ , శుభోదయ రాములు, ఆలయ ధర్మకర్త ప్రాణేష్ చారి, నెరడగం మాజీ సర్పంచ్ ఆశోక్ గౌడ్ తదితరులు ఉన్నారు.

## కరాటే పోటీల్లో కింగ్ షోటోకాన్ ప్రతిభ

### 21 పతకాలు సాధించిన విద్యార్థులు



**ప్రజాపక్షం / మహబూబ్‌నగర్ ప్రతినిధి :** హైదరాబాద్ యూసుఫ్ గూడలోని కోట్ల విజయభాస్కర్ రెడ్డి ఇండోర్ స్టేడియంలో ఆదివారం జరిగిన మార్షల్ ఆర్ట్స్ ఓపెన్ చాంపియన్ షిప్ లో జిల్లాకు చెందిన కింగ్ షోటోకాన్ కరాటే అకాడమీ విద్యార్థులు ప్రతిభచాటి పతకాలు సాధించినట్లు ఫౌండర్ జహంగీర్ పాషా ఖాద్రీ తెలిపారు. ఈ పోటీల్లో విద్యార్థులు 7 బంగారు పతకాలు , 6 రజత పతకాలు, 8 కాంస్య పతకాలు సాధించినట్లు తెలిపారు. విద్యార్థులను హజ్రత్ మౌలానా సయ్యద్ ఆలే మహ్మద్ షబ్బర్ పాషా ఖాద్రీ, చార్మినార్ ఎమ్మెల్యే మీర్ జుల్ఫికర్ అలీ, మహ్మద్ సల్మాన్ అహ్మదాఖాన్ , డా. మహ్మద్ షోయబ్ , అహ్మద్ ఖాన్ అభి నందించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ కరాటే మాస్టర్ తాజుద్దీన్ తదిత రులు పాల్గొన్నారు.



## నవోదయ విద్యాలయం మహబూబ్‌నగర్‌కు మణిహారం

**ప్రజాపక్షం / మక్తల్ :** మక్తల్ నియోజకవర్గం ఊట్కూర్ మండల కేంద్రంలో మండల అధ్యక్షుడు రమేష్ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బంగ్ల లక్ష్మి కాంత్ రెడ్డి మాట్లాడుతూ గతంలో జరిగిన ఎంపీ ఎన్నికల ప్రచారంలో ఇచ్చిన మాటకు కట్టుబడి మహబూబ్‌నగర్‌కి నవోదయ విద్యాలయాన్ని మంజూరు చేయించిన మకుటంలేని మహరాణి , మహబూబ్‌నగర్ ముద్దుబిడ్డ, బీజేపీ జాతీయ ఉపాధ్యక్షురాలు , పార్లమెంట్ సభ్యురాలు డి.కె. అరుణమ్మకి అభినందనలు తెలియజేశారు. అసెంబ్లీ ఎన్నికల అనంతరం అధికారంలోకి వచ్చి సంవత్సరం గడిచినా ఇంత వరకు కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన గారడీ గ్యారంటీలు , అలవిగాని హామీలు అమలు చేయకుండా రైతుల వెన్నువిరిచిన ప్రస్తుత పాలకులకు గుణపాఠం చెప్పే రోజు ఎంతో దూరం లేదని, తెలంగాణ తల్లి విగ్రహం రూపురేఖలు మార్చి, వాళ్ల కుటుంబ సభ్యులని , కాంగ్రెస్ పార్టీ సింబల్ గుర్తుకు తెచ్చేవిధంగా విగ్రహాన్ని తయారు చేయడం విడ్డురన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ సీనియర్ నాయకుడు కాటం నర్సన్ గౌడ్ , బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు భరత్ , బీజేపీ కార్యకర్తలు అజిత్ రెడ్డి, విజయరాం, యాదవరెడ్డి, నరేందర్ రెడ్డి పాల్గొన్నారు.



## వివాహ రిసెప్షన్‌లో పాల్గొన్న మంత్రి, ఎంపి, ఎమ్మెల్యే

**ప్రజాపక్షం / చిన్నంబావి :** చిన్నంబాయి పరిధిలోని పెద్దమరూర్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు బగ్గారి నర్సింహారెడ్డి ఆహ్వానం మేరకు వారి కుమారుని వివాహ రిసెప్షన్ లో రాష్ట్ర పర్యాటక , సాంస్కృతిక, ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు, ఎంపీ మల్లురవి, ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి, డిసిసిబి చైర్మన్ విష్ణువర్ధన్ రెడ్డి, చింతలపల్లి జగదీశ్వర్‌రావు, పగిడాల శ్రీనివాస్ లు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో మండలం కాంగ్రెస్ నాయకులు చంద్రశేఖర్ యాదవ్ , సింగిల్ విండో వైస్ చైర్మన్ సాగర్ రావు, మహిళ కాంగ్రెస్ పార్టీ నాయకురాలు శ్రీలతరెడ్డి, చిదంబరెడ్డి, యువ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## వెంటనే ఫీజురీయింబర్స్‌మెంట్

**ప్రజాపక్షం/నాగర్‌కర్నూల్‌టౌన్ :** పెండింగ్‌లో ఉన్న విద్యార్థుల ఫీజురీయిం బర్స్‌మెంట్‌ను వెంటనే విడుదల చేయాలని బిసి పొలిటికల్ జేఏసి జిల్లా అధ్య క్షులు దన్నోజు అరవింద్‌చారి రాష్ట్రప్రభుత్వాన్ని డిమాండ్‌చేశారు. ఈ సంద ర్భంగా ఆయన మాట్లాడుతూ పాత బకాయిలు విడుదల చేయకపోవడంతో ప్రైవేట్ కళాశాలల యాజమాన్యాలు విద్యార్థులను తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తున్నారని అన్నారు. విద్యార్థులపై ఫీజుల ఒత్తిడి తీసుకురావడంతో విద్యా ర్థులు పైచదువులు చదవడానికి టిసిలు, మెమోలు,బోనఫైడ్‌లు ఇవ్వకపోవ డంతో విద్యార్థులు ఆందోళనకు గురవుతున్నారని అన్నారు. ఇప్పటికైనా వెంటనే రాష్ట్రప్రభుత్వం ఫీజురీయింబర్స్‌మెంట్ బకాయిలను విడుదల చేయ కపోతే పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేస్తామని హెచ్చరించారు.



## స్నేహితుడి కుటుంబానికి చేయూత

**ప్రజాపక్షం/వెల్దండ :** మండలానికి చెందిన సలేశ్వరం ఇటీవలే అనారో గ్యంతో మృతిచెందాడు. మృతిచెందిన విషయం తెలుసుకున్న 1998 పదోతర గతి బ్యాచ్ మిత్రులు ఆ కుటుంబానికి అండగా ఉంటామని ముందుకొచ్చారు. ఈసందర్భంగా రూ.85వేల డిపాజిట్ సలేశ్వరం భార్య రేణుక పిల్లలపేరు మీద స్థానిక బ్యాంకులో డిపాజిట్‌చేసి సంబంధిత పత్రాలను స్థానిక ఎఎస్ఐ జకీరుల్లా చేతులమీదుగా డిపాజిట్ బాండు అందజేశారు. కార్యక్రమంలో మిత్రులు సురేష్‌కుమార్, అంజన్‌కుమార్, తిరుపతి, తిరుపతయ్య, సుశీల్, రవీందర్‌రెడ్డి, కొండల్, తారకరామారావు, జక్కులశ్రీను,శ్రీనునాయక్, కృష్ణ, యాదగిరి, మల్లిఖార్జున్, ఈదమన్న, కిరణ్, కుమార్, అన్వర్‌బేగం పాల్గొన్నారు.



## అంబేద్కర్ స్ఫూర్తితో సామాజిక పోరు ఉధృతం

**ప్రజాపక్షం/నాగర్‌కర్నూల్‌ప్రతినిధి :** రాజ్యాంగ నిర్మాత, భారతరత్న డాక్టర్ బిఆర్ అంబేద్కర్ పోరాటస్ఫూర్తితో సామాజికపోరును ఉధృతంచేయాలని దళి తహక్కుల పోరాటసమితి జిల్లా అధ్యక్షులు కొమ్ముభరత్ పిలుపునిచ్చారు. ఆది వారం తాడూరు మండలం అంతారం గ్రామంలో డాక్టర్ బిఆర్ అంబేద్కర్ 68వ వర్ధంతిని ఘనంగా నిర్వహించి జోహర్లు అర్పించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ నేటికి దేశం, రాష్ట్రంలో అసమానతలు అస్పృశ్యత , ఆర్థి కదోపిడి కొనసాగడం పాలకవర్గాలకు సిగ్గుచేటన్నారు. ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన అంబేద్కర్ అభయహస్తం 12లక్షలు ప్రతికుటుంబానికి అర్హు లకు చెల్లించాలని ఆపథకాన్ని తక్షణమే ప్రారంభించాలని అన్నారు. ఎస్సి ఎస్టి బ్యాక్‌లాగ్ పోస్టులను భర్తీచేయాలన్నారు. అంటరానితనానికి వ్యతిరేకంగా దళితుల ఆత్మగౌరవం కోసం పెద్ద ఎత్తున క్యాంపెయిన్ నిర్వహించాలన్నారు. ఎస్సి ఎస్టిసబ్‌ప్లాన్ నిధులను దారి మళ్లించకుండా వారి అభివృద్ధికి ఖర్చు చేయాలని డిమాండ్ చేశారు. అంబేద్కర్ స్ఫూర్తితో ప్రతి ఒక్కరూ ఉద్యమాలకు సిద్ధం కావాలన్నారు. కార్యక్రమంలో డిహెచ్‌పిఎస్ జిల్లా సలహాదారు మోహన్, మండల ఉపాధ్యక్షులు పల్లెరాజు , ఆంజనేయులు, కృష్ణయ్య, హన్మంత్, వెంకటయ్య, శ్రీను, కృష్ణమ్మ, మైసమ్మ, బక్కమ్మ, నర్సమ్మ, అలి వేల, వెన్నెల పాల్గొన్నారు.



## తెలంగాణతల్లి విగ్రహం మార్చడం తగదు

**ప్రజాపక్షం/కల్వకుర్తి :** తెలంగాణరాష్ట్ర ప్రభుత్వం తెలంగాణ తల్లి విగ్రహాన్ని రూపాన్ని మార్చి ఆవిష్కరించడం కాంగ్రెస్‌పార్టీకితగదని బిఆర్ఎస్‌పార్టీ యువ నాయకులు పోలే అశోక్ అన్నారు. ఆదివారం మండల కేంద్రంలో బిఆ ర్ఎస్‌పార్టీ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ బిఆర్ఎస్ ప్రభుత్వంలో ఉన్నప్పుడు అప్పటి ముఖ్యమంత్రి కెసిఆర్ పాలనలో సంస్కృతి కార్యక్రమాలకు ఒక పునాది ఉండేదని, ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చా తెలంగాణకు అన్ని అవమానాలు జరుగుతున్నాయన్నారు. తెలంగాణ తల్లి విగ్రహం కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటు అయ్యాక తెలంగాణ తల్లి విగ్రహం ఏవిధంగా ఉందో ప్రజలు గమనిస్తున్నారని అన్నారు. గత బిఆ ర్ఎస్‌పార్టీ హయాంలో అభివృద్ధి పనులను ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తెలంగా ణలో ఉన్న ఆనవాలు లేకుండా చేయడానికి పూనుకున్నాడని అన్నారు. మార్పు మార్పు అంటే ఇదేనా అని రాష్ట్రప్రజలంతా గమనిస్తున్నారని అన్నారు. ఈ సమావేశంలో యువ నాయకులు జోగురవికుమార్, నారా యణ, రాజు, గంగాధర్, జంగయ్య, రాములు, అమ్మనాయక్ ఉన్నారు.

# రామప్ప సరసన కోటగుళ్ళకు ప్రత్యేక స్థానం

**ప్రజాపక్షం/గణపురం :** 800 ఏళ్లకు పైగా చరిత కలి గిన కాకతీయుల కళా వైభవానికి ఎట్టకేలకు మోక్షం లభించనుంది. కాకతీయుల వారసత్వ సంపదైన కోటగు ళ్లకు కొత్త రూపు సంతరించుకోనుంది. కాకతీయులు నిర్మించిన రామప్ప ఖ్యాతి ఖండాంతరాలు దాటి ప్రపంచ వారసత్వ సంపదగా గుర్తించగా ఇప్పుడు రామప్ప సరసన కోటగుళ్ళ కు ప్రత్యేక స్థానం దక్కింది. రామప్ప దేవాలయ అభివృద్ధి తో పాటు శిథిలమవుతున్న కోటగుళ్ళ అభివృద్ధి కి సాస్కి స్కీమ్ ద్వారా చరిత్రలో మొదటిసారి కేంద్ర ప్రభుత్వం నిధులు కేటాయించింది. యూనిస్కో గుర్తింపు పొందిన రామప్ప దేవాలయానికి కేవలం 9 కిలోమీటర్ల దూరంలో ఉన్న కాకతీయుల కళా క్షేత్రం గణపేశ్వరాలయం కోటగుళ్ళకు త్వరలో మహ ర్దశ పట్టనుంది. రామప్ప కోటగుళ్లతోపాటు గణప సము ద్రం, సరస్సు, రామప్ప సమీపంలో ఉన్న ఇంచర్ల గ్రా మాన్ని కూడా సాస్కి పథకం లో చేర్చి కేంద్ర ప్రభుత్వం పెద్ద ఎత్తున నిధులు కేటాయించింది. కాకతీయుల కట్ట డాలకు రోజురోజుకు పర్యాటకులసంఖ్య పెరుగుతోంది. ఆలయాలభివృద్ధికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కృషి చేస్తు న్నాయి. కేంద్ర పర్యాటక, సాంస్కృతిక శాఖ ఆధ్యాత్మిక వారసత్వ వృద్ధి పథకం (ప్రసాద్) 2022లో చేర్చింది. సాస్కీ స్కీం ద్వారా మరింత అభివృద్ధి చేయనున్నారు.

### రామప్ప సరసన కోటగుళ్ళకు స్థానం

రామప్ప, కోటగుళ్లు రెండు ఆలయాలను కాకతీయులు నిర్మించినప్పటికీ రామప్ప కు మాత్రం ప్రపంచ పఠంలో స్థానం దక్కింది. శిథిలావస్థకు చేరిన కోటగుళ్ళు నిరాధా ర ణకు గురికాగా 18 సంవత్సరాల క్రితం కోట గుళ్ళు పరిరక్షణ కమిటీ ఏర్పాటు చేసి దాతల సహకారంతో ఆలయాన్ని అంచెలంచెలుగా అభివృద్ధి చేశారు. ఆలయ ప్రాంగణంలో గోశాలను నిర్మించారు. ప్రతి సంవత్సరం మహాశివరాత్రి, కార్తీక పౌర్ణమి వేడుకలు ఇక్కడ ఘనం గా జరుగుతాయి. కళ్యాణాన్ని సందర్శించేందుకు పర్య టకులు భక్తులు అధిక సంఖ్యలో తరలివస్తున్నారు. రా మప్పదేవాలయాన్ని ప్రపంచ వారసత్వ సంపదగా గుర్తిం చిన కేంద్ర ప్రభుత్వం రామప్ప కు కేవలం 9 కిలోమీటర్ల దూరంలో ఉన్న కోటగుళ్ల అభివృద్ధికి నడుం బిగించింది. కోట గుళ్ళు గణప సముద్రం సరస్సు అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం నిధులు కేటాయించడం ఇదే మొదటిసారి, గతంలో అప్పటి ఉమ్మడి రాష్ట్ర ప్రభుత్వం రెండు కోట్లు కేటాయించి కొంత పనులు మాత్రమే పూర్తి చేసింది.

### కోటగుళ్లకు టూరిజం హబ్‌లో స్థానం

కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు గుర్తించక మరుగునపడి శిథి లావస్థకు చేరుకున్న కోటగుళ్ళు ఆలయం నేడు కేంద్ర ప్రభుత్వం సాస్కి పథకంలో రామప్పతో పాటు విధాల అ భివృద్ధి చేసేందుకు రూ.73,74 కోట్లు కేటా యించింది. దీంతో కేంద్ర పర్యాటక శాఖ నూతనంగా తయారు చేసే టూరిజం హబ్ లో కోట గుళ్ళ కు స్థానం దక్కింది.

**కోటగుళ్ల లో సాస్కి స్కీమ్‌లో చేయనున్న పనులు ఇవే :** స్కల్ప్చర్ గార్డెన్, కొత్త రకమైన పరికరాలతో పిల్లల ఆట



స్థలం, పార్కింగ్ ప్రాంతం, సీలింగ్ మండపం, సీటింగ్ బెంచీలు, తాగునీరు, డస్ట్ బిన్‌లు, సంకేతాలు, ఆన్‌సైట్ ల్యాండ్‌స్కేపింగ్. ఆన్‌సైట్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్. తదితర పనులు చేయనున్నారు. గణపసముద్రం సరస్సులో సెక్యూరిటీ, ఎంట్రన్స్ గేట్, పార్కింగ్ ప్రాం తం. అడ్మిన్, రెస్టారెంట్, వాష్‌రూమ్‌లు, లేక్ వ్యూ వాక్ వే, పిల్లల ఆట స్థలం, లేక్ వ్యూ కాటేజీలు, 6ఎమ్ వెడ ల్పు గల సిసి రోడ్, నిర్మాణం మెడ్ ల్యాండ్‌స్కేపింగ్‌తో పాదచారుల మార్గం, లేక్ వ్యూ, పాయింట్, ఫ్లోటింగ్ జెట్టీ ,బోటింగ్ పాయింట్. ఏర్పాటు చేయనున్నారు.

## గరికపాటి సోదరులకు ఎమ్మెల్యే కూనంనేని పరామర్శ



ప్రజాపక్షం/ఖమ్మం : కొత్తగూడెం ఎమ్మెల్యే, సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు గరికపాటి సోదరులు గరికపాటి వెంకట్రావు, గరికపాటి ఆంజేయప్రసాద్‌లను పరామర్శించారు. ఇటీవల గరికపాటి రాఘవయ్య అనారోగ్యంతో మృతి చెందిన విషయం విధితమే. ఆదివారం ఆయన దశ దిన కర్మ సందర్భంగా వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. కూనంనేని వెంట సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు మేకల శ్రీనివాసరావు, శ్రీసిటీ సిఇఒ గరికపాటి విజయ్ తదితరులున్నారు.

## స్థానిక ఎన్నికల్లో సత్తా చాటాలి

రాష్ట్ర మార్క్‌ఫెడ్ డైరక్టర్, డిసిఎంఎస్ చైర్మన్ కొత్వాల



ప్రజాపక్షం/పాల్వంచ : తెలంగాణలో త్వరలో జరిగే స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్, యూత్ కాంగ్రెస్ కార్యకర్తలు పార్టీ అభ్యర్థులను గెలిపించి, తమ సత్తా చాటాలని రాష్ట్ర మార్క్‌ఫెడ్ డైరెక్టర్, డిసిఎంఎస్ ఛైర్మన్ కొత్వాల శ్రీనివాసరావు అన్నారు. పాత పాల్వంచలో కొత్వాల స్వగృహంలో యూత్ కాంగ్రెస్‌కు ఇటీవల జరిగిన ఎన్నికల్లో విజయం సాధించిన కొంత మంది కమిటీ సభ్యులు ఆయనను కలవగా, ఆయన వారిని శాలువా బొకేలతో సన్మానించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్టీ కార్యకర్తల కృషి వలనే గత ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ తెలంగాణలో విజయదుందుభి మోగించి అధికారంలోకి వచ్చిందన్నారు. యువజన కాంగ్రెస్ కార్యకర్తలు ప్రభుత్వ పథకాలను వివరించి, ప్రజలను పార్టీ వైపు మళ్లించాలని వారిని కోరారు. ఈసందర్భంగా నూతనంగా ఎన్నికైనా వీరమల్లు గణేష్, మెలిగ మహేష్, బండి నాగరాజులను సన్మానించారు. ఈకార్యక్రమంలో మాజీ జెడ్‌పిటిసి యర్రంశెట్టి ముత్తయ్య, ఎల్‌డిఎం కోఆర్డినేటర్ బద్ది కిషోర్, మండల కాంగ్రెస్ అధ్యక్షులు కోండం వెంకన్న, కాంగ్రెస్ నాయకులు బాశెట్టి సోమయ్య, నూనావత్ సుమన్ నాయక్‌చ అజ్మీరా హుస్సేన్, ఇమ్రాన్, వై వెంకటేశ్వర్లు, కందుకూరి రాము, డిష్ నాగేశ్వరరావు, కాపా శ్రీను, సూర్య కిరణ్, తదితరులు పాల్గొన్నారు

## క్రీడామైదానానికి స్థలం ఇప్పించండి

ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లుకు వినతి



ప్రజాపక్షం/మణుగూరు : మణుగూరు ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం ప్రజా భవన్ నందు అశ్వాపురం మండలం గొందిగూడెం ఉమ్మడి 4 గ్రామ పంచాయితీ పరిధిలో మూడు సంవత్సరాల క్రితం గొందిగూడెం గ్రామపంచాయతీలలో పార్కు కొరకు అధికారులు 5 ఎకరాలు భూమిని క్రీడా మైదానంగా కేటాయించారని, ఆ స్థలాన్ని సదరు అధికారులను ఆదేశించి క్రీడా స్థలంగా ఇప్పించాలని గొందిగూడెం క్రీడాకారులు ఆదివారం పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వరుకు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో అశ్వాపురం కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు ఓరుగంటి బిక్షమయ్య, నాయకులు, మాజీ సర్పంచ్, క్రీడాకారులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రజావిశ్వాసం కోల్పోతున్న కాంగ్రెస్

మాజీ ఎమ్మెల్యే గుమ్మడి నర్సయ్య ధ్వజం



ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ : ఇచ్చిన హామీలను అమలు చేయకపోవడంతో కాంగ్రెస్ ప్రజల విశ్వాసం కోల్పోతుందని మాజీ ఎమ్మెల్యే గుమ్మడి నర్సయ్య ఆరోపించారు. ఆదివారం రఘునాథపాలెం మండలం చింతగుర్తి గ్రామంలో సిపిఐ(ఎంఎల్) మాస్‌లైన్ ముఖ్య కార్యకర్తల సమావేశం జరిగింది. సమావేశంలో గుమ్మడి నర్సయ్య మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఏడాది కాలంలో ప్రజలకు చేసింది చాలా తక్కువ అన్నారు. ఇచ్చిన హామీలను అమలు చేయకపోవడంతో ప్రజల్లో కాంగ్రెస్ పట్ల విశ్వాసం కోల్పోతుందని ఆయన తెలిపారు. ప్రభుత్వం అట్టహాసంగా ప్రకటిస్తున్నటు వంటి ఇందిరమ్మ ఇండ్లను అర్హులైన పేదలందరికీ ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు ఇచ్చిన మాట ప్రకారం అర్హులైన రైతులందరికీ రెండు లక్షల రుణమాఫీ చేయాలని కోరారు. రెండు లక్షలు దాటిన రైతులకు కూడా వెంటనే రుణమాఫీ చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో అధికార, ప్రతిపక్ష పార్టీలు విఫలమైతే రాష్ట్రం బిజెపి చేతుల్లోకి పోయే ప్రమాదం ఉందని ఈ ప్రమాదాన్ని గుర్తించి ఎర్ర జెండాలు ఏకమై ప్రజల తరుపున పోరాడాలని ఆయన పిలుపునిచ్చారు. కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు ఆవుల వెంకటేశ్వర్లు, ఆవుల అశోక్, మండల కార్యదర్శి కేలోత్ లక్ష్మ ణ్, నాయకులు షేక్ మదార్‌సాహెబ్, లింగనబోయిన నాగేశ్వరరావు, ఆడెపు సంగయ్య, సూదగాని ముత్తిలింగం, కవిత, రామయ్య తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ పథకాలకు విస్తృత ప్రచారం

రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు



ప్రజాపక్షం/నేలకొండపల్లి : ప్రభుత్వ పథకాలను యూత్ కాంగ్రెస్ కార్యకర్తలు విస్తృతంగా ప్రచారం చేయాలని రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు సూచించారు. ఇటీవల జరిగిన యూత్ కాంగ్రెస్ ఎన్నికలలో పాలేరు డివిజన్ యూత్ కాంగ్రెస్ ఉపాధ్యాక్షుడిగా విజయం సాధించిన గట్టిగుండ్ల విజయ్‌ను ఆదివారం సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు ప్రభుత్వం చేపడుతున్న అనేక సంక్షేమ పథకాల గురించి ప్రజలకు చేరవేయాలన్నారు. పార్టీని బలోపేతం చేసేందుకు కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జెర్రిపోతుల అంజిని, పాలేరు సేవాదళ్ కన్వీనర్ బచ్చలకూరి నాగరాజు, యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

# ప్రశ్నించే గొంతుక మూగబోయింది

పోటు ప్రసాద్ సంస్మరణ సభలో : మీడియా అకాడమీ చైర్మన్ శ్రీనివాసరెడ్డి



ప్రజాపక్షం/ఖమ్మం : ప్రజల పక్షాన రాజ్యాంగ బద్ధమైన హక్కుల కోసం ప్రశ్నిస్తూ పోరాడే పోటు ప్రసాద్ మరణంతో ప్రశ్నించే గొంతుక మూగబోయిందని తెలంగాణ మీడియా అకాడమీ చైర్మన్ కె.శ్రీనివాసరెడ్డి తెలిపారు. ఆదివారం ఖమ్మంలోని పువ్వాడ ఆడిటోరియంలో జరిగిన పోటు ప్రసాద్ సంస్మరణ సభలో శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ ప్రసాద్ మరణం ఓ షాక్ అని ఊహించని ఈ పరిణామం నుంచి కోలుకోవడం పార్టీ శ్రేణులకే కాదు ఆయన సన్నిహితులకు ఇబ్బందికరమేనన్నారు. ప్రసాద్ అనారోగ్యానికి గురై మరణానికి దగ్గరగా ఉన్న దాఖలాలు లేవని అయినా ఆకస్మిక మరణం పొందడం బాధాకరమన్నారు. హక్కుల కోసం ప్రజల పక్షాన నిరంతరం పోరాడే ప్రసాద్ లాంటి వారిని కోల్పోవడం యావత్ సమాజానికి తీరని లోటన్నారు. హక్కుల కోసం ప్రజా సమస్యల పరిష్కారం కోసం నినదిస్తూ, వివరిస్తూ రాజ్యాంగ హక్కుల అమలుకు పోరాటాలు సాగించే వ్యక్తులను కోల్పోవడం ఈ వ్యవస్థకు చాలా నష్టమన్నారు. పోటు ప్రసాద్ మితభాషి అని ఇలా ఉండేవారిలో సామాజిక పరమైన సంఘర్షణ ఉంటుందన్నారు. ప్రజాస్వామిక విలువలకు కట్టుబడి పోరాటాలు సాగిస్తున్న వ్యక్తులు మరణించడం అట్టడుగు వర్గాల ప్రజలకు తీరని నష్టమన్నారు.

తుదిశ్వాస వరకు పోరాడిన ప్రసాద్ : పువ్వాడ



పోటు ప్రసాద్ తుద్విశ్వాస వరకు ప్రజల హక్కుల కోసం, సమస్యల పరిష్కారం కోసం పోరాడారని సిపిఐ సీనియర్ నాయకులు పువ్వాడ నాగేశ్వరరావు తెలిపారు. ప్రసాద్ సంస్మరణ సభలో పువ్వాడ మాట్లాడుతూ విద్యాభ్యాసం కోసం ఖమ్మం వచ్చిన ప్రసాద్ విద్యార్థి ఉద్యమ నేతగా ఎదిగారని కమ్యూనిస్టు వారసత్వాన్ని పుణికిపుచ్చుకుని పలు సమస్యల పరిష్కారం కోసం జరిగిన పోరాటంలో ముందు భాగంలో నిలిచారన్నారు. పోటు ప్రసాద్ కుటుంబం యావత్ పార్టీకి అంకితమై పనిచేసిందని సమాజ మార్పు కోసం ఆ కుటుంబం చేసిన త్యాగం వెల కట్ట లేనిదన్నారు. ప్రజా సమస్యల పరిష్కారం కోసం కడ వరకు ప్రయత్నించడమే అత్యుత్తమ కమ్యూనిస్టు లక్షణమని ఆ ప్రయత్నంలో ప్రతి ఒక్కరూ ఉండాలని పువ్వాడ సూచించారు.



జిల్లా శాఖను ఆదర్శంగా నిలిపారు : పల్లా వెంకటరెడ్డి



కమ్యూనిస్టు పార్టీ శత వసంతాల వేళ ఖమ్మం జిల్లా సమితిని రాష్ట్రంలోనే మిగిలిన జిల్లాలకు ఆదర్శంగా నిలిపిన ప్రసాద్ మహోన్నతుడని నవ చేతన విజ్ఞాన సమితి అధ్యక్షులు, మాజీ శాసన సభ్యులు పల్లా వెంకటరెడ్డి తెలిపారు. పోరాటాల పురిటిగడ్డ ఉమ్మడి నల్గొండ జిల్లాలో జన్మించిన పోటు ప్రసాద్ ఎఐఎస్‌ఎఫ్ నిర్మాణంలో కీలక భూమిక పోషించారన్నారు. పోటు ప్రసాద్ కుటుంబానికి ఎనలేని చరిత్ర ఉందని ఆ కుటుంబ వారసత్వాన్ని పుణికిపుచ్చుకున్న ప్రసాద్ సిద్ధాంతాన్ని ఆచరణలో చూపిన వ్యక్తిగా చిరస్థాయిగా నిలిచిపోయారన్నారు. ఆయన మరణం ప్రజా ఉద్యమాలకు తీరని లోటని ఆదర్శవంతమైన విప్లవకారున్ని పార్టీ కోల్పోయిందన్నారు.

ఆదర్శ కమ్యూనిస్టు ప్రసాద్ : ముప్పాళ్ల

ఆదర్శవంతమైన కమ్యూనిస్టులలో పోటు ప్రసాద్ ఒకరని, ఆయన ఆశయ సాధనకు కృషి చేయడమే ఆయనకు ఇచ్చే నివాళి అని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ల నాగేశ్వరరావు తెలిపారు. ప్రసాద్‌లో లౌక్యం ఉందని, అదే సమయంలో బాధ్యతల విషయంలో రాజీపడే వాడు కాదన్నారు. ఈ సభలో ఎఐటియుసి రాష్ట్ర కార్యదర్శి యూసుఫ్, పార్టీ ప్రజా సంఘాల నాయకులు, బాధ్యులు ఎ.వనజ, బాగం హేమంతరావు, పశ్య పద్మ, ఎస్‌కె సాబీర్‌పాషా, మహ్మద్ మౌలానా, గుమ్మడి నర్సయ్య, ఆవునూరి మధు, పువ్వాళ్ల దుర్గాప్రసాద్, తుమ్మల యుగంధర్, పోతినేని సుదర్శన్, పోట్ల మాధవరావు తదితరులు ప్రసంగించారు. సభకు సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి దండి సురేష్ అధ్యక్షత వహించగా రాష్ట్ర సమితి సభ్యులు జమ్ముల జితేందర్‌రెడ్డి అతిథులను వేదికపైకి ఆహ్వానించారు.

## సంస్మరణకు తరలివచ్చిన జనం

పోటు ప్రసాద్‌కు ఘన నివాళి



ప్రజాపక్షం/ఖమ్మం : నిస్వార్థ కమ్యూనిస్టు, విప్లవ స్వాప్నికుడు ఖమ్మంజిల్లా కమ్యూనిస్టు పార్టీ రథ సారధి పోటు ప్రసాద్ సంస్మరణకు ఖమ్మంజిల్లా నలుమూలల నుంచి కాకుండా రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో కమ్యూనిస్టు పార్టీ అభిమానులు, కార్యకర్తలు, ప్రసాద్ హితులు, సన్నిహితులు తరలివచ్చారు. ఆదివారం ఖమ్మంలోని పువ్వాడ ఆడిటోరియంలో జరిగిన సంస్మరణ సభకు జనం భారీగా తరలి వచ్చారు. పోటు ప్రసాద్ చిత్రపటానికి నివాళులర్పిస్తూ కన్నీటి పర్యంతమయ్యారు. పార్టీ నాయకులతో కలిసి పోటు ప్రసాద్‌తో తమకున్న అనుబంధాన్ని ఒకరికొకరు పంచుకున్నారు. విద్యార్థి దశ నుంచి అనేక దశాబ్దాల పాటు తమ అనుబంధాన్ని కొనసాగించిన అనేక మంది ప్రసాద్ సంస్మరణ సభకు హాజరై ఉద్యమ ఘట్టాలను నెమరువేసుకున్నారు. కొందరు మిత్రులు పిజి కాలేజీ సాధనోద్యమాన్ని గుర్తు చేసుకుంటే అమర్ జిత్ కౌర్ లాంటి వ్యక్తులు ప్రసాద్ ఎఐఎస్‌ఎఫ్ జిల్లా కార్యదర్శిగా ఉన్నప్పుడు నిర్వహించిన ఎఐఎస్‌ఎఫ్ రాష్ట్ర మహాసభలను గుర్తు తెచ్చుకున్నారు. విద్యుత్ ఉద్యమం, తెలంగాణ ఉద్యమం, ఆర్‌టిసి ఉద్యమం ఇలా ఒక్కొక్కరు ఒక్కో పోరాట ఘట్టాన్ని తెలియజేస్తూ సంస్మరణ సభలో మాట్లాడారు. ముఖ్యంగా పోటు ప్రసాద్ కుటుంబానికి బాసటగా నిలుస్తామని కార్యకర్తలతో పాటు పార్టీ నాయకులు పోటు ప్రసాద్ సహచరులు తెలిపారు. పోటు ప్రసాద్ స్వగ్రామం వెలిదండ రంగాపురం నుంచి పెద్ద సంఖ్యలో పార్టీ కార్యకర్తలు కదిలివచ్చారు. కొత్తగూడెం, నల్లగొండ, సూర్యాపేట, వరంగల్, మహబూబాబాద్ జిల్లాల నుంచి పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్దఎత్తున తరలివచ్చారు. పోటు ప్రసాద్ సహచరులతో ఎప్పుడు ఓ మాట అంటుండే వారు పుట్టుకే కాదు చావు చరిత్ర కావాలని అనేవారు. యాధృచ్ఛికమో లేక ఆయన వాంఛితమో కానీ ప్రసాద్ కమ్యూనిస్టు పార్టీ కార్యదర్శిగా ఆయన పనితీరు కొలబద్ధగా నిలిస్తే ఆయన మరణం చరిత్రలో మిగిలిపోయింది.

## విద్యార్థినికి పిఎస్‌ఆర్ ట్రస్టు చేయూత



ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ : నిరుపేద విద్యార్థినికి పరిశ సీతారత్నం చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో ఆర్థిక చేయూతనందించారు. ఖమ్మం నగరానికి చెందిన బిఇడి సెకండ్ ఇయర్ చదువుతున్న నిరుపేద విద్యార్థిని అశ్వనికి పిఎస్‌ఆర్ చారిటబుల్ ట్రస్టు తరుపున రూ.20వేలు ఆర్థిక సాయం అందించారు. ఆదివారం ఖమ్మం జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో జరిగిన పెన్షనర్స్ సదస్సులో రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్ల సంఘం రాష్ట్ర అధ్యక్షులు ఎ.రాజేంద్రబాబు, ప్రధాన కార్యదర్శి ఎంవి నర్సింగరావు చేతుల మీదుగా రూ.20వేల చెక్కును, జ్ఞాపికను విద్యార్థిని అశ్వనికి ట్రస్టు చైర్మన్ పరిశ పుల్లయ్య అందజేశారు. క్రమశిక్షణ, సమయపాలనతో మంచిగా చదివి ఉన్నత స్థానానికి చేరుకోవాలని రాష్ట్ర అధ్యక్షులు రాజేంద్రబాబు ఆకాంక్షించారు. కార్యక్రమంలో రాష్ట్ర ప్రభుత్వ పెన్షన్‌దారుల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు రామ మనోహర్, కె.సుధీర్‌బాబు, కన్నెకంటి కృష్ణమూర్తి, దేశ్‌పాండే, రాయల రవికుమార్, విద్యార్థిని తల్లి ఇందిర తదితరులు పాల్గొన్నారు.

# పెన్షనర్ల సమస్యలు పరిష్కరించరా?

పెన్షనర్ల సదస్సులో సంఘం రాష్ట్ర అధ్యక్షుడు రాజేంద్రబాబు




ప్రజాపక్షం/ఖమ్మం : అపరిష్కృతంగా ఉన్న రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్ల సమస్యలను పరిష్కరించకపోతే ఆందోళన బాట పట్టక తప్పదని పెన్షనర్ల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు అర్వింణి రాజేంద్రబాబు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం పెన్షనర్ల సమస్యల పరిష్కారం పట్ల నాన్చివేత ధోరణిని అవలంభిస్తుందని ఆయన ఆరోపించారు. పెన్షనర్ల సంఘం ఆధ్వర్యంలో పెన్షనర్ల సదస్సు ఆదివారం స్థానిక జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో జరిగింది. జిల్లా అధ్యక్షుడు పరిశ పుల్లయ్య అధ్యక్షతన జరిగిన సభలో రాజేంద్రబాబు మాట్లాడుతూ పెన్షనర్లకు సంబంధించి నాలుగు విడతల డిఎ పెండింగ్‌లో ఉందని సత్వరం విడుదల చేయాలని డిమాండ్ చేశారు. పాలకులు నగదు రహిత వైద్యం గురించి పదేపదే చెబుతున్నప్పటికీ అమలు కావడం లేదని, వృద్ధాప్యంలో అనారోగ్య పరిస్థితులు నెలకొన్న నేపథ్యంలో నగదు రహిత వైద్యం అందక పెన్షనర్లు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. తక్షణం పెన్షనర్లకు అన్ని కార్పొరేట్ ఆసుపత్రుల్లో నగదు రహిత వైద్యం అందేవిధంగా ఉత్తర్వులు జారీ చేయాలని కోరారు. పదవీ విరమణ పొందిన ఉద్యోగులకు అందాల్సిన పెన్షనర్ల బెనిఫిట్స్‌ను అందించడంలో తీవ్ర జాప్యం జరుగుతుందని, మార్చిలో పదవీ విరమణ పొందిన వారికి సైతం ఇప్పటి వరకు బెనిఫిట్స్‌ను ప్రభుత్వం అందించడం లేదని, పదవీ విరమణ పొందిన వెంటనే ఆర్థిక ఇతర విషయాలను అమలయ్యేవిధంగా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. పిఆర్‌సి అమలులో సైతం జాప్యం జరుగుతుందని, ముఖ్యమంత్రి పిఆర్‌సిపై ఇచ్చిన హామీని నిలబెట్టుకునేవిధంగా సత్వరం ఆదేశాలు జారీ చేయాలని కోరారు. డిమాండ్ల సాధనకు తెలంగాణ రాష్ట్ర పెన్షనర్ల సంఘం ఆధ్వర్యంలో త్వరలో ఆందోళన బాట పడతామని ఇందుకు తగిన కార్యాచరణ రూపొందించుకున్నట్లు రాజేంద్రబాబు తెలిపారు. ఇతర సంఘాలను కలుపుకుని జెఎసిగా ఏర్పడడం జరిగిందని ఉమ్మడి ఎజెండాతో జాయింట్ యాక్షన్ కమిటీ ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చేందుకు పోరాడుతుందన్నారు. సదస్సులో పెన్షనర్ల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎంవి నర్సింగరావు, సీనియర్ ఉపాధ్యక్షులు వి.రాంమనోహర్, దేశ్‌పాండే, వి.మనోహర్‌రాజు, నాగిరెడ్డి తదితరులు ప్రసంగించగా సమావేశంలో కొల్లికొండ శరత్‌బాబు, కె.సుధీర్‌బాబు, యాదయ్య, అంజయ్య, సూర్యనారాయణ, ఆళ్ల రామారావు, నర్సయ్య, కె.కృష్ణమూర్తి, వెంకటేశ్వర్లు,రవికుమార్, భాస్కరాచారి, శరత్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

## పార్టీలకతీతంగా ప్రతీగడపకూ సంక్షేమ ఫలాలు





వైరా ఎమ్మెల్యే రాందాస్‌నాయక్

ప్రజాపక్షం/ఏన్కూరు :పార్టీలకు అతీతంగా సంక్షేమ ఫలాలు ప్రతిగడపకు అందజేస్తామని వైరా ఎమ్మెల్యే మాలోతు రాందాస్‌నాయక్ అన్నారు. మండలంలో వైరా ఎమ్మెల్యే రాందాస్‌నాయక్ ఆదివారం సుడిగాలి పర్యటన నిర్వహించారు. ఈసందర్భంగా పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపన చేశారు. భద్రతండాలో బిటి రోడ్డు కాలనీ నాచారం, నూకలంపాడులో సిసి రోడ్డు నిర్మాణం, గురుకుల పాఠశాలలో ఉపాధ్యాయుల క్వార్టర్స్ నిర్మాణానికి, పికె.బంజర, హిమామ్‌నగర్ గ్రామాల్లో గ్రామపంచాయతీ నూతన భవనాలకు ఆయన ప్రారంభోత్సవం చేశారు. రైతువేదికలో 40 మంది లబ్దిదారులకు కల్యాణ లక్ష్మి, షాదీముబారక్, సిఎం సహాయనిధి చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులకు సంక్రాంతి తర్వాత రైతు భరసా అందజేయడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. గ్రామాల్లో రోడ్ల నిర్మాణం త్వరగా పూర్తి చేయాలని పంచాయతీరాజ్ శాఖ అధికారులను ఆదేశించారు. ప్రభుత్వం అన్నివర్గాల ప్రజల సంక్షేమానికి కృషి చేస్తుందని తెలిపారు. కార్యక్రమంలో ఎంపిడిఒ రమేష్, తహసీల్దార్ శేషగిరిరావు, సొసైటీ అధ్యక్షులు శెట్టిపల్లి వెంకటేశ్వరరావు, పార్టీ జిల్లా నాయకులు గుత్తా వెంకటేశ్వరరావు, స్వర్ణ నరేంద్రకుమార్, వేముల కృష్ణప్రసాద్, గాలిబ్‌సాహెబ్, వక్కంతుల నాగార్జున, పటాన్ మజీద్‌ఖాన్, వాసిరెడ్డి నాగేశ్వరరావు, వీరు నాయక్, లచ్చిరామ్‌నాయక్, కొనకంచి రామకృష్ణ, చందమామ నర్సింహారావు, మాలోతు నర్సింహారావు, గుర్రం రవి, శోభన్‌నాయక్, కట్టా సత్యనారాయణ, పొన్నం హరికృష్ణ, మాదినేని లెనిన్, నిమ్మల నాగేశ్వరరావు, రోహిత్‌సాయి, పంతగాని నరేష్, శేఖర్ పాల్గొన్నారు.

## విద్య, వైజ్ఞానిక ప్రదర్శనకు ఏర్పాట్లు పూర్తి

డిఇఒ సోమశేఖర శర్మ



ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ : జిల్లా స్థాయి విద్య, వైజ్ఞానిక ప్రదర్శనకు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు జిల్లా విద్యాశాఖాధికారి ఈ.సోమశేఖరశర్మ తెలిపారు. విద్యా, వైజ్ఞానిక ప్రదర్శన ఏర్పాట్లను ఆదివారం డిఇఒ సోమశేఖర శర్మ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా కలెక్టర్ ఆదేశానుసారం 9,10 తేదీల్లో ఖమ్మం నగరంలోని బల్లేపల్లి ఎస్‌ఎఫ్‌ఎస్ పాఠశాల డా.విక్రమ్ సారబాయ్ ప్రాంగణంలో జిల్లాస్థాయి విద్య, వైజ్ఞానిక ప్రదర్శన నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు.ఇన్‌స్పైర్‌కు సంబంధించి 119 ఎగ్జిబిట్లు, విజ్ఞాన శాస్త్రంకు సంబంధించి 486 ఎగ్జిబిట్లు రిజిస్ట్రేషన్ చేసుకుని ప్రదర్శనకు సిద్దంగా ఉన్నాయని తెలిపారు. ఈప్రదర్శనలను జడ్జిమెంట్‌కు 32 మందితో 16 మంది కమిటీలను నియమించడం జరిగిందని ఇందులో జూనియర్, సీనియర్స్ నుండి రాష్ట్రస్థాయికి ఉత్తమ ప్రదర్శలను ఎంపిక చేయడం జరుగుతుందని డిఇఒ తెలిపారు. ప్రతిరోజు సాయంత్రం శాస్త్రవేత్తలతో ఉపన్యాసాలు ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ప్రదర్శనలను ఏడు విభాగాలుగా ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. ప్రదర్శనను తిలకించేందుకు తొమ్మిదిన రఘునాథపాలెం, ఖమ్మం రూరల్, ఖమ్మం త్రీటౌన్ ఏరియాకు సంబంధించిన ప్రభుత్వ, ప్రైవేటు, రెసిడెన్షియల్, ఎయిడెడ్ పాఠశాలలకు సంబంధించిన విద్యార్థులకు, 10న ఖమ్మం అర్బన్, వన్‌టౌన్, టూటౌన్ పరిధిలోని పాఠశాల విద్యార్థులకు అవకాశం కల్పించినట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో ఖమ్మం అర్బన్ ఎంఇఒ శైలజలక్ష్మి, రూరల్ ఎంఇఒ శ్రీనివాస్, రఘునాథపాలెం ఎంఇఒ రాములు, కూసుమంచి ఎంఇఒ వీరస్వామి, సైన్స్ ఆఫీసర్ జగదీష్, సిఎంఒ రాజశేఖర్, కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# అందుబాటులోకి ఇ-రేషన్ కార్డులు

ఎడిట్ అప్షన్ మన చేతుల్లోనే



ప్రజాపక్షం/భద్రాచలం : ఎటు చూసినా సాంకేతిక ఉరకలేస్తున్న వేళ ప్రభుత్వం రేషన్ కార్డులను కూడా ఇ-రేషన్ పేరుతే డిజిటల్ చేయనుంది. డిజిటల్ ఇండియాలో భాగంగా కేంద్ర ప్రభుత్వం రాష్ట్రాలను అనుసంధానం చేసుకుంటూ ప్రజలకు నేరుగా ప్రయోజనం చేకూర్చే లక్ష్యంతో ఇ-రేషన్‌కు శ్రీకారం చుట్టారు. ఇప్పటికే దేశంలోని చాలా రాష్ట్రాల్లో అమల్లోకి వచ్చిన ఈ కార్డు త్వరలో తెలంగాణ రాష్ట్రంలో కూడా మొదలు కానుంది. అన్ని రకాల డేటా నేడు అందుబాటులోకి వచ్చిన నేపథ్యంలో రేషన్‌ను కూడా డిజిటలైజేషన్ చేస్తున్నారు. ప్రజాపంపిణీ వ్యవస్థ(పిడిఎస్) కింద ఆహార ధాన్యాలు, ఇతర నిత్యవసర వస్తువులు సులభంగా పొందేందుకు ఇ-రేషన్ ఉపయోగపడనుంది. తెలంగాణ రాష్ట్రంలో ప్రధానంగా బియ్యం, చెక్కర వంటివి అందిస్తున్నారు. రాబోయే రోజుల్లో బియ్యం, పప్పు, వంట నూనె, గోధుమలతో పాటు మొత్తం 8 రకాల నిత్యావసర సరుకులు అందించేందుకు రంగం సిద్ధమవుతోంది. ఈ ఇ-కార్డును ఆన్‌లైన్ లేదా మేరా రేషన్ 2.0 యాప్ ద్వారా సులువుగా డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. దేశ వ్యాప్తంగా ప్రజలు ఈ యాప్‌ను డౌన్ లోడ్ చేసుకునేందుకు సేవలను మరింత వేగవంతం చేశారు. దీనిని 2.0 వెర్షన్ నుండి మరింత సాంకేతికత జోడించి అభివృద్ధి పరిచేందుకు సన్నాహాలు సాగుతున్నట్లు తెలుస్తోంది. ఇలాంటి సేవల ద్వారా ఫిజికల్ రేషన్ కార్డు పోయినప్పటికీ ఇ-వాలెట్‌లో భద్రంగా ఉండనుంది.

**ఎడిట్ ఆప్షన్ మన చేతుల్లోనే...** ఇ-రేషన్ కార్డు ఎడిట్ ఆప్షన్ నేరుగా కార్డు హోల్డర్ చేతుల్లోనే ఉండనుంది. పేరు జోడించాలన్నా, తొలగించాలన్నా స్వయంగా చేసుకోవచ్చు. గతంలో మాదిరిగా దరఖాస్తు చేసుకుని ఏళ్లపాటు వేచి చూడాల్సిన అవసరం ఉండదు. ఒకసారి కార్డు జారీ అయిన తర్వాత దీనిపై మన పెత్తనం తప్ప ఎవ్వరి పెత్తనం ఉండదు. మరో ప్రక్క వ్యక్తిగత సమాచారాన్ని కూడా అప్‌లోడ్ చేసుకోవచ్చు. రేషన్ సమాచారాన్ని ఎప్పటికప్పుడు తెలుసుకోవచ్చు. ఫలానా రేషన్ షాపుకు స్టాక్ ఎంత వచ్చింది. ఎంత పోయింది. ఎంత మిగిలిందో కూడా తెలుసుకునే అవకాశం ఉంటుంది.

## కళాశాలకు పూర్వ విద్యార్థుల వితరణ

ప్రజాపక్షం/సత్తుపల్లి : పట్టణంలోని శ్రీ బండి శోభనాచలం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 1972 సంవత్సరములో విద్య నభ్యసించిన పూర్వ విద్యార్థులు 52 సంవత్సరముల తర్వాత ఆదివారం ఆత్మీయ సమ్మేళనాన్ని నిర్వహించుకున్నారు. మొత్తం 51 మంది విద్యార్థులకుగాను 18మంది దివంగతులు కాగా వారికి స్నేహితులు నివాళులర్పించారు. ఈ అపూర్వ కలయికలో ప్రభాకర్‌రావు, చంద్రశేఖర్‌రావు, బాస్కర్ రెడ్డి, రఘుపతిరెడ్డి, సత్యనారాయణ రెడ్డి, దేవరాజు కేశవరావు, కుమారస్వామి, కిషోర్‌కుమార్‌రెడ్డి, లక్ష్మ ణచార్యులు, మస్తాన్ అలి, సుధాకర్, సుబ్రమణ్యశాస్త్రి, సుబ్బారావు, పుల్లారెడ్డి, సుందరయ్య, సంజీవరావు, మాదిరాజు వెంకటేశ్వరరావు, అల్లూరి వెంకటేశ్వరరావు, వెంకటేశ్వరరావు, వీరభద్రం, యేసుపాదం, రామచంద్రుడు తదితరులున్నారు. అదేవిధంగా వారి బ్యాచ్ గుర్తుగా కాలేజీకి రూ.10 వేల విలువ గల ప్రింటర్‌ను వితరణగా అందజేశారు.



## కల్యాణ లక్ష్మి చెక్కులు అందజేత



ప్రజాపక్షం/ నాగారం: కల్యాణ లక్ష్మి, షాదీముబారక్ చెక్కులు పేద ప్రజలకు ఎంతగానో ఉపయోగపడతాయని మున్సిపల్ చైర్మన్ కౌకుట్ల చంద్రారెడ్డి అన్నారు. ఆదివారం నాగారం మున్సిపాలిటీకి చెందిన 25మందికి కల్యాణలక్ష్మి, షాదీ ముబార్ లబ్ధిదారులకు చెక్కులను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంఆర్ఒ, వైస్ చైర్మన్ మల్లేష్‌యాదవ్, నాయకులు శ్రీనివాస్‌రెడ్డి, రవీందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# మహానగరి

## అయ్యప్ప పూజలో ఎమ్మెల్యే, కార్పొరేటర్

ప్రజాపక్షం/చర్లపల్లి: చర్లపల్లి రామాలయంలో అయ్యప్ప సేవా సమితి గురుస్వాములు రుద్రగోని వెంకటేశం, బొజ్జ నర్సింహల ఆధ్వర్యంలో 33వ అయ్యప్ప మహాపడి పూజ గురుస్వాములు నరేందర్,మురళీకృష్ణలు పూజ ఘనంగా నిర్వహించారు. ఈ పూజా కార్యక్రమానికి ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి, స్థానిక కార్పొరేటర్ బొంతు శ్రీదేవిలు విచ్చేశారు. అనంతరం అన్న ప్రసాద వితరణ కార్యక్రమం చేశారు. ఈ కార్యక్రమంలో రుద్రగోని రాంచందర్‌గౌడ్, నేమూరి మహేష్‌గౌడ్, జె ప్రభాకర్ రెడ్డి, బి బాలయ్య, జె సత్తిరెడ్డి, జె సంజీవరెడ్డి, శశికాంత్, జి రమేష్, బీరప్ప, అనిల్, భాను, బి ప్రేమ్, స్వాములు తదితరులు పాల్గొన్నారు.

## విగ్రహ ప్రతిష్ట పనులు ప్రారంభం



ప్రజాపక్షం/చర్లపల్లి: చర్లపల్లి డివిజన్ పరిధిలోని పెద్ద చర్లపల్లి చౌరస్తాలో మాదిగ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో అంబేద్కర్, బాబు జగ్జీవన్‌రామ్ విగ్రహ ప్రతిష్ట పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా పలువురు సంక్షేమ సంఘం ప్రతినిధులు మాట్లాడుతూ వచ్చే అంబేద్కర్ జయంతి వరకు విగ్రహ ప్రతిష్ట కార్యక్రమాల పనులను పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటామని వారి ఆశయ సాధన కోసం అన్ని వర్గాల వారు కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సంఘం ప్రతినిధులు కడియాల జనార్ధన్, కడియాల యాదగిరి, కొమ్ము నర్సింగ్, గిరిబాబు, రమేష్, కుమార్, నాగేష్, అనిల్, సురేష్, కృష్ణ, పి శ్రీనివాస్, భరత్‌రాజ్, నందకిషోర్, పవన్ తదితరులు పాల్గొన్నారు.

## సూర్యప్రభ వాహనంపై శ్రీవారి ఊరేగింపు



ప్రజాపక్షం/అల్వాల్: అతి పురాతన దేవాలయం దక్షిణ తిరుపతిగా పిలవబడే శ్రీబాలాజీ వేంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలు దేవుని అల్వాల్‌లో అంగరంగ వైభవంగా కొనసాగుతున్నాయి. అందులో భాగంగా ఆదివారం ప్రత్యేక హోమాలు నిర్వహించి శ్రీవారిని సూర్యప్రభ వాహనంపై పురవీధులలో ఊరేగింపు నిర్వహించారు. పెద్ద మొత్తంలో భక్తులు స్వామివారి కృపకు పాత్రులు కావాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆలయ సిబ్బంది వెంకటరెడ్డి, స్వామి, శ్రీకాంత్, యాగ్నికుడు విజయ సారథి, ఆలయ అర్చకులు రఘువంతులు, వంశీ పంతులు, శ్రీనివాస్ పంతులు రమణ పంతులు, రాజు, సామాజిక సేవా కర్తలు శివరామకృష్ణ, వెంకటరామిరెడ్డి, సురేందర్ రెడ్డి, రామచందర్ రావు,వంశీ,భక్తులు పాల్గొన్నారు.

## నవాబుపేట మండల టిఎస్‌యుటిఎఫ్ మండల నూతన కమిటీ ఎన్నిక



ప్రజాపక్షం/నవాబుపేట్ :ఒక్కరికోసం అందరంఅందరి కోసం ప్రతిఒక్కరం ఉపాధ్యాయ కుటుంబాల సంక్షేమం కోసం పాటుపడుదామని మండల టిఎస్‌యుటిఎఫ్ మండల అధ్యక్షుడు కొత్తగాడి రవీంధర్ అన్నారు. శనివారం నవాబుపేట్ టీఎస్ యుటి ఎఫ్ మండల సర్వ సభ్య సమావేశం జరిగింది. ఈ సమావేశంలో మండల అధ్యక్షునిగా గుల్లగూడ ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు కె.రవీందర్, ప్రధాన కార్యదర్శిగా నవాబుపేట్ మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలస్కూల్ అసిస్టెంట్ బి.పరమేశ్వర్ ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగింది. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షులు వెంకట రత్నం మాట్లాడుతూ టిఎస్ యుటిఎఫ్ ఉపాధ్యాయుల, విద్యారంగా సమస్యల పరిష్కారం లో ముందంజలో ఉంటుందని తెలియజేశారు. నూతన కమిటీకి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ మండల టిఎస్ యుటిఎఫ్ అధ్యక్షులు రవీందర్, ప్రధాన కార్యదర్శి బి.పరమేశ్వర్ మాట్లాడుతూ, మండల ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి తమ వంతు కృషి చేస్తామని చెప్పారు. ఉపాధ్యాయ ఫెడరేషన్ భావజాలాన్ని పెంపొందిస్తామని, విద్యా వ్యవస్థలో అవినీతి నిర్మూలనకు కృషి చేస్తామని వెల్లడించారు. ఈ కార్యకమంలో జిల్లా కార్యదర్శి పవన్ కుమార్, రాష్ట్ర సెక్రెటరి బాబురావు, వికారాబాద్ మండల అధ్యక్షులు రాములు, అశోక్ వెంకటయ్య, శేఖర్, కృష్ణయ్యలు పాల్గొన్నారు.

## స్త్రీలు దేవలతో సమానం

### దళిత మహిళలకు పాదపూజ చరిత్రలోనే ప్రథమం

ప్రజాపక్షం/తాండూరు: సృష్టిలో స్త్రీలు దేవలతో సమానమని, సనాతన ధర్మంలో జాతి, కుల విభేదాలు లేవని పలువురు స్వామీజీలు పేర్కొన్నారు. ఆదివారం తాండూరు పట్టణంలోని తులసి గార్డెన్‌లో శ్రీమాణికేపస మహాసంస్థానము పీఠాధిపతి తెలంగాణ సాదు పరిషత్ రాష్ట్ర అధ్యక్షులు శ్రీ శ్రీ శంకర్ స్వామిజీ ఆధ్వర్యంలో చరిత్రలోనే ప్రప్రథమంగా దళిత సామాజిక వర్గానికి చెందిన 108మంది సువాసీనుల మత్తదువులులకు పాజపూజ చేశారు. ఈ కార్యక్రమానికి గంగాపురం శ్రీ క్ష్మి నారాయణ ఆశ్రమం స్వామీజి పరమాత్మ నందగిరి స్వామీ, నిజామాబాద్ నిర్మలానంద, స్వామీ,భద్రాచలం విశ్వత్మా నందగిరి స్వామిజీ, శ్రీశైలం మౌనస్వామి ఆశ్రమం శివస్వామి, దండోతి జయశ్రీ మాతాజీ గుల్బర్గా ప్రభు శ్రీ తాయి మాజీలు హజరైనారు. వీరి సమక్షంలో శంకర్ స్వామి ముత్తదువులకు పాదపూజ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సనాతన ధర్మంలో కుల, మత, జాతి బేదాలు లేవని, వేద విజ్ఞానం స్త్రీ పురుషులకు సమానంగా దక్కిందన్నారు. వివక్షాలకు తావు లేకుండా జీవించాలని అన్నారు. వేద విజ్ఞానం స్త్రీ, పురుషులకు సమానంగా దక్కిందన్నారు. తాండూరు మున్సిపల్ చైర్‌పర్సన్ స్వప్న పరిమళ్, ఆర్ఎస్ఎస్ సభహ్యులు భాగయ్య, విహెచ్చపి సభ్యులు దేవ్‌జీ రావత్, రామరాజు,జీవిఎస్కెట్ గ్రూప్ ప్రతినిధి డాక్టర్ కిషోర్‌కుమార్, త్యాగరాజు బంటు, వీరారాఘవరెడ్డి, ఏవిఎస్ తెలంగాణ సేక్రటరీ డాక్టర్ రొంపల్లి సంతోష్‌కుమార్, బస్వరాజ్ , ఆధ్యాత్మి ప్రతినిధులు, మహిళలు, భక్తులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ ప్రజాపాలనలో ప్రజలందరూ సుభిక్షంగా ఉండాలి



ప్రజాపక్షం/వికారాబాద్ ప్రతినిధి: వికారాబాద్ మున్సిపల్ అలంపల్లిలో క్రాంతి యువజన సంఘం ఆధ్వర్యంలో నూతనంగా నిర్మించిన కమ్యూనిటీ హాల్‌ను ప్రారంభించిన వికారాబాద్ పట్టణ అధ్యక్షులు సుధాకర్‌రెడ్డి, ఈ సందర్భంగా మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రజాపాలనలో ప్రజలందరూ సుఖశాంతులతో జీవించాలని అన్నారు. ప్రజలకు ఇచ్చిన హామీ ఆరు గ్యారంటీలను ఒక్కొటిగా అమాలు చేస్తున్న తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, స్పీకర్ ప్రసాద్‌కుమార్ ప్రజలు అందరు అండగా ఉండాలని అన్నారు. వికారాబాద్ నియోజకవర్గం అభివృద్ధి చెందే అవకాశాలు ఉన్నాయని విద్యా, ఉద్యోగ, ఉపాధి రంగాల్లో వికారాబాద్ జిల్లా అభివృద్ధి పథంలో ముందుకు సాగుతుందని కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలు నెరవేర్చి ప్రజల రుణం తీర్చుకుంటామని అన్నారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ రామస్వామి, శ్రీనివాస్ ముదిరాజు, నాగేష్, నాగరాజు, శ్రీనివాస్, గోపాల్, యాదయ్య, మహేందర్, అంజయ్య తదితరులు పాల్గొన్నారు.

## ప్రజా విజయోత్సవాల వేడుకలకు 'జలమండలి' తాగునీటి శిబిరాలు

### హుస్సేన్ సాగర్ చుట్టూ 45 వాటర్ క్యాంపులు
### తనిఖీ చేసిన జలమండలి ఎం.డి. అశోక్ రెడ్డి




ప్రజాపక్షం/హైదరాబాద్ : ప్రజా పాలన ప్రజా విజయోత్సవాల ముగింపు వేడుకలకు తిలకించేందుకు వచ్చే ప్రజలకు కోసం జలమండలి ఏర్పాటు చే సిన తాగునీటి శిబిరాలను ఆదివారం ఎం.డి. అశోక్ రెడ్డి, ఈ.డి. మయాంక్ మిట్టల్‌తో కలిసి తనిఖీ చేశారు. ఇందులో భాగంగా ఐమాక్స్, ట్యాంక్ బండ్, నెక్లెస్ రోడ్, పీపుల్స్ ప్లాజా పరిసరాల్లో ఉన్న శిబిరాలకు వెళ్లిన ఆయన అక్కడి ఏర్పాట్లు పరిశీలించారు. నీటి నాణ్యత, క్లోరిన్ పరీక్షల వివరాలు అధికారులను అడిగి తెలుసుకుని వాటిపై సంతృప్తి వ్యక్తం చేశారు. ఆయన మాట్లాడు తూ మొదటగా 40 శిబిరాలు ఏర్పాటు చేసి తాగునీటి వసతి కల్పించామన్నా రు. ప్రజల తాకిడి దృష్ట్యా మరో 5 కొత్త తాగు నీటి శిబిరాలు ఏర్పాటు చేశామన్నారు. రద్దీని బట్టి అవసరమైతే మరింత తాగునీరు అందించడానికి సిద్ధం గా ఉన్నామన్నారు. గత రెండు రోజులగా ఇప్పటికే 6 లక్షల మంచినీటి ప్యాకెట్లను బాటసారులకు అందించామని, వీటితో పాటు వాటర్ బాటిళ్లు, డ్రమ్ము ల్లో సైతం మంచినీటిని అందులోబాటులో ఉంచామన్నారు. చివరి రోజు సోమవారం ముగింపు వేడుకలకు కోసం మరో 3 లక్షల మంచినీటి ప్యాకెట్లను సిద్ధం చేసినట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్ ఆపరేషన్1 అమరేందర్ రెడ్డి, సిజిఎం ప్రభు జిఎంలు, బ్రిజేష్,దామోదర్ రెడ్డి, హరి శంకర్, ప్రభాకర్, జాన్ షరీఫ్, వినోద్, సాయి రమణ డిజిఎంలు మేనేజర్లు పాల్గొన్నారు.

## గంజాయి పట్టివేత



ప్రజాపక్షం/హైదరాబాద్: మంగళ్‌హాట్ ప్రాంతంలో వేరు వేరు చోట్ల ఎక్సైజ్ పోలీసులు జరిపిన దాడుల్లో 3.342 కేజిల గంజాయిని స్వాధీ నం చేసుకుని ఇద్దరిని అరెస్టు చేశా రు. దూల్‌పేట్ ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్‌లు మధుబాబు, గోపాల్‌ల కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. రాజాసింగ్, రాహుల్‌సింగ్‌లు గంజాయి విక్రయిస్తున్నారనే సమాచారం అందుకున్న దూల్‌పేట్ ఎక్సైజ్ ఎస్ ఐ సైదులు, హెడ్ కానిస్టేబుళ్లు భా స్కర్, అజీమ్, శ్రీధర్, కానిస్టేబుళ్లు ప్రకాష్, రాకేష్, మహేష్ లు వరుస దాడులు నిర్వహించారు. మంగళ్‌హాట్‌లో రాజాసింగ్ వద్ద నుంచి 1.234 కెజిలు, అల్జీపూర్‌లో రాహుల్‌సింగ్ వద్ద నుంచి 2.1 కెజిల గం జాయిని స్వాధీనం చేసుకున్నారు.

వీరిద్దరిని అరెస్టు చేయగా రాహుల్ సింగ్, మా నస, విశాల్ సింగ్, రా హుల్ పరారీలో ఉన్నారు. ఉన్నట్లు ఎక్సైజ్ సూపర్డెంట్ ఎస్టిఎఫ్ టీం లీడర్ అంజిరెడ్డి తెలిపారు.

## ఓయు 'లా' కళాశాల నూతన ప్రిన్సిపాల్, డీన్‌లకు ఘన సన్మానం



ప్రజాపక్షం /హైదరాబాద్ : ఉస్మానియా యూనివర్సిటీ లా కళాశాల నూతన ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ రాంప్రసాద్ ను, నూతన లా కళాశాల డిన్ విజయలక్ష్మి ని ఒయు మాజీ జాయింట్ రిజిస్టర్ ఉప్పరి ఎల్లేష్ ఘనంగా సన్మానం చేశారు. ఈ సందర్భంగా ఉప్పరి ఎల్లేష్ మాట్లాడుతూ పివి నరసింహారావు మొదలుకొని అనేకమంది రాజకీయ నాయకులు మేధావులు ఒయు లా కళాశాలలో చదవి పట్టా పొందాలని తెలిపారు. అంతటి చరిత్ర కలిగిన ఉస్మానియా యూనివర్సిటీ లా కళాశాలకు 100 ఏళ్ల ఉస్మానియా యూనివర్సిటీ చరిత్ర కలిగిన లా కళాశాలకు ప్రిన్సిపాల్ గా,డిన్ గా నియమించబడిన ప్రొఫెసర్ రాంప్రసాద్, ప్రొఫెసర్ విజయలక్ష్మి మరింత సేవ చేయడానికి అవకాశం లభించిందని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎఐఎస్ఎఫ్ ఉస్మానియాయూనివర్సిటీ అధ్యక్షుడు లెనిన్, సాయి పాల్గొన్నారు.

## విద్యుత్ సబ్‌స్టేషన్ నిర్మాణ పనులలో నాణ్యత పాటించాలి:ఎమ్మెల్యే బుయ్యని



ప్రజాపక్షం/పెద్దేముల్: విద్యుత్ సబ్‌స్టేషన్ నిర్మాణం పనులలో నాణ్యతను పాటించాలని తాండూరు ఎమ్మెల్యే బుయ్యని మనోహర్‌రెడ్డి అధికారులను,కాంట్రాక్టులను ఆదేశించారు. ప్రజాపాలన విజయోత్సవాల్లో భా గంగా పెద్దేముల్ మండల పరిధి కందనెల్లి గ్రామంలో నిర్మాణంలో ఉన్న 33/11కేవి విద్యుత్ సబ్‌స్టేషన్ పనులను ఎమ్మెల్యే పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సబ్ స్టేషన్ నిర్మాణం పనులను శరవేగంగా కొనసాగించాలని అధికారులకు సూచించారు. సబ్ స్టేషన్ పనులు త్వరిత గతిన పూర్తి చేస్తే విధ్యుత్ సమస్యలు లేకుండా పోతాయని అన్నారు. సబ్ స్టేషన్ నిర్మాణం పనులను మరింత త్వరిత గతిన చేపట్టాలని అధికారులను ఆదేశించారు. టిపిసిసి ప్రధాన కార్యదర్శి ధారాసింగ్, మార్కెట్ కమిటీ చైర్మన్ అంజయ్య, వైస్ చైర్మన్ నారాయణరెడ్డి, వైస్ ఎంపిపి మధులత శ్రీనివాస్ చారి, నాయకులు మహిలపాల్‌రెడ్డి, అధికారులు ఉన్నారు.

## మంచు మనోజ్‌కు కాలికి గాయం..

### కుటుంబ తగాదాలేనని అనుమానం
### పోలీసులకు అందని ఫిర్యాదు



ప్రజాపక్షం/హైదరాబాద్: సినీ నటుడు మంచు మనోజ్ గాయపడ్డాడు. ఆయన కాలికి గాయం కావడంతో బంజారాహిల్స్‌లోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి చికిత్స నిమిత్తం వచ్చారు. ఆస్పత్రి వైద్యులు మనోజ్‌కు పరీక్షలు నిర్వహించారు. ఆయన వెంట సతీమణి మౌనిక కూడా ఉన్నారు. సమాచారం తెలుసుకున్న మీడియా వర్గాలు ఆస్పత్రి చేరుకుని మనోజ్‌ను ప్రశ్నించగా దంపతులు స్పందించలేదు. ఆస్తుల విషయంలో మోహన్‌బాబు ఆయన తనయుడు మనోజ్ మధ్య గొడవ జరిగిందని, ఒకరిపై ఒకరు పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేసుకున్నారంటూ ఆదివారం ఉదయం వార్తలు వచ్చాయి. మనోజ్ గాయాలతో వచ్చి మరీ ఫిర్యాదు చేశారని ప్రచారం జరిగింది. ఈ నేపథ్యంలో మోహన్‌బాబు కుటుంబం స్పందించింది. అసత్య ప్రచారాలు చేయొద్దంటూ మీడియాకు సూచించారు. ఈ క్రమంలో సాయంత్రం మనోజ్ కాలి గాయంతో ఆస్పత్రికి రావడంతో అటు ఇండస్ట్రీలో, ఇటు మీడియాలోను మరోసారి చర్చనీయాంశమైంది. మరోవైపు మంచు మోహన్‌బాబు, మంచు మనోజ్‌లు పరస్పరం ఒకరిపై ఒకరు డయల్ 100 ద్వారా ఫిర్యాదు చేశారని పోలీసులు చెప్పడం గమనార్హం. స్టేషన్‌కు వచ్చి ఫిర్యాదు చేయాలని ఇరువురికి సూచించామని పోలీసులు తెలిపారు.

## కాంగ్రెస్ సర్కార్‌తోనే పేదల సంక్షేమం

### తాండూరు ఎమ్మెల్యే బుయ్యని మనోహర్‌రెడ్డి



ప్రజాపక్షం/పెద్దేముల్ : కాంగ్రెస్ సర్కార్‌తోనే పేదల సంక్షే మం, గ్రామాల అభివృద్ధి సాధ్యమని తాండూరు ఎమ్మెల్యే బుయ్యని మనోహర్‌రెడ్డి అన్నారు. ప్రజాపాలన విజయోత్సవ కార్యక్రమంలో భాగంగా ఆదివారం పెద్దేముల్ మండల పరిధి కందనెల్లి, మంబపూర్, మన్‌సాన్‌పల్లి తదితర గ్రామాలలో పర్యాంటించిన ఎమ్మెల్యే ఎంజిఎన్ఆర్ఈజిఎస్ పథకంలో మంజూరైన సిసి రోడ్డు, సైడ్రేన్ నిర్మాణానికి శంఖుస్థాపనలు చేశా రు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ తాండూరు అభివృద్ధికి రూ.600 కోట్ల నిధులు తీసుకవచ్చి ఏడాది కాలంలోనే రోడ్ల నిర్మాణానికి అధిక ప్రాధాన్యతను ఇస్తున్నామని అన్నారు. విద్య, వైద్యానికి కాంగ్రెస్ ప్రభుత్వం పెద్ద పీఠం వేస్తుందన్నారు. తాండూరు నియోజకవర్గానికి ఇంటిగ్రేటె డ్ స్కూల్ తీసుకవచ్చిన ఘనత సిఎం రేవంత్‌రెడ్డికే దక్కిదన్నారు. వ్యవసాయరంగానికి అధిక ప్రధాన్యతను ఇచ్చేందుకు గాను తాండూరు ప్రాంతంలోని కోట్‌పల్లి, జుంటుపల్లి ప్రాజెక్టులకు మరమ్మత్తులకు నిధులకు ప్రతిపాధనలు పంపామన్నారు. పదేళ్ల రాష్ట్రాన్ని పాలించిన బిఆర్ఎస్ సర్కార్ రాష్ట్రాన్ని దోచుకున్నారని, రాష్ట్రం అప్పులు పాలైందన్నారు. ఈ కార్యక్రమంలో టిపిసిసి ప్రధాన కా ర్యదర్శి ధారాసింగ్, మార్కెట్ కమిటీ చైర్మన్ అం జయ్య, వైస్ చైర్మన్ నారాయణ రెడ్డి, నాయకులు మహిపాల్‌రెడ్డి, మాజీ వైస్ ఎంపిపి మధులత శ్రీనివాస్‌చారి,మాజీ సర్పంచ్ మోహన్‌రెడ్డి, మధుసుధన్‌రెడ్డి, మహిళ నాయకురాలు శోభరాణి, మైనార్టీ నాయకులు రీజయాజ్, కిరణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## ముగిసిన రాష్ట్ర స్క్వాష్ ఛాంపియన్‌షిప్ -2024

ప్రజాపక్షం/హైదరాబాద్ : తెలంగాణ స్క్వాష్ రాకెట్స్ అసోసియేషన్ , గేమ్ పాయింట్ సంయుక్తంగా ఆధ్వర్యంలో హైటెక్ అరేనాలో ఈ నెల 6 నుండి 8 వరకు మూడు రోజుల పాటు నిర్వహించిన రాష్ట్ర స్క్వాష్ ఛాంపియన్‌షిప్ 2024 ఘనంగా ముగిసింది. అద్భుతమైన ప్రతిభను, ఉత్కంఠభరితమైన మ్యాచ్‌ను ప్రదర్శించిన ఈ టోర్నమెంట్‌లో 8విభాగాల్లో 90 మంది పాల్గొన్నారు. ఈ పోటీల్లో బాలుర అండర్ –13 విభాగంలో తనుజ్‌రెడ్డి విజయం సాధించగా, కొండపర్తి ప్రభాస్ రన్నర్ అప్‌గా నిలించారు. బాలికలు అండర్ –15 విభాగంలో విజేతగా అర్నా ద్వివేది, రన్నర్‌ఆప్‌గా గంజి ధృతి, బాలుర అండర్ –17 విభాగంలో విజేతగా రాజ్‌వీర్ గ్రోవర్, రన్నర్‌అప్ రోహన్‌లు నిలిచారు. పురుషుల విభాగం విజేతగా కరణ్ వశిష్ట్, రన్నర్‌ఆప్‌గా రణవీర్ గ్రోవర్, మహిళాల విభాగంలో విజేతగా ఆర్య ద్వివేది, రన్నర్‌అప్‌గా సాన్విశ్రీ నిలిచారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా విచ్చేసిన తెలంగాణ బాక్సింగ్ అసోసియేషన్ అధ్యక్షులు బాబురావు, తెలంగాణ స్క్వాష్ రాకెట్ అసోసియేషన్ ఉపాధ్యక్షులు శ్రీశైలం విజేతలకు బహుతులను ప్రధాన చేశారు.

## ప్రజాప్రయోజనాలకే ప్రభుత్వ స్థలాలు

ప్రజాపక్షం/ నిజాంపేట్ : ప్రభుత్వ స్థలాలను ప్రజాప్రయోజనాలకు కేటాయించాలని బాచుపల్లి బిజెపి అధ్యక్షుడు ప్రసాద రాజు డిమాండ్ చేశారు. కుత్బుల్లాపూర్ నియోజకవర్గం పరిధిలోని నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ బాచుపల్లి 18వ డివిజన్ నందన వనం కాలనీలో బిజెపి నాయకులు, కార్యకర్తలు పాదయాత్ర చేశారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న బాచుపల్లి బిజెపి అధ్యక్షుడు ప్ర సాద రాజు మాట్లాడుతూ నందనవనం కాలనీలో రోడ్లు అధ్వాన్నంగా ఉన్నాయని, పార్కుల నిర్వహణ అసలే లేదని అన్నారు. వాటర్ ట్యాంక్ ఉన్న ప్రదేశంలోని స్థ లాన్ని కాపాడాలని, ఇబ్బడి ముబ్బడిగా అనుమతులు లేకుండా బహుళ అంతస్థుల భవనాలు వెలుస్తున్నాయని తెలిపారు. స్థానిక కాలనీలో ప్రజలకు కావాల్సిన వసతులను కల్పించడంలో అధికారులు పూర్తిగా విఫలమయ్యారని ఆరోపించారు. కార్పొరేషన్ అధికారులు తక్షణమే స్పందించి ప్రజలకు కావాల్సిన కనీస వసతులను కల్పించాలని, అవసరమైతే స్థానిక ఎంపి ఈటెల రాజేందర్ దృష్టికి తీసుకువెళ్లి సమస్యలను పరిష్కరించే విధంగా కృషి చేస్తానని పేర్కొన్నారు. కార్యక్రమంలో బిజెపి నాయకులు రెపన్ కాశి, భిక్షపతి యాదవ్, నరేంద్ర చౌదరి, శివప్రసాద్, శ్రీనివాస గుప్త, సచిన్, సంతోష్, నారాయణ మూర్తి, శివకుమార్, దాసి నాగరాజు, గజ్జల సంతోష్, రవి యాదవ్, పద్మ ప్రసాద్, నరసింహా రెడ్డి, అనిరుద్, ప్రహ్లాద్, గోపాల కృష్ణం రాజు, కిరన్ పాల్గొన్నారు.

## కొడుకును చంపి తల్లి ఆత్మహత్య

### బావిలో తోసి తానూ దూకిన వైనం



ప్రజాపక్షం/నవాబుపేట్ :కొడుకును బావిలో తోసేసి తాను ఆత్మహత్య చే సుకుందో తల్లి గమనించిన కూతురు పారిపోయి ప్రాణాలు దక్కించుకుం ది. నవాబుపేట్ ఎస్సై అరుణ్ కుమార్ తెలిపిన వివరాల ప్రకారం... నవాబుపేట మండలం గేటు వనంపల్లి గ్రామానికి చెందిన గుల్ల శేఖర్, అరుంధ (32) దంపతులు వ్యవసాయం చేస్తూ జీవనం సాగిస్తున్నారు. వీరికి కొ డుకు గుల్ల రుత్విక్ (7), కూతురు ప్రజ్వల ఉన్నారు. ఆదివారం అరుంధ కొడుకు, కూతురును తీసుకొని గ్రామంలోని ఓ వ్యవసాయ బావి వద్దకు వెళ్లింది. ఎందుకు వచ్చామని కూతురు అడగడంతో చనిపోతున్నామని చెప్పింది. దీంతో కూతురు ఊర్లోకి పారిపోయింది. తర్వాత కొడుకును బావిలో తోసేసి తర్వాత కూడా తాను దూకి ఆత్మహత్య చేసుకుంది. గ్రామస్తుల ద్వారా సమాచారం అందుకున్న పోలీసులు వెంటనే ఘటనా స్థలాని కి వెళ్లి మృతదేహాలను బయటకి తీశారు. విషయం తెలుసుకున్న స్థానిక ఎ మ్మెల్యే కాలే యాదయ్య బాధిత కుటుంబాన్ని పరామర్శించి అంత్యక్రియల కోసం ఆర్థిక సాయం అందజేశారు. మహిళా కాంగ్రెస్ రంగారెడ్డి జిల్లా వైస్ ప్రెసిడెంట్ జ్యోతి భీమ్ భరత్‌బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

## శబరిమలకు అదనపు ప్రత్యేక రైళ్లు



హైదరాబాద్ : శబరిమల అయ్యప్పస్వామి దర్శనానికి వెళ్లే భక్తులకు గుడ్‌న్యూస్. భక్తుల రద్దీ దృష్ట్యా తెలుగు రాష్ట్రాల నుంచి ఇప్పటికే పలు రైళ్లు నడుపుతోన్న దక్షిణ మధ్య రైల్వే.. తాజాగా జనవరి మాసంలో ప్రత్యేకంగా 34 అదనపు సర్వీసులు నడపాలని నిర్ణయించింది. హైదరాబాద్ – కొట్టాయం; కొట్టాయం – సికింద్రాబాద్ష మౌలాలి – కొట్టాయం; కాచిగూడ – కొట్టాయం, మౌలాలి – కొల్లం మధ్య జనవరి 3 నుంచి ఫిబ్రవరి 1వరకు ఈ ప్రత్యేక రైళ్లు సర్వీసులందించనున్నాయి.

**ఈ రూట్లలోనే సర్వీసులు..**

హైదరాబాద్– కొట్టాయం – సికింద్రాబాద్ ప్రత్యేక రైళ్లు (07065/07066) బేగంపేట, లింగంపల్లి, శంకర్‌పల్లి, వికారాబాద్, తాండూరు, సేలం, సులేహల్లి, యాద్గిర్, కృష్ణ, రాయ్‌చూరు, మంత్రాలయం, ఆదోని, గుంతకల్, గుత్తి, యర్రగుంట్ల, కడప, రాజంపేట, రేణిగుంట, కాట్పాడి, జోలర్‌పెట్టై, సేలం, ఈరోడ్, తిరుప్పూర్, కోయంబత్తూర్, పాలక్కడ్, త్రిశ్శూర్, అలువ, ఎర్నాకుళం టౌన్ స్టేషన్ల మీదుగా మంగళ, బుధ వారాల్లో మొత్తంగా ఎనిమిది సర్వీసులుందించనున్నాయి. మౌలాలి–కొట్టాయం–సికింద్రాబాద్ (07167/07168) ప్రత్యేక రైళ్లు చర్లపల్లి, నల్గొండ, మిర్యాలగూడ, నడికుడి, పిడుగురాళ్ల, సత్తెనపల్లి, గుంటూరు, తెనాలి, చీరాల, ఒంగోలు, నెల్లూరు, గూడూరు, రేణిగుంట, కాట్పాడి, జోలర్‌పెట్టై, సేలం, ఈరోడ్, తిరుప్పూర్, కోయంబత్తూర్, పాలక్కడ్, త్రిశ్శూర్, అలువ, ఎర్నాకుళం, ఎట్టుమానూర్ స్టేషన్ల మీదుగా శుక్ర, శని వారాల్లో రాకపోకలు సాగించనున్నాయి. కాచిగూడ–కొట్టాయం – కాచిగూడ (071/07170) ప్రత్యేక రైళ్లు మల్కాజ్‌గిరి, చర్లపల్లి, నల్గొండ, మిర్యాలగూడ, నడికుడి, పిడుగురాళ్ల, సత్తెనపల్లి, గుంటూరు, తెనాలి, చీరాల, ఒంగోలు, నెల్లూరు, గూడూరు, రేణిగుంట, కాట్పాడి, జోలర్ పెట్టై, సేలం, ఈరోడ్, తిరుప్పూర్, కోయంబత్తూరు, పాలక్కడ్, త్రిశ్శూరు, అలవు, ఎర్నాకుళం, ఎట్టుమానూర్ స్టేషన్ల మీదుగా ఆది, సోమ వారాల్లో సర్వీసులందించనున్నాయి. మౌలాలి–కొల్లం – మౌలాలి (07170/07172) ప్రత్యేక రైళ్లు భువనగిరి, జనగామ, కాజీపేట, వరంగల్, కేసముద్రం, మహబూబాబాద్, డోర్నకల్, ఖమ్మం, విజయవాడ, తెనాలి, బాపట్ల, చీరాల, ఒంగోలు, నెల్లూరు, గూడూరు, రేణిగుంట, కాట్పాడి, జోలార్‌పెట్టై, సేలం, ఈరోడ్, తిరుప్పూర్, పొదనూరు, పాలక్కడ్, త్రిశ్శూరు, అలవు, ఎర్నాకుళం, ఎట్టుమానూర్, కొట్టాయం, చెంగనస్సేరి, తిరువల్ల, చెంగన్నూర్, కాయంకుళం స్టేషన్ల మీదుగా శని, సోమవారాల్లో రాకపోకలు కొనసాగించనుంది. ఈ రైళ్లలో ఏసీ బోగీలతో పాటు స్లీపర్, జనరల్ కోచ్ లు సైతంఉంటాయనిద.మ.రైల్వే సీపీఆర్వో శ్రీధర్‌తెలిపారు.

## సిఎంఆర్‌ఎఫ్ పేదలకు వరం

**ప్రజాపక్షం/ఇబ్రహీంపట్నం :** సిఎంఆర్‌ఎఫ్ పేదలకు వరమని పోల్కంపల్లి పిఎసిఎస్ మాజీ చైర్మన్ వేముల లక్ష్మణరావు అన్నారు. ఆదివారం మండల పరిధిలో నాగన్‌పల్లి గ్రామంలో ముఖ్యమంత్రి సహాయ నిధి కింద మంజూరైన ఆర్థిక సహాయ నిధులను లబ్ధిదారులు పి.శిరిష, పి.యాదగిరిరావు,ఉమాదేవికి చెక్కులను అంద చేశారు. ఈ సందర్భంగా లక్ష్మణరావు మాట్లాడుతూ నిరుపేదలకు వైద్య ఖర్చుల నిమిత్తం రాష్ట్ర ప్రభుత్వం అందించే ఆర్థిక సహాయాన్ని, సంక్షేమ నిధులను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు కట్ట శ్రీనివాస్, లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు.

# మహానగరి

## వందశాతం కుటుంబ సర్వే పూర్తి

**ప్రజాపక్షం/కొందుర్గు:** కొందుర్గు మండలంలో వందశాతం కుటుంబ సర్వే పూర్తయ్యిందని మండల పంచాయతీ అధికారి లాలాయ్య తెలిపారు. మండల పరిధిలోని 24 గ్రామ పంచాయితీలలో కుటుంబ సర్వే పూర్తి చేయడం జరిగిందన్నారు. మండలంలో మొత్తం 9400 ఇండ్లను గుర్తించగా, 9168 ఇండ్లల్లో సర్వే పూర్తి అయ్యిందని, నవంబర్ 25వ నుంచి ఆన్‌లైన్ నమోదు ప్రక్రియ ప్రారంభం కాగా, డిసెంబర్ 2వ వరకు పూర్తి అయ్యిందన్నారు. ఇంకా ఎవరైనా సర్వే చేయించుకోకుండా మిగిలిపోతే, వారు తనకు గానీ, ఎంపిడిఒకు ఒ ఫోన్ చేసి, వివరాలను తెలుపాలని కోరారు. డోర్ లాక్ ఉన్న వారితో కూడా మాట్లాడి వివరాలను సేకరించడం జరిగిందని తెలిపారు.

## ముఖ్యమంత్రి సహాయనిధితో పేదలకు అధునాతన వైద్యసేవలు

ఎల్‌బి నగర్ ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి



**ప్రజాపక్షం/సరూర్ నగర్:** సిఎం రిలీఫ్ ఫండ్‌తో పేదలకు అధునాతన వైద్యసేవలు లభిస్తున్నాయని ఎల్బీనగర్ ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి అన్నారు. కొత్తపేట డివిజన్ రాజీవ్‌గాంధీ నగర్‌కు చెందిన నర్సింహ్మా ఆరోగ్య సమస్యలతో బాధపడుతున్న నేపథ్యంలో ఆర్థికస్థితులు భాగలేక ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డిని సంప్రదించారు. స్పందించిన సుధీర్‌రెడ్డి ఆపరేషన్‌కు ముఖ్యమంత్రి సహాయనిదికి దరఖాస్తు చేయడం జరిగింది. ఆదివారం రెండు లక్షల రూపాయల ఎల్‌ఒసి చెక్కును ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి అందజేశారు. ఈ సందర్భంగా సుధీర్‌రెడ్డి మాట్లాడుతూ పేదల ఆరోగ్య పరిరక్షణకు సిఎం సహాయనిధి దోహదపడుతుందన్నారు. పేద ప్రజలకు నాణ్యమైన అధునాతన వైద్య సేవలను పొందేందుకు సిఎం సహాయనిది అండగా ఉంటున్నారు. కార్యక్రమంలో మాన్సూరాబాద్ డివిజన్ మాజీ కార్పొరేటర్ కొప్పుల విఠల్ రెడ్డి, రుద్ర యాదగిరినేత పాల్గొన్నారు.

## బిజెపి అంటేనే 'జుమ్లా' పార్టీ

సరూర్‌నగర్ బిజెపి సభ అట్టర్ ఫ్లాప్

టిపిసిసి ప్రచార కమిటీ చైర్మన్ మధు యాష్కీ గౌడ్



**ప్రజాపక్షం/సరూర్ నగర్/ఎల్‌బి నగర్:** బిజెపి అంటేనే జుమ్లా పార్టీ అని, సరూర్ నగర్ స్టేడియంలో నిర్వహించిన బహిరంగ సభకు పోస్టర్లు వెలిసిన అంతా జనం కూడా రాలేదని టిపిసిసి ప్రచార కమిటీ చైర్మన్ మధుయాష్కీ గౌడ్ విమర్శించారు. ఆదివారం ఎల్బీనగర్‌లోని ఓ హోటల్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో రోడ్ అండ్ ట్రాన్స్‌పోర్ట్ కార్పొరేషన్ చైర్మన్ మల్ రెడ్డి రాంరెడ్డి, జిహెచ్‌ఎంసి ఫ్లోర్‌లీడర్ ధర్పల్లి రాజశేఖర్‌రెడ్డి, కార్పొరేటర్ సుజాత నాయక్, ముద్దగొని రామ్మోహన్ గౌడ్‌లతో కలిసి మధు యాష్కీగౌడ్ మాట్లాడారు. బిజెపి జాతీయ అధ్యక్షుడు నడ్డా మాట్లాడుతుంటేనే సభలో 1000 మంది జనం కూడా లేరని ఎద్దేవా చేశారు. ప్రజలతో ఎన్నుకున్న ప్రభుత్వా న్ని విచ్ఛిన్నం చేయాలని బిజెపి అన్ని రాష్ట్రాలలో కుట్రలు చేస్తుందన్నారు. బిజెపిని తెలంగాణలో విశ్వసిస్త లేరన్నారు. కేంద్రమంత్రి కిషన్ రెడ్డికి దమ్ము ధైర్యం ఉంటే కేంద్రం నుంచి నిధులు తీసుకువచ్చి కనీసం తన ఎన్నుకున్న నియోజకవర్గానైన అభివృద్ధి చేయాలన్నారు. ప్రజా ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేస్తుంటే బిఆర్‌ఎస్, బిజెపిలు తప్పుడు ప్రచారాలను చేస్తున్నారన్నారు. వారణాసి, సబర్మతిలపై ఉన్న ధ్యాస మూసీ అభివృద్ధిపై ఎందుకు లేదని బిజెపి నాయకులను ప్రశ్నించారు. మాస్కులు, శానిటైజర్లు, కూలర్ల మధ్యలో మూసీ పక్కన పడుకుంటే అభివృద్ధి కాదన్నారు. 6 గ్యారెంటీలను అమలు చేశామని, వరికి బోనస్ కూడా ఇవ్వడం జరిగిందన్నారు. నాగోల్ నుండి శంషాబాద్ వరకు మెట్రో రైల్ పొడిగింపు ప్రతిపాదనను తీసుకువచ్చిన రేవంత్‌రెడ్డికి ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో డివిజన్ కాంగ్రెస్ అధ్యక్షులు శ్రీపాల్‌రెడ్డి, కుట్ల నర్సింహ యాదవ్, మార్కెట్ కమిటీ డైరక్టర్లు పాశం అశోక్ గౌడ్, నెలపాటి రామారావు, బుడ్డా సత్యనారాయణ, పన్నాల జైపాల్‌రెడ్డి, గణేష్ నాయక్, గౌని నరసింహ గౌడ్, కోటగిరి శ్రీనివాస్, బద్రినాథ్, సంరెడ్డి భుజంగారెడ్డి, బీమిలి రామకృష్ణారెడ్డి, గణేష్‌రెడ్డి కందికంటి శ్రీధర్ గౌడ్, రమేష్, శ్రీనివాస్ గౌడ్, శ్రీపాల్, నరసింహ యాదవ్ , భాస్కర్, జైపాల్ , సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

## సిఎం సహాయనిధితో నిరుపేదలకు ఆర్థిక భరోసా

**ప్రజాపక్షం/ఎల్‌బి నగర్:** సిఎం సహాయనిధి పేదలకు వరమని టిపిసిసి ప్రచార కమిటీ చైర్మన్ మధుయాష్కీ గౌడ్ అన్నారు. హస్తినాపురం డివిజన్ నందనవనం కాలనీ చెందిన రిజ్వాన్‌ఖాన్ అనారోగ్యంతో బాధపడుతూ ఆర్థిక పరిస్థితుల కారణంగా ముఖ్యమంత్రి సహాయనిధికి దరఖాస్తు చేసుకోగా మంజూరైన 2లక్షల 50వేల రూపాయల ఎల్‌ఓసిని ఆదివారం రాష్ట్ర రోడ్డు డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్ మల్‌రెడ్డి రామ్‌రెడ్డి, గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ ఫ్లోర్ లీడర్ ధర్పల్లి రాజశేఖర్‌రెడ్డి, ఎల్‌బి నగర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ నాయకులు ముద్దగొని రామ్మోహన్ గౌడ్, హస్తినాపురం డివిజన్ కార్పొరేటర్ బానోతు సుజాత నాయక్, కాంగ్రెస్ నాయకులు గోపిరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి సమక్షంలో బాధితుడికి అందజేశారు. ఈ సందర్భంగా మధుయాష్కీ గౌడ్ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత అనేక మందికి ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా మంజూరైన చెక్కులు, ఎల్‌ఓసిలను పంపిణీ చేసినట్లు తెలిపారు. ముఖ్యమంత్రి సహాయనిధి పేద ప్రజలకు ఎంతో ఉపయోగపడుతుందన్నారు.



## తెలంగాణ సమాజానికి కెసిఆర్ కుటుంబం క్షమాపణ చెప్పాలి

బిసి సేన జాతీయ అధ్యక్షుడు బర్క కృష్ణ



**ప్రజాపక్షం/కొత్తూరు:** తెలంగాణ సమాజానికి మాజీ ముఖ్యమంత్రి కెసిఆర్ కుటుంబం క్షమాపణ చెప్పాలని బిసి సేన జాతీయ అధ్యక్షుడు బర్క కృష్ణ డిమాండ్ చేశారు. ఆదివారం షాద్‌నగర్‌లో మీడియా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా బర్క కృష్ణ మాట్లాడుతూ మంచికి మారుపేరైన బిసిల బిడ్డలను తిడితే సహించేది లేదన్నారు. బిఆర్‌ఎస్ పార్టీ పదేళ్ల పాటు ఎంత అరాచకం చేశారో తెలంగాణ ప్రజలందరికీ తెలుసన్నారు. ఆవేశంతో మాట్లాడిన మాటలను ట్రోల్ చేసి విమర్శలు దారి చేసే విధంగా కుట్రలు చేయడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. బడుగు బలహీన వర్గాల బిసి నేత ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేయడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. కులవృత్తులు మరిచిపోయి కంప్యూటర్ల కాలంలో గొర్రెలు, బర్రెలు అంటూ మనోబావాలు దెబ్బతీయలేదా అని ప్రశ్నించారు. నోరు అదుపులో పెట్టుకొని మాట్లాడితే బాగుంటుందని హెచ్చరించారు. సమావేశంలో బిసి సేన అసెంబ్లీ అధ్యక్షుడు కుమ్మరి మల్లేష్, నందిగామ కుమ్మరి కృష్ణ, బిసి నాయకులు లక్ష్మణ్, సత్యం, కత్తి శేఖరప్ప, రాజేందర్, బుడ్డ నర్సింహ్మా, అశోక్ గౌడ్, రాజమోని రాజు, లింగం యాదవ్, అభిలాష్‌రెడ్డి ఉన్నారు.

**ఎమ్మెల్యేపై వ్యాఖ్యలు సరికాదు...** బడుగు బలహీన వర్గాల నాయకులకు ఒక న్యాయమా..అగ్రకులాలకు ఒక న్యాయమా అని కాంగ్రెస్ మైనార్టీ సీనియర్ నాయకుడు మహ్మద్ ఇబ్రహీం ప్రశ్నించారు. ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్‌పై వెలమ కులస్తుల చేత బురదజల్లే ప్రయత్నం చేయడం పనికిమాలిన చర్యగా తప్పుగా భావిస్తున్నట్లు తెలిపారు. రజక కులానికి చెందిన ఓ పేదింటి బిడ్డ ఎమ్మెల్యే అయినందుకు అగ్ర కులాల వారు జీర్ణించుకోలేకపోతున్నారని, ఉద్దేశపూర్వకంగానే గోరంతను కొండంత చేసి చూపించడం సమంజసం కాదని హెచ్చరించారు.

## మంత్రివర్గంలో మల్‌రెడ్డికి స్థానం కల్పించాలి



**ప్రజాపక్షం/తుర్కయాంజల్:** మంత్రివర్గవర్గంలో ఇబ్రహీం పట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డికి స్థానం కల్పించాలని సామాజిక కార్యకర్త లు కూరపాటు నరసింహారాజు, సరికొండ ఋషికేశ్వర్ రాజు అన్నారు. ఆదివారం భువనగిరి ఎంపి కిరణ్ కుమార్‌రెడ్డి, ఎంఎల్ఎ మల్ రెడ్డి రంగారెడ్డి ను వారు మర్యాదపూర్వకంగా కలిసి యాదాద్రి లక్ష్మీనరసింహస్వామి ప్రసాదాన్ని అందజేశారు. ఈ సందర్భంగా కూరపాటి నరసింహారాజు మాట్లాడుతూ త్వరలో చేపట్టబోయే మంత్రివర్గ విస్తరణలో ఎమ్మెల్యే మల్‌రెడ్డికి మంత్రి పదవిని ఇవ్వాలని లక్ష్మీ నరసింహ స్వామిని కోరామన్నారు. సిఎం సహాయనిధి కోసం సేకరించిన లక్ష నూటపదహారు రూపాయలను త్వరలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి అందజేస్తామని పేర్కొన్నారు

## ప్రతిభతోనే గ్రామీణ క్రీడాకారులకు గుర్తింపు

షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్



**ప్రజాపక్షం/కొందుర్గు:** గ్రామీణ ప్రాంతాల్లో క్రీడా పోటీల నిర్వాహణతో ప్రతిభ కలిగిన క్రీడాకారులకు గుర్తింపు లభిస్తుందని షాద్‌నగర్ ఎమ్మెల్యే, ప్రభుత్వ రంగ సంస్థల చైర్మెన్ వీర్లపల్లి శంకర్ అన్నారు. ఆదివారం జిల్లేడ్‌చౌదరిగూడ మండల కేంద్రంలో చౌదరిగూడ ప్రీమియర్ లీగ్ 5వ సీజన్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ క్రీడా పోటీలతో దేహదారుఢ్యం పెరుగుతుందని, దీంతో పాటు మానసిక ఉల్లాసం కలుగుతుందన్నారు. పూర్తిగా వెనుకబడిన జిల్లేడ్‌చౌదరిగూడ మండలాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేయడం జరుగుతుందని, ఇందులో భాగంగా ఎంపిడిఒ, పోలీస్ స్టేషన్, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు స్వంత భవనాలు ఏర్పాటు చేయడం జరుగుతుందని, ఇందు కోసం స్థల పరిశీలన చేయడం జరిగిందని, త్వరలోనే వీటి నిర్మాణం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో రెండు మండలాల పార్టీ అధ్యక్షులు చలివేంద్రంపల్లి రాజు, కృష్ణారెడ్డి, కొందుర్గు పిఎసిఎస్ చైర్మన్ చిట్టెం దామోదర్‌రెడ్డి, నాయకులు కావలి యాదయ్య, జాకారం చంద్రశేఖర్, ఎజాస్, నర్సింలు, అంజనేయులు, శివకుమార్, చంద్రబాబు, బాల్‌రాజ్, సలీం, ఖదీర్, పాపయ్య, గోపాల్, శివ, గోపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## పోరాట యోధురాలు చాకలి ఐలమ్మ

నార్సింగి ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్



**ప్రజాపక్షం/ నార్సింగి :** గండిపేట మండలం నార్సింగి మున్సిపల్ పరిధిలోని కోకాపేటలో వీరనారి చాకలి ఐలమ్మ విగ్రహాన్ని ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దొరల పెత్తనాన్ని ఎదిరించిన దీశాలి అని, రజాకారాలను తరిమికొట్టిన వీర వనిత చాకలి ఐలమ్మ అని ఆయన అన్నారు. తెలంగాణ రైతంగ సాయుధ పోరాటానికి దారి చూపిన వీరమాత చాకలి ఐలమ్మ అలియాస్ చిట్యాల ఐలమ్మ అని పేర్కొన్నారు. ఆమె తొలి పోరాటానికి నాంది పలికింది దొరలను రజాకర్లను ఎదిరించి వారిని ప్రతికటించి ఆక్రమించిన భూమిపై విజయం సాధించిందని వీరనారి ఐలమ్మ సేవలను ఆయన కొనియాడారు. కార్యక్రమంలో ముదిరాజ్ కార్పొరేషన్ చైర్మన్ జ్ఞానేశ్వర్ ముదిరాజ్, పిసిసి అధికార ప్రతినిధి ముంగి జయపాల్ రెడ్డి, నార్సింగి మున్సిపల్ చైర్మన్ మైలారం నాగపూర్ణ శ్రీనివాస్, వైస్ చైర్మన్ గోపాల విజయ్ బాబు,కౌన్సిలర్లు జి శివారెడ్డి, అమరేందర్ రెడ్డి, ఉషారాణి, కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు క్యాతం అశోక్ యాదవ్, మాజీ ఎంపిపి మల్లేష్ రజక సంఘ అధ్యక్ష, కార్యదర్శులు సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

## ఎంఆర్‌పిఎస్ శ్రీరంగాపూర్ కమిటీ

**ప్రజాపక్షం/కొందుర్గు:** మండల పరిధిలోని శ్రీరంగాపూర్‌లో ఎంఆర్‌పిఎస్ నూతన గ్రామ కమిటీని ఎన్నిక చేసినట్లు జిల్లా అధ్యక్షులు పి.నరసింహ, మండల అధ్యక్షులు ఎ.ఆనందీలు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. అధ్యక్షుడిగా చెదురుపల్లి యాదగిరి, ఉపాధ్యక్షుడిగా సి గణేష్, ప్రధాన కార్యదర్శిగా ఎన్.యాదయ్య, కార్యదర్శులుగా రమేష్, శేఖర్, ప్రచార కార్యదర్శిగా సి.రవీందర్, కృష్ణయ్య, కోశాధికారిగా సి.నరేష్, అధికార ప్రతినిధిగా సి అశోక్, కార్యవర్గ సభ్యులుగా సుధాకర్, సి.యాదయ్య, సి.లింగం, సలహాదారులుగా సి.రమేష్‌లను ఎన్నిక చేసినట్లు వారు వివరించారు. కార్యక్రమంలో సి.సిద్ధు, చంద్రయ్య, జంగయ్య, సుదర్శన్, జంగయ్య, అశోక్ కుమార్, యాదయ్య, రమేష్ తదితరులు పాల్గొన్నారు.




## మద్యం మత్తులో డ్రైవర్..

అదుపు తప్పి గుంతలోకి దూసుకెళ్లిన స్కూల్ బస్సు

పది మంది విద్యార్థులకు గాయాలు



**ప్రజాపక్షం/షాద్‌నగర్:** మద్యం మత్తులో డ్రైవర్..అదుపుతప్పి స్కూల్ బస్సు గుంతలోకి దూసుకువెళ్ళడంతో విద్యార్థులు గాయాలపాలయ్యారు. ఈ సంఘటన షాద్‌నగర్ మున్సిపల్ పరిధిలోని విజయనగర్ కాలనీలో ఉన్న మాంటిస్సోరి ఉన్నత పాఠశాలలో చోటు చేసుకుంది. విద్యార్థుల తల్లి దండ్రుల కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. సాయంత్రం సమయంలో పాఠశాల నుండి ఇంటికి వెళ్తున్న సమయంలో స్కూల్ బస్సు అదుపుతప్పి గుంతలోకి వెళ్ళడంతో విద్యార్థులు గాయాలపాలు కావడంతోపాటు మరికొంతమంది విద్యార్థుల రోదనలు మిన్నంటి పోయాయి. స్కూల్ బస్సు డ్రైవర్ అతిగా మద్యం సేవించడంతోనే ఈ సంఘటన చోటు చేసుకుందని విద్యార్థుల తల్లిదండ్రులు ఆరోపించారు. బస్సులో ఉన్న విద్యార్థులు ఒక్కసారిగా కేకలు వేయడంతో స్థానికంగా ఉన్న వారు గమనించి హుటాహుటిన సంఘటన స్థలానికి చేరుకొని విద్యార్థులను కాపాడారు. అప్పటికే ఏమి జరిగిందో తెలియక డ్రైవర్ బిత్తరపోయారని వారు వివరించారు. వేల రూపాయాలు ఖర్చు చేసి విద్యార్థులకు పాఠశాలకు పంపిస్తే యాజమాన్యం సీనియర్ డ్రైవర్లను పెట్టుకోకుండా ఇష్టం వచ్చిన వారిని పెట్టుకొని ప్రాణాలతో చెలగాటం అడటం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. ప్రమాదం జరిగినప్పటి నుండి పాఠశాల యాజమాన్యం అందుబాటులోకి లేకుండా పోవడమే కాకుండా ఫోన్లు స్విచ్ ఆఫ్‌చేశారని వివరించారు. ఈ విషయంపై మీడియా పాఠశాల యాజమాన్యం వివరణ కొరేందుకు ఫోన్ చేయగా స్విచ్ ఆఫ్ వచ్చింది. ప్రమాదానికి కారణమైన పాఠశాల యాజమాన్యం, బస్ డ్రైవర్‌పై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ప్రమాదంలో గాయపడిన విద్యార్థులకు వైద్య పరీక్షలు చేయించడంతోపాటు మెరుగైన వైద్యం అంధించేందుకు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. విద్యార్థుల తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. ఈ విషయం తెలుసుకున్న స్థానిక రాజకీయ పార్టీల నేతలు పాలమూరు విష్ణువర్ధన్‌రెడ్డి ఆసుపత్రి వద్దకు వెళ్ళి విద్యార్థులకు పరామర్శించారు.

## ప్రభుత్వ పథకాలకు ప్రచారం

యువజన కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అందె మోహన్



**ప్రజాపక్షం/షాద్‌నగర్:** ప్రజల సమస్యలను ప్రభుత్వానికి తెలియజేస్తూ, ప్రభుత్వం పథకాలను ప్రజల్లోకి విస్తృతంగా ప్రచారం చేయాలని యువజన కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలకు యువజన కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అందె మోహన్ ముదిరాజ్ సూచించారు. ఆదివారం హైదరాబాద్‌లో టిపిసిసి అధ్యక్షుడు మహేష్‌కుమార్ గౌడ్‌ను నూతనంగా ఎన్నికైన యువజన కాంగ్రెస్ నేతలు మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా అందె మోహన్ ముదిరాజ్ మాట్లాడుతూ రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి ఏడాది కాలం పూర్తి చేసుకొని ప్రజల మెప్పు పొందుతున్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రభుత్వాన్ని, కాంగ్రెస్ పార్టీని యువజన కాంగ్రెస్ బలోపేతం చేసేందుకు కృషి చేయాలని సూచించారు. ఇప్పటికే నూతనంగా ఎన్నికైన యువజన కాంగ్రెస్ నేతలకు టిపిసిసి అధ్యక్షుడు మహేష్‌కుమార్ గౌడ్ దిశా నిర్దేశం చేశారని గుర్తు చేశారు. కాంగ్రెస్ పార్టీ పటిష్ట కోసం కష్టపడి చేసే కార్యకర్తలకు ఎల్లప్పుడు గుర్తింపు ఉంటుందని, పార్టీలో యువత పాత్ర ఎక్కువగా అవసరం ఉంటుందని, అందుకే ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తుందని వివరించారు. అసెంబ్లీ అధ్యక్షుడు పులిమామిడి రాజేష్ గౌడ్ మాట్లాడుతూ యువజన కాంగ్రెస్ ఎన్నికల్లో విజయం సాధించిన సందర్భంగా టిపిసిసి అధ్యక్షుడిని మర్యాదపూర్వకంగా కలుసుకొని సన్మానించినట్లు తెలిపారు. షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ ఆధ్వర్యంలో నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసేందుకు శక్తివంచన లేకుండా కృషి చేయనున్నట్లు తెలిపారు. ప్రభుత్వ పథకాలను పూర్తి స్థాయిలో ప్రజల్లోకి తీసుకువెళ్ళనున్నట్లు వివరించారు. కార్యక్రమంలో యువజన కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి పిప్పళ్ల శ్రీనాథ్, పట్టణ అధ్యక్షుడు సాయివంశీ, నేతలు వంశీగౌడ్, ప్రవీణ్‌కుమార్‌రెడ్డి, నవీన్, అజయ్, రాహుల్, ప్రవీణ్‌కుమార్, లడ్డు, సాయి, శ్రీను, వేణు, కార్తికేయులు పాల్గొన్నారు.

## ఎమ్మెల్యేపై అనుచిత వ్యాఖ్యలు సరికాదు

కాంగ్రెస్ శ్రేణుల ఆగ్రహం



**ప్రజాపక్షం/ఫరూఖ్‌నగర్:** బడుగు బలహీన వర్గాలకు చెందిన ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేస్తే సహించేదిలేదంటూ కాంగ్రెస్ శ్రేణులు ఆగ్రహం వ్యక్తంచేశారు. ఆదివారం పట్టణంలోని క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో లింగారెడ్డిగూడ అశోక్, రాయికల్ శ్రీనివాస్, ఖదీర్, రమాదేవి, చంద్రశేఖర్‌లు మాట్లాడుతూ శునకాలతో పోల్చుతూ ఎమ్మెల్యే ఫోటోతో పత్రిల్లో వార్తలు రాయించడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. ఓ రజక కులానికి చెందిన బిసి ఎమ్మెల్యేపై అధికారం కోల్పోయాక కొందురు వెలమ దొరలు అదే అహంకారంతో కుట్రలు చేయడం సరైనదని హెచ్చరించారు. పదేళ్ళు అధికారంలో ఉండి పోలీస్, రెవిన్యూ, రాజకీయాన్ని చేతుల్లో పెట్టుకొని అమాయకలైన బిసిలు, దళిత, గిరిజనులను ఎంత దారుణంగా హింసించారో తెలంగాణ ప్రజలకు తెలుసన్నారు. ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్‌పై అవాక్కులు, చావాక్కులు చేస్తున్న చిల్లర వ్యక్తుల భరతం పట్టెందుకు కాంగ్రెస్ శ్రేణులం సిద్దంగా ఉన్నట్లు వివరించారు. సోషల్ మీడియాను అడ్డం పెట్టుకొని రాష్ట్ర ముఖ్యమంత్రి నుండి ఎమ్మెల్యే వరకు కుట్రలు చేయడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. తెలంగాణ ప్రజలు పూర్తిగా గమనిస్తున్నారని వివరించారు. బాధ్యత గల ప్రజాప్రతినిధిపై ఇష్టం ఇచ్చినట్లు మాట్లాడితే సహించేది లేదని, నోరు అదుపులో పెట్టుకొవాలని, చేతిలో సోషల్ మీడియా ఉందని రెచ్చిపోతే ప్రజలు గుణపాఠం చెప్పేందుకు సిద్దంగా ఉన్నారని హెచ్చరించారు. అట్టగుడు స్థాయి నుండి రాజకీయంగా ఎదిగిన ఎమ్మెల్యేపై విషం కక్కుతున్న కొందరు తెరవెనుక అడుతున్న డ్రామాలను తిప్పికొట్టేందుకు ప్రజలు సిద్ధమవుతున్నారని వివరించారు. ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ జోలికి వస్తే సహించేది లేదని హెచ్చరించారు.

## 10న మాదిగల ఆత్మీయ సమ్మేళనం

**ప్రజాపక్షం/యాచారం :** ఈనెల 10న ఇబ్రహింపట్నం మండల కేంద్రంలోని శ్రాస్తా గార్డెన్‌లో మాదిగల ఆత్మీయ సమ్మేళనం నిర్వహిస్తున్నామని మాదిగ జెఎసి నాయకులు బండిమిది కృష్ణ మాదిగ తెలిపారు. సమ్మేళనానికి ఎమ్మార్పియస్ వ్యవస్థాపక అధ్యక్షులు మందకృష్ణ మాదిగ హజరౌతున్నారన్నారు. అదివారం మండల కేంద్రంలో పోస్టర్ అవిష్కరించి మాట్లాడారు. కార్యక్రమంలో మండల ఎమ్మార్పియస్ అధ్యక్షులు మూలి మహేశ్,మండల కార్యదర్శి మస్కు శ్రీనివాస్, మస్కు అబ్బయ్య, మాజీ అధ్యక్షులు జోగు అంజయ్య, మస్కు మహేంధర్, పార సంజీవ, మస్కు నవిన్, అనిల్‌కుమార్, శివశరణం, ప్రసాద్, శేఖర్, రమేశ్, జోగు కృష్ణ తదితరులు పాల్గొన్నారు.



## నిరుపేదలే ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులు

కాంగ్రెస్ పార్టీ యాచారం మండల అధ్యక్షుడు నర్సింహ్మా



**ప్రజాపక్షం/యాచారం :** మండలంలో అర్హులైన నిరుపేదలను ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులుగా పార్టీలకు అతీతంగా ఎంపిక చేయడానికి అందరు కలిసి కట్టుగా పనిచేయాలని యాచారం మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు , ఇబ్రహింపట్నం నూతన మార్కెట్ కమిటీ డైరెక్టరు మస్కు నర్సింహ్మా అన్నారు. అదివారం మండల కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఇందిరమ్మ కమిటీ సభ్యులకు అవగాహణ సదస్సు నిర్వహించారు. ఈసందర్భంగా అయన మాట్లాడుతూ రేపటి నుండి గ్రామాల్లో ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారుల ఎంపిక జరుగుతుందన్నారు. గ్రామ పంచాయతీ అధికారులు వెళ్ళే సమయంలో ఇందిరమ్మ కమిటీ సభ్యులు కాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షులు అధికారుల వెంట వెళ్ళాలన్నారు. నిజమైన అర్హులైన వారిని గుర్తించి వారికి ఇండ్లు వచ్చే విధంగా ప్రత్యేక చర్యలు తీసుకోవాలని అన్నారు. ప్రభుత్వ పథకాలు అర్హులైన వారందరికి అందే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ విషయాన్ని పార్టీ నాయకులు, ఇందిరమ్మ కమిటీ సభ్యులు అర్థం చేసుకోవాలని అన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల ప్రధానకార్యదర్శి బట్టు శ్రీనివాస్, ఎస్సి సెల్ మండల అధ్యక్షులు చిన్నోళ్ళ మల్లేశ్, బిసి సెల్ మండల కార్యదర్శి నీలం వెంకటేశ్, మాజీ సర్పంచ్ సురేందర్‌రెడ్డి, ఇందిరమ్మ కమిటీ సభ్యులు, కాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షులు తదితరులు పాల్గొన్నారు.

క్రీడ

# నితీశ్ రెడ్డి.. అరుదైన రికార్డ్



అయిదు టెస్టుల బోర్డర్ గవాస్కర్ ట్రోఫీలో భాగంగా అడిలైడ్ వేదికగా జరిగిన రెండో టెస్టులో ఆస్ట్రేలియా చేతిలో భారత్ 10 వికెట్ల తేడాతో ఘోర పరాజయం చవిచూసింది. అన్ని విభాగాల్లో విఫలమై సిరీస్‌లో ఆధిక్యాన్ని 11తో సమం చేసుకుంది. 19 పరుగుల స్వల్ప లక్ష్యంతో బరిలోకి దిగిన ఆసీస్ 3.2 ఓవర్లలో వికెట్ నష్టపోకుండా ఛేదన పూర్తిచేసింది. నాథన్ మెక్స్వీనీ(10 నాటౌట్), ఉస్మాన్ ఖవాజా(9 నాటౌట్) జట్టును విజయతీరాలకు చేర్చారు. అంతకుముందు 128/5 ఓవర్‌నైట్ స్కోర్‌తో మూడో రోజు ఆటను కొనసాగించిన భారత్ రెండో ఇన్నింగ్స్‌లో 36.5 ఓవర్లలో 175 పరుగులకు కుప్పకూలింది. నితీశ్ కుమార్ రెడ్డి(42; 47 బంతుల్లో, 6 ఫోర్లు, 1 సిక్సర్) టాప్ స్కోరర్. అంతకుముందు తొలి ఇన్నింగ్స్‌లో టీమిండియా 180 పరుగులు చేసింది. మొదటి ఇన్నింగ్స్‌లోనూ నితీశ్ రెడ్డి (42; 54 బంతుల్లో, 3 ఫోర్లు, 3 సిక్సర్లు)నే టాప్ స్కోర్. ఆసీస్ 337 పరుగులు సాధించింది.ట్రావిస్ హెడ్ (140; 141 బంతుల్లో, 17 ఫోర్లు, 4 సిక్సర్లు), లబుషేన్ (64; 126 బంతుల్లో, 9 ఫోర్లు) సత్తాచాటారు. అయితే భారత రెండు ఇన్నింగ్స్‌లో టాప్ స్కోరర్‌గా నిలిచిన తెలుగు కుర్రాడు నితీశ్ రెడ్డి అరుదైన రికార్డు నెలకొల్పాడు. ఏడో స్థానంలో లేదా అంతకంటే దిగువన బ్యాటింగ్ ఆర్డర్‌లో వచ్చి ఓ టెస్టులో రెండు ఇన్నింగ్స్‌ల్లోనూ టాప్ స్కోరర్‌గా నిలిచిన భారత నాలుగో బ్యాటర్‌గా చరిత్ర కెక్కాడు. అంతకుముందు ముగ్గురు భారత క్రికెటర్లు మాత్రమే ఈ ఘనత సాధించారు. 1961–62లో కోల్‌కతా వేదికగా ఇంగ్లండ్‌తో జరిగిన టెస్టులో చందు బోర్డే, 2011లో ఎడ్జ్‌బాస్టన్ వేదికగా ఇంగ్లండ్‌తో జరిగిన టెస్టులో ఎంఎస్ ధోనీ, 2018లో లార్డ్స్ వేదికగా ఇంగ్లండ్‌తో జరిగిన మ్యాచ్‌లో రవిచంద్రన్ అశ్విన్ ఈ ఘనత సాధించారు. తాజాగా అడిలైడ్ వేదికగా జరిగిన డే/నైట్ టెస్టులో నయా ఆల్‌రౌండర్ నితీశ్ సత్తాచాటి ఈ అరుదైన జాబితాలో చోటు సంపాదించాడు.ఫోటో..హాకీ నేమ్‌తో ఉంది.

అండర్-19 ఆసియా కప్

## బంగ్లాదేశ్ చేతిలో భారత్ పరాజయం!



దుబాయ్ వేదికగా జరిగిన అండర్19 ఆసియా కప్ ఫైనల్‌లో భారత్‌పై బంగ్లాదేశ్ ఘన విజయం సాధించింది. ఆల్‌రౌండ షోతో సత్తాచాటి డిఫెండింగ్ ఛాంపియన్ బంగ్లాదేశ్ తమ టైటిల్‌ను నిలబెట్టుకుంది. మరోవైపు యూత్ క్రికెట్ ఆసియా మెగాటోర్నీ ఫైనల్‌లో ప్రత్యర్థి చేతిలో భారత్ ఓటమిపాలవ్వడం ఇదే తొలిసారి. బ్యాటర్ల వైఫల్యంలో 59 పరుగుల తేడాతో ఘోర పరాజయాన్ని చవిచూసింది.
మొదట బ్యాటింగ్ చేసిన బంగ్లాదేశ్ 49.1 ఓవర్లలో 198 పరుగులకు ఆలౌటైంది. అనంతరం ఛేదనకు దిగిన యువ భారత్ 35.2 ఓవర్లలో 139 పరుగులకే కుప్పకూలింది. కెప్టెన్ మహ్మద్ అమాన్ (26; 65 బంతుల్లో, 1 ఫోర్) టాప్ స్కోరర్. అజిజుల్ హకీమ్ (3/8), ఇక్బాల్ హొస్సేన్ (3/24) చెరో మూడు వికెట్లు, ఫహద్ (2/34) రెండు వికెట్లు పడగొట్టారు. రిజాన్ హొస్సేన్ (1/14), మారుఫ్ మ్రిధా (1/36) తలో వికెట్ తీశారు. ఛేదన ఆది నుంచే భారత్ క్రమం తప్పకుండా వికెట్లు కోల్పోయింది. ఓపెనర్ ఆయుష్ (1; 8 బంతుల్లో) ఒక్క పరుగుకే వెనుదిరిగాడు. 1989 నుంచి జరుగుతున్న అండర్19 వరల్డ్ కప్‌లో యువ భారత్ ఎనిమది సార్లు ఛాంపియన్‌గా నిలిచింది. 1989, 2003, 2012, 2013/14, 2016, 2018, 2019, 2021లో టైటిల్ నెగ్గింది. మూడు సార్లు ఫైనల్‌కు వెళ్లిన బంగ్లాదేశ్ రెండు సార్లు విజేతగా నిలిచింది. పాకిస్థాన్, అఫ్గానిస్థాన్ ఒక్కోసారి ఆసియా కప్‌ను అందుకుంది.



హోటల్‌లో పడుకోవడం మానేసి..

## ఇక మొదలుపెట్టండి

టీమిండియాకు గవాస్కర్ సూచన

అయిదు టెస్టుల బోర్డర్ గవాస్కర్ ట్రోఫీలో భాగంగా అడిలైడ్ వేదికగా జరిగిన రెండో టెస్టులో ఆస్ట్రేలియా చేతిలో భారత్ 10 వికెట్ల తేడాతో ఘోర పరాజయాన్ని చవిచూసింది. సిరీస్‌లో ఆధిక్యాన్ని 1 1తో సమం చేసుకుంది. అయితే మిగిలిన ఈ రెండు రోజుల సమయాన్ని వృథా చేయకుండా ప్రాక్టీస్ చేయాలని టీమిండియాకు దిగ్గజ క్రికెటర్ సునీల్ గవాస్కర్ సూచించాడు. హోటల్ గదులకే పరిమితం కాకుండా చెమటోడ్చాలన్నాడు. అయిదు టెస్టుల సిరీస్ అని మరిచి, మూడు టెస్టుల సిరీస్‌గా సరికొత్తగా సన్నద్ధత మొదలుపెట్టాలని గవాస్కర్ పేర్కొన్నాడు. త్వరగా ముగిసిన అడిలైడ్ టెస్టును కూడా సద్వినియోగం చేసుకోవాలని సూచించాడు. మిగిలిన రెండు రోజుల్లో రోజంతా ప్రాక్టీస్ చేయకపోయినా, కనీసం ఉదయం లేదా మధ్యాహ్నం సాధన చేయాలని అన్నాడు.



ప్రపంచ చెస్ చాంపియన్‌షిప్..

## ఆధిక్యంలో గుకేశ్

**సింగపూర్:** ప్రతిష్ఠాత్మక ప్రపంచ చెస్ ఛాంపియన్ షిప్‌లో డ్రాల పర్వానికి తెరపడింది. వరుసగా ఏడు గేమ్‌ల తర్వాత ఫలితం తేలింది. ఆదివారం జరిగిన 11వ రౌండ్‌లో భారత యువ సంచలనం దొమ్మరాజు గుకేశ్ డిఫెండింగ్ ఛాంపియన్ డింగ్ లిరెన్‌పై విజయం సాధించాడు. ఇంకా మూడు రౌండ్లు మాత్రమే మిగిలి ఉన్న ఈ ప్రపంచ మ్యాచ్ లో గుకేశ్ 6 పాయింట్లతో ఆధిక్యంలో ఉన్నాడు. లిరెన్ 5 పాయింట్లతో ఉన్నాడు. 14 రౌండ్లు ఉండే ఈ ప్రపంచ మ్యాచ్‌లో తొలుత 7.5 పాయింట్లు సాధించిన ఆటగాడు విజేతగా నిలుస్తాడు. తొలి మ్యాచ్‌లో లిరెన్ విజయం సాధించగా.. రెండో గేమ్ డ్రాగా ముగిసింది. గుకేశ్ మూడో గేమ్‌లో గెలుపొంది లిరెన్‌ను సమం చేశాడు. తర్వాత జరిగిన ఏడు గేమ్‌లు హోరాహోరీగా సాగినా చివరకు డ్రాగా ముగిశాయి. 11వ గేమ్‌లో ఫలితం తేలడంతో డ్రాల పర్వానికి తెరపడింది.




రీల్

## 'బుక్ మై షో'లో బాలయ్య హవా

నందమూరి నటసింహం బాలకృష్ణ హీరోగా ప్రగ్యా జైస్వాల్ హీరోయిన్ గా దర్శకుడు కొల్లి బాబీ తెరకెక్కించిన అవైటెడ్ సాలిడ్ చిత్రం డాకు మహారాజ్ కోసం అందరికీ తెలిసిందే. బాలయ్య కెరీర్ లో భారీ అంచనాలు సెట్ చేసుకున్న ఈ చిత్రం కోసం నందమూరి అభిమానులు ఓ రేంజ్ లో ఎగ్జైట్ అవుతున్నారు. ఇక ఈ చిత్రం బాలయ్య 109వ చిత్రంగా భారీ లెవెల్లో ప్లాన్ చేస్తున్నారు. ఇక ఇదిలా ఉండగా ఈ సినిమాకి బుక్ మై షోలో భారీ రెస్పాన్స్ వస్తుంది. లేటెస్ట్ గా ఈ చిత్రం బుక్ మై షోలో లక్షకి పైగా ఇంట్రెస్ట్స్ నమోదు అయ్యింది. దీనితో ఈ సినిమా కోసం బాలయ్య ఫ్యాన్స్ సహా అభిమానులు ఏ రేంజ్ లో ఎదురు చూస్తున్నారో అర్థం చేసుకోవచ్చు. ఇక ఈ చిత్రానికి థమన్ సంగీతం అందిస్తుండగా శ్రద్ధా శ్రీనాథ్ కీలక పాత్రలో నటిస్తుండగా సితార ఎంటర్టైన్మెంట్స్ మరియు ఫార్చ్యూన్ ఫోర్ సినిమాస్ వారు నిర్మాణం వహిస్తున్నారు. వచ్చే ఏడాది సంక్రాంతి కానుకగా జనవరి 12న రిలీజ్ కి వస్తుంది.

## ఇంక ఆ సాంగ్స్‌కు నో: శ్రీలీల



ఐకాన్ స్టార్ అల్లు అర్జున్ హీరోగా క్రియేటివ్ డైరెక్టర్ సుకుమార్ దర్శకత్వంలో వచ్చిన సినిమా 'పుష్ప 2 ది రూల్'. ఈ సినిమాలో శ్రీలీల స్పెషల్ సాంగ్ 'కిస్సిక్' చేసింది. ఈ పాటలో శ్రీలీల – బన్నీ స్టెప్స్ బాగా అలరించాయి. అటు బన్నీ – శ్రీలీల కెమిస్ట్రీ కూడా చాలా బాగుంది. మొత్తానికి ఈ పాటతో శ్రీలీలకి సరికొత్త గుర్తింపు వచ్చింది. 'పుష్ప 2'లో ఐటెం సాంగ్ చేయాలని శ్రీలీలను అడిగిన వెంటనే ఆలోచించకుండా ఓకే చెప్పింది. ఐతే, ఇక పై శ్రీలీల ఐటెం సాంగ్స్ కి నో చెబుతుందట. తనకు ఐటెం సాంగ్ సెట్ కాదు అని, కాబట్టి.. ఐటమ్ సాంగ్ కోసం తనను సంప్రదిస్తే కచ్చితంగా నో చెబుతాను అంటూ శ్రీలీల క్లారిటీ ఇచ్చింది. ప్రస్తుతం శ్రీలీల, నితిన్ హీరోగా వస్తున్న 'రాబిన్ హుడ్' సినిమాను చేస్తోంది. ఈ సినిమా షూటింగ్ ముగింపు దశకు చేరుకుంది. ఈ సినిమాపై శ్రీలీల చాలా ఆశలు పెట్టుకుంది. ఈ సినిమా హిట్ అయితే, శ్రీలీల నెక్స్ట్ రేంజ్ కి వెళ్తుంది. అప్పుడు శ్రీలీలకి ఐటమ్ సాంగ్స్ చేయాల్సిన అవసరం కూడా ఉండదు.

## 'రాబిన్‌హుడ్' నుంచి ఆమెతో స్పెషల్ సర్‌ప్రైజ్





మన టాలీవుడ్ యంగ్ అండ టాలెంటెడ్ హీరో యూత్ స్టార్ నితిన్ హీరోగా దర్శకుడు వెంకీ కుడుముల కాంబినేషన్ లో చేస్తున్న లేటెస్ట్ సాలిడ్ హిట్ చిత్రం రాబిన్ హుడ్ కోసం అందరికీ తెలిసిందే. మరి ఈ చిత్రంపై మంచి బజ్ నెలకొనగా మేకర్స్ సాలిడ్ ప్రమోషన్స్ ని ఈ చిత్రం ఇంట్రెస్టింగ్ అప్డేట్స్ తో రాబోతుంది. అయితే ఈ చిత్రంలో రీసెంట్ గానే ఓ స్పెషల్ సాంగ్ ఉందని మేకర్స్ రివీల్ చేశారు. మరి ఈ స్పెషల్ సర్‌ప్రైజ్ కి డేట్ అండ్ టైం ని లాక్ చేసేసారు. ఈ సాంగ్ పై అప్డేట్ ని అయితే సోమవారం ఉదయం 10 గంటల 8 నిమిషాలకి అందిస్తున్నట్టుగా కన్ఫర్మ్ చేశారు. ఇక లేటెస్ట్ టాక్ ఏమిటంటే ఈ సాంగ్ లో యంగ్ హీరోయిన్ కేతిక శర్మ షైన్ కానుంది అని తెలుస్తుంది. మరి ఈమెనే రేపు రివీల్ చేస్తారట. ఇక ఈ చిత్రానికి జివి ప్రకాష్ సంగీతం అందిస్తుండగా మైత్రి మూవీ మేకర్స్ నిర్మాణం వహిస్తుండగా ఈ డిసెంబర్ 20న రిలీజ్ కి రాబోతుంది.

# రెవెన్యూ శాఖ పునరుద్ధరణలో భాగమవుతాం

కొత్త ఆర్‌ఒఆర్ చట్టం అమలుకు శక్తివంచన లేకుండా పని చేస్తాం

తెలంగాణ ఉద్యోగుల జెఎసి చైర్మన్ వి.లచ్చిరెడ్డి

**ప్రజాపక్షం / హైదరాబాద్:** రాష్ట్రంలో చిన్నాభిన్నమైన రెవెన్యూ వ్యవస్థను తిరిగి పునరుద్ధరించేందుకు ప్రభుత్వం ప్రయత్నించడం సంతోషకరమని, ఈ ప్రయత్నంలో రెవెన్యూ ఉద్యోగులుగా అందరం భాగస్వాములం అవుతామని తెలంగాణ ఉద్యోగుల జెఎసి చైర్మన్ వి.లచ్చిరెడ్డి చెప్పారు. తెలంగాణ రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్(టీజీఆర్ఎస్ఎ) రాష్ట్ర స్థాయి ఆత్మీయ సమావేశం ఆదివారం హైదరాబాద్‌లో జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా వి.లచ్చిరెడ్డి హాజరయ్యారు. ఈ సన్దర్భంగా లచ్చిరెడ్డి ప్రసంగిస్తూ గత ప్రభుత్వం గ్రామ స్థాయి రెవెన్యూ వ్యవస్థను ఎత్తేయడం వల్ల మొత్తం రెవెన్యూ వ్యవస్థనే నిర్వీర్యం అయ్యిందన్నారు. విఆర్‌వి, విఆర్‌ఓ వ్యవస్థలను తీసేయడం వల్ల గ్రామ స్థాయిలో పోలీసు వ్యవస్థ లేకుండా పోయిందని, ఫలితంగా లగచర్ల వంటి ఘటనలు జరిగే పరిస్థితి వచ్చిందన్నారు. గ్రామ స్థాయి రెవెన్యూ వ్యవస్థను పునర్నిoచార్ర్పభ/థ్శః నిర్ణయం తీసుకోవడం, మళ్లీ విఆర్‌వి, విఆర్‌ఓ వ్యవస్థను పునరుద్ధరించేందుకు ప్రభుత్వం ప్రయత్నిస్తుండటాన్ని స్వాగతిస్తున్నామన్నారు. గ్రామీణ స్థాయి నుంచి రెవెన్యూ సమస్యలు పరిష్కారమయ్యే వ్యవస్థను, అప్పీల్ వ్యవస్థను తీసుకురావాలని ప్రభుత్వం నిర్ణయించడం ఆహ్వానించాల్సిన అంశమని పేర్కొన్నారు. కొత్త ఆర్‌ఓఆర్ చట్టం అమలు కోసం శక్తివంచన లేకుండా పని చేస్తామని అన్నారు. రెవెన్యూ శాఖలోని ఆఫీస్ సబార్డినేట్ నుంచి డిప్యూటీ తహశీల్దార్ వరకు అన్ని స్థాయిల ఉద్యోగులకు తమ సంఘం ప్రాతినిథ్యం వహిస్తూ రెవెన్యూ ఉద్యోగులను ఐక్యం చేసి, సమస్యల పరిష్కారానికి కృషి చేసే వేదికగా టిజిఆర్ఎస్ఎ పనిచేస్తుందన్నారు. టిజిఆర్ఎస్ఎ నూతన అధ్యక్షుడు బాణాల రాంరెడ్డి మాట్లాడుతూ గ్రామస్థాయి రెవెన్యూ అధికారి లేకపోవడం వల్ల ప్రభుత్వ భూములు అన్యాక్రాంతం కాకుండా చూసే వారు లేరని అన్నారు. రెవెన్యూ ఉద్యోగుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి, సానుకూల నిర్ణయం తీసుకునేలా చొరవ తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ కలెక్టర్స్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణ, టిజిటిఎ అధ్యక్షుడు ఎస్.రాములు, ప్రధాన కార్యదర్శి రమేశ్ పాక, సెక్రటరీ జనరల్ ఫూల్ సింగ్ చౌహాన్, మహిళా అధ్యక్షురాలు రాధ, కోశాధికారి శ్రీనివాస్ శంకర్‌రావు తదితరులు ప్రసంగించారు.

**టిజిఆర్ఎస్ఎ నూతన కమిటీ ఎన్నిక**

టిజిఆర్ఎస్ఎ రాష్ట్ర నూతన కమిటీని ఈ సమావేశంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా బాణాల రాంరెడ్డి, ప్రధాన కార్యదర్శిగా బిక్షం, కోశాధికారిగా మల్లేశ్, మహిళా విభాగం అధ్యక్షురాలిగా సుజాత చౌహాన్ ఎన్నికయ్యారు.

# 13 నుంచి మక్తల్ ఆంజనేయస్వామి బ్రహ్మోత్సవాలు : మంత్రి కొండా

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** నారాయణపేట జిల్లా మక్తల్ పట్టణంలోని పడమటి ఆంజనేయస్వామి బ్రహ్మోత్సవాలు ఈనెల 13 నుండి 19 వరకు జరుగుతాయని దేవాదాయ ధర్మాదాయ శాఖా మంత్రి కొండా సురేఖ తెలిపారు. ఈ మేరకు మఖ్తల్ ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి, ఆలయ ఈవో శ్యాంసుందర చారి, అర్చకులు ప్రాణేశాచారి, ఆలయ కమిటీ సభ్యులు ఆదివారం మంత్రి కొండా సురేఖను హైదరాబాద్‌లో కలిసి బ్రహ్మోత్సవాలకు హాజరు కావాలని ఆహ్వానించారు. బ్రహ్మోత్సవాల్లో భాగంగా చేపడుతున్న కార్యక్రమాలను ఈవో మంత్రి సురేఖకు వివరించారు. బ్రహ్మోత్సవాల్లో ప్రధాన కార్యక్రమాలైన రథోత్సవం, పాల ఉట్లు, హంసవాహన సేవలో పాల్గొనాలని ఆలయ కమిటీ మంత్రి సురేఖను కోరింది.



## పోరాటాలే అమరులకు సరైన నివాళి

(మూడవ పేజీ తరువాయి)

పోటు ప్రసాద్ విద్యార్థి ఉద్యమంలోనూ, కార్మిక ఉద్యమంలోనూ ఎంతో నిబద్ధతతో పని చేశారని సిపిఐ జిల్లా కార్యదర్శిగా పనిచేస్తూ పార్టీ శ్రేణులను ప్రజా పోరాటాలకు సన్నద్ధం చేసేవారని కౌర్ తెలిపారు. పాలకులు ప్రజా వ్యతిరేక విధానాలు అవలంబిస్తున్నారని ఈ దశలో ప్రజా పోరాటాల ఉధృతి చేయాల్సిన సమయంలో ప్రసాద్ మరణం యావత్ ప్రజా ఉద్యమాలకు తీరని లోటన్నారు. మోడీ పాలనలో ఆదాయ వ్యయాల మధ్య వ్యత్యాసం పెరిగి వేతన జీవులు ఎగువ, దిగువ, మధ్యతరగతి ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని ఆమె తెలిపారు. దేశ సంపద ఒక శాతం మంది వద్ద పోగుపడుతుందని 90 శాతం మంది ఆర్థిక ఇబ్బందులతో ఉన్నారన్నారు. దేశ జనాభాలో యువకుల శాతం పెరుగుతూ యువ భారత్‌గా మారుతుందని అదే సమయంలో యువత ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లేక ఇబ్బందులు పడుతున్నారని అమర్‌జిత్ తెలిపారు. యువశక్తి నిర్వీర్యం అవుతుందని ప్రభుత్వ రంగంలోని నియామకాలు లేవని ప్రభుత్వ రంగాన్ని మోడీ సర్కార్ నిర్వీర్యం చేస్తూ అంబానీ, అదానీలకు కట్ట బెట్టే ప్రయత్నం చేస్తుందని ఆరోపించారు. దేశంలో ఆత్మహత్యలు చేసుకుంటున్న వారిలో 25 శాతం మంది రోజు వారి కూలీలేనని ఆవేదన వ్యక్తం చేశారు. నిరుద్యోగం పెరుగుతుండడంతో దేశ వ్యాప్తంగా పలు పోరాటాలు మొదలవుతున్నాయన్నారు. సాంకేతిక విద్యతో పాటు వివిధ కోర్సుల్లో పిజిలు సాధించి ఉపాధి కోసం డిగ్రీలు చేతపట్టుకుని తిరుగుతున్నారన్నారు. వ్యవసాయ రంగాన్ని సైతం మోడీ సర్కార్ సంక్షోభంలోకి నెట్టిందని మూడు నూతన సాగు చట్టాలను తీసుకువచ్చి రైతులను ఇబ్బందులు పెట్టారన్నారు. రాజ్యాంగంలో పొందుపర్చిన హక్కుల కోసం పోరాడుతున్న క్రమంలో ప్రసాద్ లాంటి పోరాట యోధుడు మరణించడం దురదృష్టకర పరిణామమన్నారు. విద్యారంగాన్ని కాషాయికరించేందుకు ప్రయత్నాలు జరుగుతున్న తరుణంలో ప్రజా పోరాటాలను ఉధృతం చేయాలని కౌర్ పిలుపునిచ్చారు. 44 సంవత్సరాల క్రితం ఖమ్మం వచ్చానని మళ్లీ ఇటువంటి విషాద సమయంలో రావడం అత్యంత బాధాకరంగా ఉందన్నారు.

**ప్రసాద్‌కు నివాళిగా శత వసంత ముగింపు సభ : కూనంనేని**

తుదిశ్వాస వరకు నిబద్ధత, నిస్వార్థంతో కమ్యూనిస్టు పార్టీ పురోభివృద్ధికి కృషి చేసిన పోటు ప్రసాద్‌కు నివాళిగా సిపిఐ శత వసంతాల జాతీయ స్థాయి ముగింపు సభ ఖమ్మంలో నిర్వహిస్తున్నట్లు సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు తెలిపారు. ఈ సందర్భంగా లక్ష మందితో బహిరంగ సభ నిర్వహిస్తామని ఆయన అన్నారు. సుదీర్ఘ పోరాటాల చరిత్ర కలిగిన కుటుంబం నుంచి వచ్చిన పోటు ప్రసాద్ పార్టీ భావజాల వ్యాప్తిలో ముందు వరుసలో నిలిచారన్నారు. ఖమ్మంజిల్లా కమ్యూనిస్టు పార్టీని ఆదర్శంగా తీర్చిదిద్దడంలో పోటు ప్రసాద్ కృషి ఎనలేనిదన్నారు. గంగినేని వెంకటేశ్వరరావు రచించిన ఎర్ర జెండాల పుస్తకంలోనూ, సుందరయ్య రచించిన ఆదర్శ కుటుంబాల పుస్తకంలోనూ పోటు ఎర్రమ్మ కుటుంబానికి సముచిత స్థానం ఇవ్వడం గర్వంగా ఉందని ఈ సందర్భగా సాంబశివరావు తెలిపారు. పేదల పక్షాన పోరాడేది కమ్యూనిస్టులు మాత్రమేనని కమ్యూనిస్టు భావజాలం సమస్యలు ఉన్నంత కాలం వ్యాప్తి చెందుతుంది తప్ప ఆగిపోదన్నారు. కేంద్ర హోంమంత్రి అమిత్‌షా మావోయిస్టులను తుద ముట్టిస్తామని చెప్పడం అవివేకమేనని అది సాధ్యం కాదన్నారు. ప్రసాద్ మరణంతో ఓ విప్లవ గొంతుక మూగబోయిందని ప్రసాద్ స్ఫూర్తితో భవిష్యత్ కార్యాచరణతో ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. సిపిఐ సీనియర్ నాయకులు పువ్వాడ నాగేశ్వరరావు, తెలంగాణ మీడియా అకాడమీ ఛైర్మన్ కె. శ్రీనివాసరెడ్డి, మాజీ శాసన సభ్యులు పల్లా వెంకటరెడ్డి, కొండబాల కోటేశ్వరరావు, గుమ్మడి నర్సయ్య, సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు పోతినేని సుదర్శన్ రావు, ఆంధ్రప్రదేశ్ సిపిఐ నాయకులు ముప్పాళ్ల నాగేశ్వరరావు, వనజ, కాంగ్రెస్ నాయకులు పువ్వాళ్ల దుర్గాప్రసాద్, తుమ్మల యుగంధర్, సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు పశ్య పద్మ, బాగం హేమంతరావు, ఎన్డి నేత ఆవునూరి మధు, ఐఏఎల్ నాయకులు పోట్ల మాధవరావు, జర్నలిస్టు సంఘాల నాయకులు కె.రాంనారాయణ, ఎ. ఆదినారాయణ తదితరులు ప్రసంగించగా గిడ్డంగుల కార్పోరేషన్ ఛైర్మన్ రాయల నాగేశ్వరరావు, మాజీ ఎంఎల్‌సి పోట్ల నాగేశ్వరరావు, సిపిఐ నాయకులు ఎస్‌కె సాబీర్‌పాషా, మహ్మద్ మౌలానా, బి. అయోధ్య, ప్రసాద్ కుమారుడు రాజా సాత్విక్, సతీమణి పోటు నిర్మల, తల్లి సక్కుబాయి, సోదరి పోటు కళావతి, పార్టీ రాష్ట్ర సమితి సభ్యులు జమ్ముల జితేందర్ రెడ్డి, యర్రాబాబు, ఎస్‌కె జానిమియా, ఏపూరి లతాదేవి, కొండపర్తి గోవిందరావు, సిద్దినేని కర్ణకుమార్, కార్పొరేటర్ బిజి క్లెమెంట్ తదితరులు పాల్గొన్నారు. ప్రజా నాట్యమండలి కళాకారులు ఆలపించిన గేయాలు ఆలోచింపజేశాయి.




## రైతులపై మళ్లీ టియర్ గ్యాస్

(మూడవ పేజీ తరువాయి)

భద్రతా సిబ్బంది మీడియాకు వెల్లడించారు. కాగా, జాబితాలో లేని వారి పేర్లను వారు అడిగారని, వారి వద్ద ఎలాంటి జాబితా ఉందో తమకు తెలియదని ఓ రైతు పేర్కొన్నారు. తమ గుర్తింపు కార్డులు చూసి తమను ఢిల్లీకి వెళ్లనీయాలని కోరామని, అప్పుడే అనుమతిను చూపిస్తామని చెప్పామన్నారు. దీంతో రైతులు, భద్రతా బలగాల మధ్య వాగ్వాదం చోటు చేసుకుంది. దీంతో భద్రతా బలగాలు రైతులపై బాష్పవాయు గోళాలను ప్రయోగించారు. గోళాలు తగలకుండా చాలా మంది ముఖాలు కప్పుకోగా, రక్షిత కళ్లద్దాలు ధరించి ఉన్న రైతు కొన్ని మీటర్ల దూరం వెనక్కి వెళ్లారు. కొందరు తడిసిన జనపనార సంచులతో తమను తాము కవర్ చేసేందుకు ప్రయత్నించారు. దీంతో శంభు సరిహద్దు వద్ద పరిస్థితి చాలా ఉద్రిక్తంగా మారిపోయింది. ఈ దాడిలో గాయపడిన రైతులను ఆసుపత్రికి తరలించాల్సి వచ్చిందని రైతులు పేర్కొన్నారు. తమ నిరసన ఆదివారం నాటికి 300 రోజులకు చేరుకుందని పంజాబ్ రైతు నాయకుడు సర్వన్ సింగ్ పంధేర్ అన్నారు. సంయుక్త కిసాన్ మోర్చా (నాన్ పొలిటికల్), కిసాన్ మజ్దూర్ మోర్చా బ్యానర్ క్రింద ఉన్న రైతులు ఫిబ్రవరి 13 నుండి పంజాబ్, హర్యానా మధ్య శంభు , ఖనౌరీ సరిహద్దు పాయింట్ల వద్ద ఢిల్లీకి ర్యాలీగా వెళ్లకుండా నిలిపివేశారు. రైతులు శాంతియుతంగా పాదయాత్రలు చేస్తుంటే ముందుకు వెళ్లకుండా ఎందుకు అడ్డుకున్నారని రైతు నేత తేజ్వీర్ సింగ్ ప్రశ్నించారు. తమ డిమాండ్లను కేంద్రం ఆమోదిస్తే రైతులు రాజధానికి పాదయాత్ర చేయాల్సిన అవసరం ఉండదన్నారు. గతంలో రైతులు ట్రాక్టర్లు, ట్రాలీలతో ఢిల్లీకి వెళ్లడంపై కేంద్ర మంత్రులు, బిజెపి నేతలు అభ్యంతరం వ్యక్తం చేశారని, ఇప్పుడు పాదయాత్ర చేస్తే వారి పరిస్థితి ఏంటని ప్రశ్నించారు. శుక్రవారం కూడా టియర్ గ్యాస్ షెల్స్ కారణంగా కొంతమంది గాయపడటంతో రైతులు తమ పాదయాత్రను నిలిపివేయవలసి వచ్చింది. ఎంఎస్‌పితో పాటు, రైతులు వ్యవసాయ రుణమాఫీ, రైతులు, రైతు కూలీలకు పెన్షన్, విద్యుత్ ఛార్జీల పెంపుదల, పోలీసు కేసుల ఉపసంహరణ (రైతులపై), 2021 లఖింపూర్ ఖేరీ హింసాకాండ బాధితులకు 'న్యాయం' డిమాండ్ చేస్తున్నారు. 2013 భూసేకరణ చట్టం పునరుద్ధరణ, 2020–21లో జరిగిన ఆందోళనలో మరణించిన రైతుల కుటుంబాలకు నష్టపరిహారం అందించాలని కూడా డిమాండ్ చేస్తున్నారు.



**భారీ బలగాల మోహరింపు**

రైతుల నిరసన నేపథ్యంలో శంభు సరిహద్దు, ఎన్‌హెచ్ 44 వద్ద హర్యానా, పంజాబ్ పోలీసులు అదనపు బలగాలను మోహరించారు. దీంతోపాటు అంబాల జిల్లాల్లో బిఎన్ఎస్ఎస్ సెక్షన్ 163 విధించారు. శంభు సరిహద్దు వద్ద రైతులను అడ్డుకునేందుకు కాంక్రీట్ దిమ్మలు, ఇనుప బారిగేట్లను ఇప్పటికే ఏర్పాటు చేయించారు. ఢిల్లీ వైపు నిరసనకు అనుమతి లేకపోవడంతో పోలీసులు, నిరసనకారుల మధ్య వాగ్వాదం మొదలై, క్రమంగా టియర్ గ్యాస్ ప్రయోగించే స్థాయికి చేరుకుంది. ఈ పరిస్థితి క్రమంగా పెరుగుతోంది.

**రైతుల ర్యాలీ నేటికి వాయిదా**

ఆదివారం రైతులు ఢిల్లీకి వెళ్లకుండా హర్యానా భద్రతా సిబ్బంది భాష్ప వాయు గోళాలు ప్రయోగిచండంతో దాదాపు 8 మంది రైతులకు గాయాలయ్యాయి. అందులో ఒకరిని ఆసుపత్రికి కూడా తరలించాల్సి వచ్చిందని రైతు నేత సర్వన్ సింగ్ పంధేర్ పేర్కొన్నారు. ఈ నేపథ్యంలోనే ర్యాలీని ఆదివారం రద్దు చేసుకుని సోమవారం నాటికి వాయిదా వేశామన్నారు. ఎస్‌కెఎం, కెఎంఎం సంఘాలు సమావేశమై భవిష్యత్తు కార్యాచరణను నిర్ణయిస్తాయన్నారు.

Printed & Published on behalf of M/s Navachethana Vignana Samithi by its president **Palla Venkat Reddy,** Printed at M/s Navachethana Vignana Samithi, 12-1-493/VA, Giriprasad Bhavan, Bandlaguda (Nagole), GSI Post Hyderabad-500068, Telangana State, Published at D.No 1- 6-75, Suravaram Venkataram Reddy Bhavan, Subhashnagar, Mahabubnagar - 509001, Telangana State, RNI TELTEL /2018/76758 **Editor : Makkena Subbarao,** E-mail : editorprajapaksham@gmail.com